ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

నిజామాబాద్ : fb.com/vaartha Digital

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

27-1-2026 మంగళవారం సంపుటి: 31 సంచిక: 356 పేజీలు: 10+4 వెల: 6.50




సోమవారం రిపబ్లిక్‌డే విశిష్ట అతిథులు ఐరోపా మండలి అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లేయన్‌తో ప్రధాని మోడీ










సోమవారం న్యూఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో ఘనంగా నిర్వహించిన రిపబ్లిక్ వేడుకల దృశ్యం. చిత్రంలో రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాని మోడీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, విశిష్ట అతిథులు ఐరోపా మండలి అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లేయన్

# అద్వితీయ రక్షణ పాటవం

- 77వ రిపబ్లిక్‌డే వేడుకల్లో ప్రతిబింబించిన భారత్ సైనిక సత్తా
- వందేమాతరం థీమ్‌తో ఘనంగా ఉత్సవాలు
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము
- విశిష్ట అతిథులుగా హాజరైన ఐరోపా మండలి అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లేయన్
- హాజరైన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు, ఎంపీలు

**న్యూఢిల్లీ,జనవరి 26:** దేశ రాజధాని ఢిల్లీలో 77వ గణతంత్ర వేడుకలు అట్టహాసంగా కనిర్వహించారు. వందేమాతరానికి 150 యేళ్ల ప్రధాన ఇతివృత్తంతో వేడుకలు నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు కర్తవ్యపథ్‌లో వేడుకలు ప్రారంభం కాగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం భద్రతాబలగాల గౌరవ వందనం స్వీకరించారు. జెండా ఆవిష్కరణ అనంతరం పరేడ్ ప్రారంభమైంది. 6050మంది సైనికులతో ఈ పెరేడ్ నిర్వహిం >>2









సోమవారం రిపబ్లిక్‌డే సందర్భంగా హైదరాబాద్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

# 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం

## హైదరాబాద్ ప్రతిష్ట పెంచేలా 2047 రైజింగ్ డాక్యుమెంట్

### హిల్ట్ పాలసీతో కాలుష్య పరిశ్రమలు సిటీ బయటకు తరలింపు

### గణతంత్ర వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి26:** మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా తెలంగాణ ముందుకు సాగుతుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. రైజింగ్ తెలంగాణ 2047 సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుందని తెలిపారు. సోమవారం 77వ గణతంత్ర దినోత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు.అనంతరం సైనికుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అమర జవాన్లకు గవర్నర్, సైనికాధికారులు నివాళులర్పించారు. ఈ వేడుకల్లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి శివధర్ రెడ్డిలు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. గణతంత్ర వేడుకల దృష్ట్యా పరేడ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రసంగించిన గవర్నర్ రాజ్యాంగం మనకు స్వేచ్ఛ, సమానత్వం ప్రసాదించిందని,భిన్నత్వంలో ఏకత్వం మన ప్రత్యేకత అని చెప్పారు. ప్రజా ప్రభుత్వం ఇటీవలే తెలంగాణ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించిందని పేర్కొన్నారు. హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచేలా తెలంగాణ రైజింగ్‌డాక్యుమెంట్‌ఉందని, రాష్ట్రాన్ని మూడు ఎకానమీజోన్లుగా విభజించారని >>2

## బిఆర్ఎస్ మాజీ ఎంపి సంతోష్ రావుకు సిట్ నోటీసులు

2లో

# ఆ నెయ్యి కల్తీయే..

### సిబిఐ ఛార్జిషీటులో వెల్లడి

**తిరుపతి,జనవరి 26ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూల తయారీకి 2021-2024 మధ్య కాలంలో కల్తీనెయ్యి సరఫరా చేశారనేది సిబిఐ సిట్ అధికారులు చివరిఛార్జిషీట్‌లో ఏసిబి కోర్టుకు నివేదించడం షాక్‌కు గురిచేస్తోంది. కల్తీనెయ్యి బాగోతంలో అత్యంత పవిత్రంగా భావించే తిరుమల లడ్డూల తయారీకి 60లక్షల కిలోల కెమికల్స్ వాడారని సిట్ వెలుగులోకి తెచ్చింది. ఈ కల్తీనెయ్యితో 20కోట్ల లడ్డూలు తయారుచేసి భక్తులకు విక్రయించారని కూడా పేర్కొంది. ఈ కేసు దర్యాప్తులో ఏడాదిన్నరకాలంగా సిబిఐ సిట్ అధికారులు కీలక వివరాలు సేకరించి తుది ఛార్జి షీట్ దాఖలు చేయడం సంచలనంగా మారింది. దర్యాప్తుకీలకదశకు చేరడంతో బోలేబాబా ఆర్గానిక్ డైరీ ప్రతినిధులు (ఎ1,ఎ2)గా టిటిడి కొనుగోళ్ళ,మార్కెటింగ్ విభాగం జిఎంలు ,నాణ్యత పరీక్షించే నిపుణులు, డైరీ ఆడిటర్స్ ఇలా అందరిపై పలు సెక్షన్‌ల క్రింద కేసు నమోదు చేశారు. సిట్ ఐజి మురళీరాంభా నేతృత్వంలోని డిఐజి, ఎస్పీలు ఈ కేసులో లోతైన దర్యాప్తు,విచారణ చేపట్టిన విషయం కూడా పొందుపరిచారు. కల్తీ నెయ్యి కేసులో ఇదివరకే సిబిఐ సిట్ అధికారులు అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో వేగవంతమైన దర్యాప్తు చేపట్టి పలువురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించింది. లడ్డూల తయారీలో వినియోగిస్తున్న ఆవునెయ్యిలో పలు నూనెలు కల్తీచేసి పంపారనేది ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు. కీలకంగా కల్తీ నెయ్యి సరఫరా వెనుక ఎవరి ప్రమేయం ఉంది అనేది తదుపరి న్యాయస్థానం ఆదేశాల మేరకు తేల్చునున్నారు. నూనెలు కల్తీచేసి పంపిన కాంట్రాక్టర్లు, ఇక్కడ పరీక్షించి వెనక్కుపంపాల్సిన టిటిడి అధికారులు, ల్యాబ్, మార్కెటింగ్, విజిలెన్స్ ఉద్యోగులు పాత్రపై నివేదికలు సమర్పించారనేది తెలుస్తోంది. 12మంది టిటిడి అధికారులు ప్రమేయంకూడా ఉందని సిట్ ఛార్జిషీట్‌లో పేర్కొ నడం కొసమెరుపు. మొత్తంమీద 250కోట్ల రూపాయలు కుంభకోణం జరిగిందనేది సిట్ నివేదికలు.

# 'ఎట్‌హోమ్'లో గవర్నర్ అవార్డులు



సోమవారం లోక్‌భవన్‌లో ఎట్‌హోమ్ కార్యక్రమానికి హాజరైనగవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు, డి.సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు

### హాజరైన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, డి.సిఎం భట్టి విక్రమార్క, రాష్ట్రమంత్రులు ఉత్తమ్, శ్రీధర్ బాబు ప్రభృతులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి26:** గవర్నర్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్ కార్యక్రమంలో భాగంగా, 2025 సంవత్సరానికి గాను ఎంపికైన వ్యక్తులు, సంస్థలకు సోమవారం సాయంత్రం లోక్‌భవన్‌లో ఎట్ హోమ్ కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేశారు.ఎట్ హోం కార్యక్రమానికి డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, బిజెపి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి శివోధర్‌రెడ్డి, పలువురు స్వాతంత్ర సమరయోధులు, పుర ప్రముఖులు,పద్మ అవార్డు గ్రహీతలు, అధికారులుహాజరయ్యారు. ఎట్ హోమ్ కార్యక్రమం ప్రారంభానికి ముందు వేదికపైనే మహిళా సాధికారత, గిరిజన అభివృద్ధి, రూరల్ హెల్త్ మెడికల్ ఫిలాంత్రపీ, కార్పొరేట్ వాలంటరింగ్ అనే నాలుగు విభాగాలలో విశిష్ట స్వచ్ఛంద సేవలు అందించిన వ్యక్తులు, సంస్థల ప్రతినిధులకు ఎక్సలెన్స్ పురస్కారాలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అందజేశారు. సంబంధిత రంగాలలో ఉత్తమ సేవలు అందించిన అభ్యర్థుల నుంచి నవంబర్ 2025లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాలలో నామినేషన్లు స్వీకరించబడ్డాయి.

ప్రముఖులతో ఏర్పాటు చేసిన అవార్డుల ఎంపిక కమిటీ ఈ నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి అవార్డు గ్రహీతలను ఎంపిక చేసింది.ఈ కమిటీకి భారత ప్రభుత్వ మాజీ కేంద్ర హోంశాఖ కార్యదర్శి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ చైర్మన్ కె. పద్మనాభయ్య అధ్యక్షత వహించగా, ఇతర సభ్యులుగా సి.ఆర్. బిశ్వాల్(ఐఏఎస్-రిటైర్డ్), డా.సునీతా కృష్ణన్(పద్మశ్రీ అవార్డు గ్రహీత) డా. చిన్నబాబు సుంకవల్లి, రమేష్ కాజా, జె. భవానీ శంకర్, జాయింట్ సెక్రటరీ టు గవర్నర్ ఉన్నారు. 2025 సంవత్సరానికి అవార్డులు పొందిన వారు-వ్యక్తులు1.మహిళా సాధికారత -రమాదేవి కన్నెగంటి, గ్రామీణ, పేద మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతూ, స్థిరమైన ఉపాధి అవకాశాలను కల్పించే సమగ్ర వ్యవస్థను అభివృద్ధి చేసి మహిళా సాధికారతకు విశేష సేవలు అందించారు.2.గిరిజన అభివృద్ధి -తోడసం కైలాస్, వాఘాపూర్, ఆదిలాబాద్ జిల్లాగోండీ భాషను పునరుజ్జీవింపజేస్తూ మహాభారతాన్ని నాలుగు నెలల్లో అనువదించడం, సుమారు 400 గిరిజన జానపద గీతాలు రచించడం ద్వారా గిరిజన సంస్కృతి పరిరక్షణకు విశేష కృషి చేశారు.3.రూరల్ హెల్త్ మెడికల్ ఫిలాంత్రపీ - డా. ప్రద్యుత్ వాఘ్రే,కైలాస్‌నాథ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గ్రామీణ పేదలకు ఛాతీ వ్యాధుల చికిత్సను సులభతరం చేసి, తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నారు.4.కార్పొరేట్ వాలంటీరింగ్ -వి. రాజన్న, సంస్థాగత సేవా కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రణాళికా బద్ధంగా అమలు చేస్తూ సమాజ సేవలో >>2

# రాజస్థాన్‌లో భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం

**జైపూర్, జనవరి 26:** గణతంత్ర దినోత్సవ వేడుకలు దేశ వ్యాప్తంగా అత్యంత ఘనంగా జరుపుకుంటున్న తరుణంలో రాజస్థాన్ పోలీసులు భారీ ఉగ్ర కుట్రను భగ్నం చేశారు. నాగౌర్ జిల్లాలోని ఒక వ్యవసాయ క్షేత్రంపై మెరుపు దాడి చేసిన పోలీసులు పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. 187 గోనె సంచుల్లో నింపిన 9,550 కిలోల అమ్మోనియం నైట్రేట్‌ను చూసి అధికారులు సైతం విస్తుపోయారు. గతేడాది నవంబర్ 10న ఢిల్లీలోని ఎర్ర కోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన పేలుడులో 15 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ ప్రమాదంలో ఉగ్రవాదులు వాడింది కూడా ఇదే అమ్మోనియం నైట్రేట్ కావడం ఆందోళన కలిగిస్తోంది. తాజా దాడుల్లో కేవలం కెమికల్ మాత్రమే కాకుండా, భారీ సంఖ్యలో డిటోనేటర్లు, ఫ్యూజ్ వైర్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సులేమాన్ ఖాన్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు అతడికి మైనింగ్ ముఠాలతో సంబంధాలు ఉన్నాయని ప్రాథమికంగా గుర్తించారు.

# అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు

### మునిసిపాలిటీల సమగ్ర అభివృద్ధికి కృషి : మంత్రి పొంగులేటి

**తొర్రూరు,జనవరీ 26,ప్రభాత వార్త :** రాష్ట్రంలోని మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వం అని రాష్ట్ర గృహ రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డిలు అన్నారు. సోమవారం తొర్రూర్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూపాయలు 15 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటత్ రామచంద్రునాయక్ జిల్లా కలెక్టర్ అద్వైత్ సింగ్‌లతో కలిసి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శంకుస్థాపనలు చేశారు అనంతరం పట్టణంలో స్థానిక పాలకేంద్రం నుండి 1000 బైకులతో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు తదనంతరం బిఆర్ కన్వెన్షన్‌లో స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన తొర్రూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ ఎన్నికల సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లను, దశలవారీగా అర్హులైన ప్రతిఒక్కరికి ఇండ్లు నిర్మించుకొనుటకు ఐదు లక్షలనగదు, రెండు పడకల గదుల నిర్మాణం చేపట్టి అందించడం జరుగుతుందన్నారు, ఈపథకంలో ఆర్థికఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్వయం సహాయకబృందాలలో సభ్యులుగా ఉన్న మహిళలకు వడ్డీలేని రుణాలను అందించి ఇల్లు నిర్మాణం కోసం ఇతర అవసరాల వ్యాపార అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు,



సోమవారం తొర్రూర్ సభలో ప్రసంగిస్తున్న మంత్రి పొంగులేటి



సోమవారం న్యూఢిల్లీలో భారత్ వ్యోమగామి శుభాంశు శుక్లాకు అశోకచక్ర అవార్డు ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి ముర్ము



రిపబ్లిక్‌డే వేడుకల్లో సైనిక విన్యాసాల దృశ్యం

# అద్వితీయ రక్షణ పాటవం

>> చారు. ఇందులో 17 రాష్ట్రాలు, 13 కేంద్ర ప్రభుత్వ శకటాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా భారతీయ వ్యోమగామి శుభాన్షు శుక్లాకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అశోక చక్ర ప్రదానం చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం ఐఎస్ఎస్‌ను సందర్శించినతొలి భారతీయుడిగా రికార్డుసాధించిన వ్యోమగామి గ్రూప్‌కెప్టెన్ శుభాంశు శుక్లాకు అశోకచక్ర లభించిన సంగతి తెలిసిందే. భారత్ సొంతంగాచేపట్టే మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్‌కు ఎంపికైన మరో వ్యోమగామి గ్రూప్‌కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్‌కు రెండో అత్యున్నత సౌర్యపురస్కారం 'కీర్తిచక్ర'ను ప్రధానంచేసారు.

గణతంత్ర వేడుకలకు ఐరోపా మండలి అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయెన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రిపబ్లిక్ డే వేడుకలో ప్రధాని మోడీ, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, కేంద్రమంత్రులు పాల్గొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో ఐదంచెల భద్రతను ఏర్పాటు చేశారు. 30 వేల మంది పోలీసులు, కేంద్ర బలగాలతో భద్రత కల్పించారు. కర్తవ్యపథ్ సమీపంలో 6 కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. యుద్ధహెలికాప్టర్లు అపాచితో పాటు ప్రచండ్ లాంటి తేలికపాటి హెలికాప్టర్ల విన్యాసాలు ఆకట్టుకు న్నాయి. ఆశ్వికదళంతొలిసారి ఈపెరేడ్‌లో పాల్గొంది. ఐరోపా సమాఖ్యకు చెందిన సైనిక విభాగంకూడా ప్రదర్శనలో పాల్గొనడం గమనార్హం. దేశ అభివృద్ధి ప్రస్థానం, సాంస్కృతికి వైవిధ్యం, సైనిక బలం, ఆపరేషన్ సింధూర్ అస్త్రప్రదర్శన ప్రధాన ఆయుధ వ్యవస్థలు ఈసారి రిపబ్లిక్‌డే ప్రదర్శనల్లో ఈ శకటాలు హైలైట్‌గా నిలిచాయి. ఐరోపాకమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండర్ లేయన్, యూరోపియన్ మండలి చీఫ్ ఆంటోనియా కోస్టాలు విశిష్ట అతిథులుగా పాల్గొని వేడుకలను వీక్షించి ముగ్ధులయ్యారు. ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్‌తోపాటు ప్రధాని నరేంద్రమోడీ, స్పీకర్ ఓం బిర్లా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్; హోంమంత్రి అమిత్‌షాలతోపాటు అందరు కేంద్రమంత్రులు ఈ వేడుకలకు హాజరయ్యారు. కాగా పెరేడ్‌లో బ్రహ్మోస్, ఆకాశ్ ఆయుధ వ్యవస్థలు, 300 కిలోమీటర్ల లక్ష్యాలను ఛేదించే సూర్యాస్త్ర రాకెట్ లాంచర్లు, యుద్ధట్యాంకు అర్జున్ వంటివి ప్రదర్శనలో బారులు తీరాయి. కొత్తగా వచ్చిన భైరవ్ లైట్‌కమాండో బెటాలియన్ శక్తిబన్ రెజిమెంట్ రెండు మూపురాల ఒంటెలు, జన్‌స్కార్ గుర్రాలు వంటివికూడా కవాతులోప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఆపరేషన్ సింధూర్‌లో వినియోగించిన రష్యా అస్త్రం ఎస్-400 క్షిపణి వ్యవస్థ అందరినీ ఆకట్టుకుంది. గగనతలంలో యుద్ధవిమానాలు వివిధ ఆకృతులు ప్రదర్శిస్తూ అబ్బురపరిచే ప్రదర్శనలిచ్చాయి. ధృవ్ చాపర్‌సింధూర్ జెండాతో గగనతలంలో కనిపించింది.

రిపబ్లిక్‌డే పెరేడ్‌లో నిర్వహించిన కవాతులో పారామిలిటరీ పురుషుల బృందానికి సిఆర్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సిమ్రన్ బాలా నేతృత్వం వహించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 26 యేళ్ల సిఆర్‌పిఎఫ్ ఎసి సిమ్రాన్ జమ్ముకాశ్మీర్‌కు చెందిన యువతి. 147 మంది పురుషుల బృందాన్ని ఆమె ముందుండి నడిపించడం అందరినీ ఆకర్షించింది. కర్తవ్యపథ్‌లో ఫోర్స్ బ్యాండ్ వినిపించిన దేశ్‌కే హమ్ హై రక్షక్‌అనే సిఆర్‌పిఎఫ్ గీతానికి అనుగుణంగా బృందం కవాతు జరిగింది. అదే విధంగా సుదూర లక్ష్యాలు ఛేదించగలిగే సూర్యాస్త్ర రాకెట్ లాంచర్ వ్యవస్థకు భారత సైన్యంలోని ఆర్టిలరీ రెజిమెంట్ అధికారిణి లెఫ్టినెంట్‌మెహక్ భాటి నాయకత్వం వహించారు. పెరేడ్‌లో సూర్యాస్త్ర బృందాన్ని లీడ్‌చేయడం తనకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ఒకే లాంచర్‌నుంచి బహుళ క్యాలిబర్ రాకెట్‌లను ప్రయోగించగలదని, సుదూర లక్ష్యాలఛేదనతో తన దాడుల సామర్థ్యం కూడా ఎంతో ధీటుగా ఉందని అన్నారు.

# గవర్నర్ అవార్డులు

>> కార్పొరేట్ బాధ్యతను బలోపేతం చేశారు.సంస్థలు 1. మహిళా సాధికారత - సాయి సోషల్ ఎంపవర్‌మెంట్ సొసైటీ, ఘట్‌కేసర్ గ్రామీణ, పట్టణ, గిరిజన మహిళలకు నైపుణ్య శిక్షణలు అందించి, ఇంటి ఆధారిత ఉపాధి అవకాశాలను కల్పిస్తూ వేలాది కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతోంది. 2. గిరిజన అభివృద్ధి - ఇండిజీనియస్ డవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (ఐడిఓ), గట్టుమల్ల (వి), భద్రాద్రి- కొత్తగూడెం జిల్లా వైద్యం, విద్య, పోషణ, సమాజాభివృద్ధి కార్యక్రమాల ద్వారా గిరిజనుల జీవన ప్రమాణాలను సమగ్రంగా మెరుగుపరు స్తోంది. 3. రూరల్ హెల్త్ మెడికల్ ఫిలాంత్రపీ - రామదేవ్‌రావు హాస్పిటల్, ఆరోగ్య శిబిరాలు, పాఠశాల ఆరోగ్య కార్యక్రమాలు, టీకాలు, ఉచిత శస్త్రచికిత్సల ద్వారా సేవలు అందించి గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోంది. 4. కార్పొరేట్ వాలంటీరింగ్ - గివ్ ఫర్ సొసైటీ, ఘట్‌కేసర్ మహిళల ఆరోగ్యం, పాఠశాల మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, వైద్య శిబిరాలు, విపత్తు సహాయ కార్యక్రమాల్లో చురుకైన సేవలు అందిస్తోంది. ప్రతి అవార్డుకు రూ. 2లక్షల నగదు బహుమతి, అవార్డు గ్రహీతల విశిష్ట సేవలను గుర్తించే ప్రశంసా పత్రాన్ని గవర్నర్ సోమవారం లోక్‌భవన్‌లో నిర్వహించిన ఎట్ హోమ్ కార్యక్రమంలో ప్రదానం చేశారు.

# దేశంలో ప్రాధాన్యతా రాష్ట్రంగా ఎపి

## రిపబ్లిక్ డే వేడుకల్లో జాతీయ పతాకం ఆవిష్కరించిన ఎపి సిఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి26,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలోనే అత్యంత ప్రాధాన్యత గల రాష్ట్రంగా ఏపీ అవతరిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.సీఎం చంద్రబాబు ఉండవల్లిలోని తన వ్యక్తిగత కార్యాలయం గణతంత్ర వేడుకలను నిర్వహించారు. గాంధీజీ, అంబేద్కర్ చిత్రపటాలకు నివాళి అర్పించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంచారు. అంతరంగ సిబ్బందికి సీఎం చంద్రబాబు కానుకలు అందజేసారు. దేశ ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

మహనీయుల త్యాగాలను మరోసారి స్మరించుకుందామని వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర విజన్ సాధనకు రాజ్యాంగ స్ఫూర్తితో కృషి చేద్దామని సీఎం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల తమ దావోస్ పర్యటనలో ఎన్నో అంశాలు చోటు చేసుకున్నాయన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద సముద్ర రవాణా ఏపీలో రాబోతుందని,అందుకు అనుగుణంగా కార్యచరణ చేపట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.ఏపీని పారిశ్రామికంగా ముందుకు తీసుకుని వెళ్తున్నామన్నారు.

ప్రస్తుతం ఏ రంగంలో అయినా పెట్టుబడులకు భారతదేశం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు అత్యుత్తమ గమ్య స్థానాలని వెల్లడించారు. 2047కు భారత్ ప్రపంచ శక్తిగా మారుతుందని ప్రతి ఒక్కరూ ఈ గ్రోత్ స్టోరీని చూస్తారనున్నారు. గతంలో పారిశ్రామికవేత్తలను ఏపీకి తేవాలంటే చాలా కష్టపడాల్సి వచ్చేదని ప్రస్తుతం తెలుగు ప్రజల విజయాలు, ఏపీ బ్రాండ్ సానుకూల అంశంగా మారాయని వెల్లడించారు. ప్రతీ రంగంలో నిర్దిష్టమైన లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కావాలి, ఏపీకి రావాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని ప్రోత్సహిస్తుందని తెలిపారు. దావోస్‌లో ప్రపంచ పారిశ్రామికవేత్తల ఆలోచనలు అర్థం చేసుకుని రాష్ట్రాన్ని బిజినెస్ ఫ్రెండ్లీ స్టేట్‌గా మారుస్తున్నామని తెలిపారు.నాలెడ్జ్ ఎకానమీ దేశ ఆర్థిక వ్యవస్థనే మారుస్తుంది. సంపద సృష్టి జరుగుతుందని తెలిపారు. భారతీయులు, అందులోనూ తెలుగు ప్రజలు టెక్నాలజీని అందిపుచ్చుకోవటంలో ముందుంటారని తెలిపారు.

టెక్నాలజీని సమర్థంగా వినియోగించుకుంటేనే అద్భుత ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.మరే దేశంలో లేని యువశక్తి భారత్ లో ఉంది. దేశానికి నేడు తిరుగులేని సమర్థ నాయకత్వం ఉంది. ప్రస్తుతం ఏ రంగంలో అయినా పెట్టుబడులకు భారతదేశం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు అత్యుత్తమ గమ్య స్థానాలు2047కు భారత్ ప్రపంచ శక్తిగా మారుతుంది. ప్రతి ఒక్కరూ ఈ గ్రోత్ స్టోరీని చూస్తారు.

గతంలో పారిశ్రామిక వేత్తలను ఏపీకి తేవాలంటే చాలా కష్టపడాల్సి వచ్చేది. ప్రస్తుతం తెలుగు ప్రజల విజయాలు, ఏపీ బ్రాండ్ సానుకూల అంశంగా మారాయి. ప్రతీ రంగంలో నిర్దిష్టమైన లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది.సీఎం చంద్రబాబు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది..ప్రోత్సహిస్తుంది. .గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తితో కొత్త చరిత్రకు నాంది పలికాం. ఇక ప్రపంచ దేశాలకు ఎగుమతి చేస్తాం అన్నారు,వ్యవసాయం రంగంతో పాటు వైద్య రంగంలోనూ డ్రోన్లను ఉపయోగించబోతున్నాం.2026లో డ్రోన్ అంబులెన్స్ కూడా ఏపీలో ప్రారంభించే ఆలోచన చేస్తున్నాం. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయి. 1000 కిలోమీటర్లకు పైగా సముద్ర తీరం, పోర్టులు, ఎయిర్ పోర్టులు ఏపీకి ఉన్న బలం.వచ్చే 3 , 4 ఏళ్లలో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోంది.

# జైళ్ల శాఖ డిఎస్‌పి రామయ్యకు రాష్ట్రపతి పోలీసు పతకం



సోమవారం జైళ్లశాఖ డిజి సౌమ్యా మిశ్రానుంచి రాష్ట్రపతి పోలీసుపతకం, సర్టిఫికెట్ అందుకుంటున్న డిఎస్‌పి వై. రామయ్య

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** జైళ్ల శాఖలో ఉత్తమ సేవలు అందించినందుకు డిఎస్‌పి వై. రామయ్యకు రాష్ట్రపతి పోలీసు పతకం లభించింది. సోమవారం నాడు పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన గణతంత్ర వేడుకల సందర్భంగా జరిగిన కార్యాక్రమంలో జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్రా నుంచి రాష్ట్రపతి పోలీసు పతకంతో పాటు మెరిటోరియల్ సర్టిఫికేట్‌ను డిఎస్‌పి రామయ్య అందుకున్నారు. జైళ్ల శాఖలో 20 యేళ్లకు పైబడి సర్వీసు కలిగిన రామయ్య ఉమ్మడి ఎపి హయాంలో జైళ్ల శాఖ జైలర్‌గా ఎంపికై అంచలంచలుగా పదోన్నతిపై డిఎస్‌పి స్థాయికి ఎదిగారు. జైళ్లలో సంస్కరణల అమలుకు ఆయన తన వంతు కృషి చేసినందుకు అనేక అవార్డులు, రివార్డులు అందుకున్నారు.

# నేడు గవర్నర్‌తో బిఆర్ఎస్ బృందం భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి26:** సింగరేణి కుంభకోణం అంశం పైన మంగళవారం భారత రాష్ట్రసమితి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మనుకలవనున్నది. తెలంగాణలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, ముఖ్యంగా సింగరేణి సంస్థలో వేల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని యథేచ్ఛగా లూటీ చేస్తోందని, ఈ భారీ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో పార్టీ ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలవాలని నిర్ణయించుకుంది. ఈభేటీ సందర్భంగా సింగరేణిలో జరిగిన అవినీతికి సంబంధించిన పూర్తి ఆధారాలు, లోతైన వివరాలతో కూడిన సమగ్ర నివేదికను బీఆర్ఎస్ నేతలు గవర్నర్‌కు సమర్పించనున్నారు. ఈ వ్యవహారంపై రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న గవర్నర్ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేయనున్నారు.

# హార్వర్డ్ వర్సిటీలో ప్రారంభమైన సిఎం రేవంత్ రెడ్డి తరగతులు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి26:** అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన కెనెడీ స్కూల్‌లో (కేంబ్రిడ్జ్, మసాచుసెట్స్) ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదివారం మధ్యాహ్నం (స్థానిక కాలమానం ప్రకారం) హాజరయ్యారు.తొలి రోజు పరిచయ కార్యక్రమాలతో పాటు 21వ శతాబ్దంలో నాయకత్వం.. కోర్సులో భాగంగా 'అధికార విశ్లేషణ- నాయకత్వం' అంశంపై తొలిసెషన్ ప్రారంభమైంది. సోమవారం ఉదయం 7గంటల నుంచే తరగతులు ప్రారంభమ య్యాయి. ఇందులో కేస్ అనాలిసిస్, వివిధ అంశాలపై తరగతులు, కన్సల్టేటివ్ గ్రూప్ వర్క్ వంటి కార్యక్రమాల్లో సభ్యులు పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం ఆరు గంటల వరకు (స్థానిక కాలమానం ప్రకారం) తరగతులు కొనసాగనున్నాయి. మరోవైపు బోస్టన్ ప్రాంతమంతా తీవ్ర శీతాకాల అత్యవసర పరిస్థితులు నెలకొన్నాయి. భారీ మంచు తుఫాను (ఫెర్న్) కారణంగా రెండు అడుగులకుపైగా (సుమారు 24 ఇంచులు) మంచు కురిసినట్లు సమాచారం.

**ముఖ్యమంత్రి విదేశీ పర్యటన అధికారికమేనని తెలంగాణ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టీకరణ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారిక విదేశీ పర్యటనలో ఎలాంటి సమాచారం లేకుండా వ్యక్తిగత పర్యటనపై వెళ్లారని సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంపై తెలంగాణ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పందించింది. తెలంగాణ సిఎం విదేశీ పర్యటనపై తప్పుడు ప్రచారం అంటూ ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చింది. ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, దురుద్దేశపూర్వకంగా చేసిన ప్రచారమే అని తెలిపింది.ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం ద్వారా సిఎం అధికారికంగా ఆమోదించిన పర్యటనకు సంబంధించిన వాస్తవాలను వక్రీకరించి, ప్రజలను తప్పుదారి పట్టించి గందరగోళం సృష్టించేందుకు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నం ఇది అని పేర్కొంది. ముఖ్యమంత్రి న్యూయార్క్ పర్యటన పూర్తిగా అధికారికమేనని, అన్ని విధివిధానాలకు అనుగుణంగా సమన్వయంతో నిర్వహించారని పేర్కొంది.ముఖ్యమంత్రి విదేశీ పర్యటనను ముందుగానే అధికారికంగా తెలియజేసి, నిబంధనల ప్రకారమే నిర్వహించారని తెలంగాణ ఫ్యాక్ట్ చెక్ విభాగం తెలిపింది. విదేశీ పర్యటనకు అవసరమైన అన్ని అనుమతులను ముందుగానే కేంద్ర ప్రభుత్వం నుంచి పొందినట్లు వెల్లడించింది. దావోస్ నుంచి అమెరికా చేరుకున్న అనంతరం, న్యూయార్క్ విమానాశ్రయంలో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ(ఎంఈఏ) అధికారులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారని తెలిపింది.

న్యూయార్క్‌లో ముఖ్యమంత్రి ప్రయాణానికి ఎంఈఏ అధికారిక వాహనాన్ని ఏర్పాటు చేసిందని, ఇది సాధారణ దౌత్య విధానాల్లో భాగమేనని తెలిపింది. శీతాకాలంలో తీవ్ర మంచు తుపానుల హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో విమాన ప్రయాణం చేయవద్దని ఎంఇఎ సిఎంని ఆదేశించిందని, వారి తదుపరి ప్రయాణాన్ని రోడ్డు మార్గంలో చేపట్టాలని తెలిపిందని గుర్తు చేసింది.ఎంఈఏ సూచనల మేరకు, బోస్టన్ వరకు రోడ్డు మార్గంలో ప్రయాణాన్ని ఎంఈఏనే ఏర్పాటు చేసిందని, ఇందులో హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్ వరకు ముఖ్యమంత్రి ప్రయాణం కూడా ఉందని తెలిపింది. ఉన్నతస్థాయి విద్యా సంస్థ నిర్దేశించిన కార్యక్రమాలపై పూర్తిగా దృష్టి సారించాల్సిన అవసరం ఉండటంతో, ఈ కాలంలో ఉద్దేశ్య పూర్వకంగానే ముఖ్యమంత్రి తన కార్యక్రమాలను నిరాడంబరంగా ఉంచినట్లు ఫ్యాక్ట్ చెక్ విభాగం తెలిపింది. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమైనవి, బాధ్యతారహితమైనవి, అలాగే ప్రజలను తప్పుదారి పట్టించేందుకు చేసిన ప్రయత్నాలు మాత్రమేనని పేర్కొంది.

# రిపబ్లిక్‌డే పెరేడ్‌లో ప్రత్యేక ఆకర్షణ 'ఆపరేషన్ సిందూర్'

**న్యూఢిల్లీ, జనవరి 26:** భారత దేశ 77వ రిపబ్లిక్ డే పరేడ్‌లో ఆపరేషన్ సిందూర్ శకటం ప్రత్యేకంగా ఆకట్టుకున్నది. దేశ త్రివిధ దళాల సంయుక్త శక్తి సామర్థ్యాలను ఇది ప్రతిబింబించింది. ఆపరేషన్ సిందూర్‌లో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ దళాలు ఎలా ఐక్యంగా పనిచేశాయో ఈ శకటం ద్వారా ప్రదర్శించారు. క్షిపణులు, ట్యాంకులు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ ప్రతిరూపాలతో దీనిని తీర్చిదిద్దారు. బ్రహ్మోస్ క్రూయిజ్ క్షిపణులు, ఆకాశ్ వైమానిక రక్షణ వ్యవస్థలు, సుదర్శన చక్రగా అభివర్ణించే ఎస్400 యూనిట్ల ప్రతిరూపాలను ప్రదర్శించారు. పెరుగుతున్న భద్రతా సవాళ్ల మధ్య సైనికపరంగా దేశ సంసిద్ధతపై స్పష్టమైన సందేశాన్ని ఇది ఇచ్చింది. దేశ సైనిక బలగాల ఉమ్మడి యుద్ధ సామర్థ్యాన్ని ఆపరేషన్ సిందూర్ శకటం చాటింది. గత యేడాది ఏప్రిల్‌లో జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో పర్యాటకులతో సహా 26 మంది మరణించారు. దీనికి ప్రతీకారంగా గత ఏడాది మే 7న ఆపరేషన్ సిందూర్ పేరుతో సైనిక చర్యను భారత్ చేపట్టింది. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)తో పాటు పాకిస్థాన్ సరిహద్దులోని ఉగ్రవాద శిబిరాలను భారత త్రివిధ దళాలు ధ్వంసం చేశాయి. వంద మందికిపైగా ఉగ్రవాదులు హతమయ్యారు. మరోవైపు ఈ సందర్భంగా పాక్ సైన్యం కవ్వింపులకు దిగింది. భారత సైనిక దళాలు ధీటుగా జవాబిచ్చాయి. పాక్‌కు చెందిన కీలక ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేశాయి. దీంతో గత ఏడాది మే 10న పాకిస్థాన్ ఆర్మీ కాళ్లబేరానికి వచ్చింది. భారత్‌తో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నది.

# బిఆర్ఎస్ మాజీ ఎంపి సంతోష్ రావుకు సిట్ నోటీసులు

## ఫోన్ ట్యాపింగ్ కేసు

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో బిఆర్ఎస్ మాజీ ఎంపి సంతోష్ రావుకు సిట్ అధికారులు సోమవారం నోటీసులు జారీ చేశారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయంలో గల సిట్ ఆఫీస్‌కు విచారణకు హాజరు కావాలని ఆదేశించారు, ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి రెండవ సిట్ ఏర్పాటయ్యాక ఎస్ఐబి మాజీ ఐజి ప్రభాకర్ రావుతో పాటు బిఆర్ఎస్ అగ్ర నేతలు హరీష్ రావు, కెటిఆర్‌లను విచారించడం తెలిసిందే. వీరిద్దరి విచారణ తరువాత మరికొందరు ముఖ్య నేతలను సిట్ విచారించనుందని వార్తలువస్తున్న తరుణంలో ఆపార్టీ మాజీ ఎంపి సంతోష్ రావుకు నోటీసులు జారీచేశారు. కాగా తనకు నోటీసులు జారీ అవడంపై సంతోష్ రావు మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తాను విచారణకు హాజరవుతానని, చట్టాన్ని గౌరవిస్తానని, సిట్ అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇస్తానని తెలిపారు. ఈవిషయంలో భయపడే సమస్యేలేదని ఆయన తెలిపారు.

# 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం

>> గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ స్కిల్ హబ్‌గా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. యువతలో నైపుణ్యాలను పెంచేందుకు తెలంగాణ సర్కారు కృషి చేస్తుందన్నారు. ఐటీఐలను అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్లుగా మార్చామని, ప్రజా ప్రభుత్వం ఇప్పటి వరకు 62,749 ఉద్యోగాలను భర్తీ చేసిందని వివరించారు. భూ వివాదాలు పరిష్కరించే విధంగా భూభారతి చట్టం తెచ్చినట్లుగా గవర్నర్ వివరించారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. సన్నవడ్లపై క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్‌ను చెల్లిస్తున్నామని, ఇప్పటి వరకు బోనస్‌గా రైతులకు రూ.1,453 కోట్లు ప్రభుత్వం చెల్లించిందన్నారు.26 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు గుర్తు చేశారు. గతేడాది నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు గిన్నిస్‌బుక్‌లో చోటు దక్కిందని పేర్కొన్నారు. రైతులకు 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్న గవర్నర్, మేడారం అభివృద్ధి కోసం రూ.251 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లుగా పేర్కొన్నారు. రాష్ట్రంలో 1.03 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం ఇస్తున్నారని చెప్పారు. 27 ఎకరాల్లో రూ.2,700 కోట్లతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మిస్తున్నామన్న ఆయన, విద్య, వైద్యాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యతలుగా తీసుకుందని తెలిపారు. విద్యార్థులకు సమాన అవకాశాల కోసమే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు మహిళలు ఇప్పటికే 267 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు చేశారని, దీంతో మహిళలకు రూ.9,105కోట్లు ఆదా అయిందని గవర్నర్ తెలిపారు. మహిళలను పెట్రోల్ బంక్‌లు, ఆర్టీసీ అద్దె బస్సులకు యజమానులుగా చేశామన్నారు. బ్యాంక్ రుణాల ద్వారా మహిళలకు రూ.40 వేల కోట్లు సమకూర్చామన్నారు.మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు కార్యాచరణ చేపట్టామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాల సెల్ఫ్ హెల్ప్‌గ్రూప్‌లు 236 ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్లు నడుపుకోవడంతో పాటు నారాయణపేట, సంగారెడ్డిలలో పెట్రోల్ బంక్‌లు నడుపుతున్నారని పేర్కొన్నారు.హ్యామ్ విధానంలో 7,450 కి.మీ పంచాయతీ రోడ్లను ప్రభుత్వం అభివృద్ధి చేయనుందని,తొలిదశలో రోడ్ల కోసం రూ. కోసం రూ.11,399 కోట్లు కేటాయించారని, 12 వేల కి.మీ. రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లుగా వెల్లడించారు. నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టినట్లుగా వివరించారు. హిల్ట్ పాలసీ ద్వారా కాలుష్య పరిశ్రమలను సిటీ వెలుపలకు తరలించనున్నట్లుగా తెలిపారు. చేనేత కార్మికులకు రూ.5లక్షల బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండేళ్ల క్రితం ఏర్పడిన ప్రజా ప్రభుత్వం గణనీయమైన విజయాలను సాధించి ప్రజల విశ్వాసాన్ని, ప్రశంసలను సంపాదించింది. రెండుసంవత్సరాల పాలనను పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ విజన్-2047 అనే దార్శనిక పత్రాన్ని ఆవిష్కరించింది. దీని ద్వారా ప్రభుత్వం సమగ్ర, సమానమైన, సుస్థిర అభివృద్ధికి రోడ్ మ్యాప్‌ను ప్రకటించిందని చెప్పారు. గత డిసెంబరులో జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రపంచ ప్రతినిధుల మధ్య రాష్ట్ర ప్రభుత్వం దార్శనిక పత్రాన్ని ఆవిష్కరించిందన్నారు.సియుఆర్ఈ - కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ-హైదరాబాద్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యం. నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించి, కాలుష్యాన్ని తగ్గిస్తూ ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాల్సి ఉంటుంది. పియుఆర్ఇ -పెరి అర్బన్ రీజియన్‌ఎకానమీ- ఔటర్ రింగ్‌రోడ్- రీజినల్ రింగ్ రోడ్ మధ్య గల ప్రాంతాన్ని తయారీ రంగానికి కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం.

ఆర్ఎఆర్ఇ- రూరల్‌అగ్రికల్చర్ రీజినల్ ఎకానమీ- రీజినల్ రింగ్ రోడ్‌కు బయటఉన్న రాష్ట్రంలోని ఇతర గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయం, హరిత ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయడంపై దృష్టిపెడతారని గవర్నర్ తన ప్రసంగంలో వివరించారు. ఈవిధానం ద్వారా రాష్ట్రంలో సమతుల్య, సమానమైన, సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వం విశ్వసిస్తోందని తెలిపారు. గిరిజన గ్రామమైన మేడారంలో రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా కేబినెట్ సమావేశాన్ని నిర్వహించారని,. మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు శాశ్వత మౌలిక వసతులకోసం రూ.251 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. రైతుభరోసా పథకం కింద ఎకరాకు సంవత్సరానికి అందించే సహాయాన్ని గతసంవత్సరం రూ.10,000నుంచి రూ.12,000కు పెంచి సాగుపెట్టుబడిని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 14.24 లక్షలమంది రైతుల నుంచి సుమారు 72 లక్షలమెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు చేశారని,. ఇప్పటివరకురూ. 17,079.50 కోట్ల చెల్లింపులు జరిగాయన్నారు. బలమైన వ్యవసాయ మౌలిక వసతుల కారణంగా తెలంగాణ దేశంలోనే వరి ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలిచిందని, ఫిలిప్పీన్స్ వంటి దేశాలకు బియ్యంను ఎగుమతి చేస్తూ అంతర్జాతీయ మార్కెట్‌లో నూతన ఉనికిని చాటిందన్నారు.

## వారం - వర్జ్యం

27-01-2026, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శ్రావణ కార్తె
నవమి రా.7.03
భరణి ఉ.11.07
వర్జ్యం : రా.10.16-11.46
దు.ఉ.8.56-9.41,
2) రా.10.34-11.19
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** ఉపయోగపడని వ్యక్తులనుకున్న వారే కార్యవిజయాలకు కారణం అవుతారు. ప్రయాణాలు,స్వల్ప ధనలాభం పొందుతారు.

**వృషభం:** మొండి వ్యవహారాలను కాలానికి వదిలి వేస్తారు. పెండింగ్ కేసులు పరిష్కార బాటలో ఉంటాయి.

**మిథునం:** చికాకు కలిగించే కుటుంబ పరిస్థితులకు దూరం పారిపోకుండా సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**కర్కాటకం :** అప్పు చేయకపోవటమే నిజమైన పొదుపని గుర్తిస్తారు. అంతర్గతంగా వేదాంతధోరణి అలవరచుకుంటారు.

**సింహం:** గతంకన్నా వృద్ధి బాగుంటుంది. అనేకాంశాలు అనుకూలంగా ఉంటాయి. ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం తగదు.

**కన్య :** ఇంటా బయటా సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**తుల :** భూ వివాదాలకు దూరంగా వుండండి. అమ్మకాలు కొనుగోలుకు సంబంధించిన వ్యవహారాలు స్తబ్దతగా ఉంటాయి.

**వృశ్చికం:** జీవిత భాగస్వామితో సంయమనం పాటించి సానుకూల ఫలితాలు సాధిస్తారు. సోదరుల కలయిక.

**ధనుస్సు:** సంతాన పురోభివృద్ధి బాగుంటుంది. ఆర్థికంగా కొంత వెనుక బాటు కనబడిన కనీస అవసరాలకు లోటు ఉండదు.

**మకరం:** మిత్రుల తోటి చర్చించి కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరుస్తారు.

**కుంభం:** దూర ప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. స్థలాల కొనుగోలు యత్నాలు ముమ్మరం చేస్తారు.

**మీనం :** కోర్టుకేసుల నుండి బయట పడుతారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అవకాశాలు లభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



డా. నోరి దత్తాత్రేయుడిని సన్మానిస్తున్న బసవతారకం ఇండో-అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ, ఆస్పత్రి వైద్యులు

## గణతంత్ర వేడుక కోట్లాది భారతీయుల ఆత్మగౌరవానికి ప్రతీక : బాలకృష్ణ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జనవరి 26, ప్రభాతవార్త:** బసవతారకం ఇండో-అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో హెడ్, నెక్ విభాగంలో చికిత్స పొందుతూ స్వరపేటిక తొలగించబడిన కేన్సర్ రోగులు, తమ శరీరాల్లో అమర్చిన కృత్రిమ స్వరపేటికలతో జాతీయ గీతా లాపన చేశారు. 75 మందికిపైగా రోగులు పాల్గొన్న ఈ వినూత్న జాతీయ గీతాలాపనను లండన్‌కు చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రపంచ రికార్డుగా గుర్తించింది. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా భరత మాతకు అర్పించిన అరుదైన నివాళిగా ఈ ఘనత నిలిచింది. నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ, జనవరి 26 కేవలం ఒక తేదీ కాదని, కోట్లాది భారతీయుల ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. రాజ్యాంగం చట్టాల పుస్తకం మాత్రమే కాదని, ప్రజాస్వామ్యానికి ప్రాణమని వ్యాఖ్యానించారు. భారత దేశం సంస్కృతి, చరిత్రలతో కూడిన మహత్తర దేశమని, యువత ఆవిష్కరణలు, మహిళల ప్రతిభ ద్వారా ప్రపంచ వేదికపై భారత్ సత్తా చాటుతోందన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించడం అంటే దేశాన్ని గౌరవించడమేనని స్పష్టం చేశారు. అనంతరం హాస్పిటల్ సెక్యూరిటీ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డును సాధించిన రోగులను బాలకృష్ణ స్వయంగా పరామర్శించి వారి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. తదుపరి హాస్పిటల్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో భారత ప్రభుత్వ రెండో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మ భూషణ్ అందుకున్న డా. నోరి దత్తాత్రేయుడిని ఆస్పత్రి యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కేన్సర్‌పై ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించడం గర్వకారణమని పలువురు కొని యాడారు. కేంద్ర ప్రభుత్వం తనకు పద్మభూషణ్ అవార్డు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందని డా. నోరి దత్తాత్రేయుడు తెలిపారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందని, రాబోయే రోజుల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో కేన్సర్ నివారణ, అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతానన్నారు. కేంద్రం ప్రోత్సాహంతో మరింత ఉత్సాహంగా సేవలు కొనసాగిస్తానని చెప్పారు.

### ఉపాధ్యాయ, ఉద్యోగుల పెండింగ్ బిల్లుల కొరకు

## నేడు బిజెపి ఎమ్మెల్సీల ధర్నా

### ఇందిరాపార్క్ దగ్గర ఆందోళన చేయనున్న ముగ్గురు ఎమ్మెల్సీలు

### మద్దతు ప్రకటించిన టిపియుఎస్

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని బిజెపి ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, ఏవిఎన్ రెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సి అంజిరెడ్డి డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నేడు(మంగళవారం) ఇందిరాపార్క్ దగ్గర ముగ్గురు ఎమ్మెల్సీలు ధర్నా చేపట్టనున్నారు. ఎమ్మెల్సీలు నేడు చేపడుతున్న ధర్నాకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) సంపూర్ణ మద్ధతు తెలుపుతుందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు వొడ్నాల రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ఏవియన్ రెడ్డి, మల్క కొమురయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్న మైల్ అంజిరెడ్డి నేడు(మంగళవారం) ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆర్థిక పరమైన పెండింగ్ బిల్స్, బెనిఫిట్స్, పిఆర్‌సి, డిఏల ప్రకటనకై నిరవధిక 24 గంటల ధర్నాకు తపస్ మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలిపారు. బిజెపి ఎమ్మెల్సీలు నిర్వహించనున్న ధర్నాకు టిపియుయస్ రాష్ట్ర శాఖ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయ, ఉద్యోగులు, విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగుల అన్ని రకాల పెండింగ్ బిల్లుల విడుదల కొరకు, పిఆర్‌సి అమలు కొరకు ముగ్గురు ఎమ్మెల్సీలు నేడు(మంగళవారం) ఉదయం 10 గంటల నుండి హైద్రాబాద్‌లో ధర్నాను నిర్వహించనున్నారని.. ధర్నాకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ పెద్ద ఎత్తున వచ్చి ధర్నాలో పాల్గొనాలని మద్దతు ఇవ్వాలని వారు పిలుపు నిచ్చారు. ఉద్యమం చేస్తేనే ఆర్థిక పరమైన ప్రయోజనాలు అందుతాయని, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ పెండింగ్ డిఏలు, పిఆర్‌సి అన్ని రకాల బిల్లులను జాప్యం చేస్తున్న ప్రభుత్వం తీరు సరైంది కాదన్నారు.

# డిజిపి కార్యాలయంలో ఘనంగా గణతంత్ర వేడుకలు

### పురానాహవేలి కొత్వాల్ హౌస్‌లో జెండా ఎగురవేసిన కమిషనర్ సజ్జనార్

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** దేశ 77వ గణ తంత్ర వేడుకలు డిజిపి కార్యాలయంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పర్సనల్ విభాగం అదనపు డిజి డిఎస్ చౌహాన్ జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో ఐజి రమణ కుమార్‌తో పాటు లీగల్ సెల్ ఎస్పీ సతీష్, డిజిపి కార్యాలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ యోగేశ్వరరావు సహా పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. కాగా సిటీ పోలీసు కమిషనర్ వి.సి సజ్జనార్ రెండుచోట్ల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మొదట పురానిహవేలిలో గల కొత్వాల్ హౌస్ (పోలీసు కమిషనర్ కా ర్యాలయం)లో ఉదయం ఎనిమిది గంటలకు జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ జోన్ డిసిని కిరణ్ ఖారేతో పాటు ఇతర అధికారు లు పాల్గొన్నారు. అనంతరం పేట్లాబూర్జులో గల సిటీ సాయుధ బలగం హెడ్ క్వార్టర్స్‌లో తొమ్మిది గంటలకు ఆయన జెండా ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో సాయుధ బలగం అధికారులతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో ఐసిసిసి డిసిపి పూజ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్య క్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు. కాగా బంజారా హిల్స్‌లోని ఎసిబి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ డాక్టర్ తరుణ్ జోషి జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికా రులు పాల్గొన్నారు. నేరెడ్‌మెట్‌లోని మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్, గచ్చి బౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయాల్లోనూ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. దీంతో పాటు నగరంలోని పలు పోలీసు విభాగాల్లోనూ గణతంత్ర వేడుకలు వైభవంగా జరిగాయి.



డిజిపి కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న పర్సనల్ విభాగం అదనపు డిఎస్ చౌహాన్. చిత్రంలో ఐజి రమణకుమార్ తదితరులు

# కృత్రిమ కండల కోసం స్టెరాయిడ్ ఇంజక్షన్ల సరఫరా

### టాస్క్‌ఫోర్స్‌కు చిక్కిన నేరగాడు

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** వ్యాయామశాలల్లో దేహదారుఢ్యం పెంచుకునేందుకు యువకులు కసరత్తులు చేయడం తెలిసిందే. అయితే ఇదే సమయంలో కొందరు కృత్రిమంగా కండలు పెంచుకునేందుకు అడ్డదారులు తొక్కుతుండడం తరచూ వెలుగు చూస్తోంది. ఇందుకుగానూ ప్రమా దకరమైన స్టెరాయిడ్ ఇంజక్షన్లను వాడుతున్నారు. వీటిని కొందరు నేరగాళ్లు జింల నిర్వాహకులకు లేదా కసరత్తులు చేసే యువకులకే అమ్ముతున్నా రు. వీటిని సర్కారు చాలాకాలం క్రితమే నిషేధించినా అమ్మకాలు మాత్రం కొనసాగుతూనే వున్నాయి. ఈ క్రమంలో అనేకసార్లు అనేక మంది నేరగా ళ్లు పట్టుబడగా తాజాగా పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులకు మరో నేరగాడు చిక్కాడు. ఇతని వద్ద నుంచి పెద్ద సంఖ్యలో స్టెరాయిడ్ ఇంజక్ష న్లను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ అదనపు డిసిపి ఇక్బాల్ సిద్దిఖీ సోమవారం మీడియాకు వెల్లడించారు. పాతబస్తీలో ని కిషన్‌బాగ్‌కు చెందిన మహమ్మద్ ఫైసల్ ఖాన్ (25) ఓ ప్రైవేటు కార్మికుడు. ఫర్నీచర్ దుకాణంలో పనిచేసే ఇతను తన సంపాదనతో కుటుంబ పోషణ కష్టం అవడంతో అడ్డదారి తొక్కాడు.

తనకు పరిచయం వున్న మెడికల్ షాప్‌ల నిర్వాహకుల నుంచి అక్రమంగా మెఫెం టర్‌మైన్ సల్ఫేట్ 30 ఎంజి అనే స్టెరాయిడ్ ఇంజక్షన్లను తక్కువ ధరకు కొనుగోలు చేసేవాడు. అనంతరం వీటిని తనకు తెలిసిన జిం నిర్వాహకులతో పాటు కసరత్తు లు చేసే యువకులకు ఎక్కువ ధరకు అమ్మేవాడు. వాస్తవానికి ఇలాంటి ఇంజక్షన్లు వాడడం వల్ల ఆరోగ్యం పాడవడంతో పాటు కొన్నిసార్లు మరణం సంభవిస్తుంది. వీటిని వాడి అనారోగ్యం పాలైన వారు, చనిపోయిన వారు కూడా వున్నారు.

కాగా ఫైసల్ ఖాన్‌పై నిఘా వుంచిన పశ్చిమ మండల పోలీసులు అతన్ని సోమవారం నాడు అత్తాపూర్ పరిధిలో పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఇతని వద్ద నుంచి 133 మెఫెంటర్‌మైన్ సల్ఫేట్ 30 ఎ ంజి ఇంజక్షన్లతో పాటు 100 డిస్పోసల్ సిరంజీలు, ఒక సెల్‌ఫోన్‌ను జప్తు చేశారు.

పట్టుబడ్డ స్టెరాయిడ్ ఇంజక్షన్ల విలువ లక్షా 60 వేల రూపాయ లుగా నిర్ధారించారు. నిందితుడిని తదుపరి విచారణ నిమిత్తం అత్తాపూర్ పోలీసులకు అప్పగించారు.

# ప్రశ్నిస్తే నోటీసులా?

### ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటా: హరీశ్‌రావు



ఉత్తమ ఉద్యోగుల సత్కార కార్యక్రమంలో పాల్గొన్న మాజీమంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ తప్పిదాలను ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే సిట్ నోటీసులు ఇస్తూ ప్రజాస్వామ్యంపై రేవంత్‌రెడ్డి సర్కార్ దాడి చేస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని టిఎన్జీవో భవనంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఉత్తమ ఉద్యోగుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేడు ఉద్యోగ సంఘాల నాయకులు పిఆర్‌సి అడిగే పరిస్థితి లేదని మాట్లాడినా.. ప్రశ్నించినా ఎసిబి దాడులతో ప్రభుత్వం భయ పెడుతుందన్నారు. విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంటు బకాయిలు అడిగితే కాలేజీలపై విజిలెన్స్ దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. సిఎం రేవంత్‌రెడ్డి దగ్గర డబ్బులు లేక కాదు ఇచ్చే మనసు లేకనే ఉద్యోగులకు బకాయిలు ఇవ్వడం లేదన్నారు. మూసీ సుందరీకరణకు లక్ష కోట్లు, ఫ్యూచర్ సిటీకి లక్ష కోట్లు, హ్యామ్ రోడ్ల కోసం రూ. 15 వేల కోట్లు, గోదావరి నీళ్ల మళ్లింపుకు రూ.8 వేల కోట్లు, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు రూ.20 వేల కోట్లు వెచ్చి స్తున్న సిఎం ప్రభుత్వ ఉద్యోగుల దగ్గరకు వచ్చే సరికి డబ్బులు లేవని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బడా కాంట్రాక్టర్ల కమీషన్ల కోసం రూ.30 వేల కోట్లు చెల్లిస్తున్న సిఎం రిటైర్డ్ ఉద్యో గుల బకాయిలు తీర్చడానికి మనసు రావడం లేదన్నారు. 5 డిఎలు,పిఆర్‌సి, జిపిఎఫ్ డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు యేడాది గడిచినా డబ్బులు రావడం లేదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 18 వేల మంది ఉద్యోగులు రిటైర్ అయితే నెల రెండు నెలల్లోనే అన్ని బెనిఫిట్లు ఇచ్చామని గుర్తు చేశారు. కెసిఆర్ రాష్ట్ర ప్రతిష్టను ఆదాయాన్ని పెంచితే రేవంత్‌రెడ్డి అద్భుతమైన రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టి దివాలా తీయిస్తున్నారని ఆరోపించారు.ఉద్యోగ, ఉపాధ్యా య సమస్యల పరిష్కారం కోసం మీలో ఒక్కడిలా ఉండి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తా..నిలదీస్తా, పోరాటం చేస్తానని తెలిపారు. ఉత్తమ ఉద్యోగులను ఆయన సత్కారించారు. కార్యక్రమంలో టిఎన్జీవోస్ ప్రతినిధులు పరమేశ్వర్, విక్రమ్‌రెడ్డి, కల్లెపల్లి శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నమ్మకమైన రవాణా సేవలు సంస్థకు ఎంతో ముఖ్యం

### బస్‌భవన్ గణతంత్ర వేడుకలో ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** నమ్మకంతో కూడిన రవాణా సేవలు సంస్థకు ఎంతో ముఖ్యమని ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి అన్నారు. భద్రత సంస్థకి జీవనాడి అని తెలిపారు. బస్ భవన్‌లో సోమవారం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలో టిజిఎస్‌ఆర్‌టిసి వీసీ అండ్ ఎండీ నాగిరెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. సంస్థ ఉన్నతాధికారులతో కలిసి మహనీయుల చిత్రపటా లకు పుష్పాంజలి ఘటించారు. నాగిరెడ్డి మాట్లాడుతూ.. ఈ రోజు మనం జెండా ఎగుర వేస్తున్నామంటే అది కేవలం ఒక ఆనవాయితీగా నిర్వహించుకొనే కార్యక్రమం కాదన్నారు. ఇది ఎంతో పవిత్రంగా నిర్వహించుకోవలసిన జాతీయ పండుగ అన్నారు. రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కులకే కాదు, మన మీద పెట్టిన బాధ్యతలకూ గుర్తు అని చెప్పారు. ప్రజలకు సేవ చేయడం..ప్రాణాల భద్రత కాపాడడం..ఇవే మన ఆర్‌టిసి ఉద్యోగుల అసలు గుర్తింపన్నారు. ఆర్‌టిసి కేవలం ఒక ప్రజా రవాణా సంస్థ మాత్ర మే కాదని... ఇది తెలంగాణ ప్రజల నమ్మక మన్నారు. ప్రతిరోజూ లక్షల మంది ప్రజలను గ్రామాల నుంచి పట్టణాలకు, పిల్లల్ని బడికి, ఉద్యోగులను పనికి, రోగుల్ని ఆసుపత్రికి చేరవేసేది మన బస్సులేనని, ఎండైనా, వానైనా, పండు గైనా ఆర్‌టిసి నడవాలే అన్న నమ్మకంతో మీరు స్టీరింగ్ పట్టుకుంటున్నారని అన్నారు. అటువంటి సేవకు తాను తలవంచి నమస్కరి స్తున్నానని తెలిపారు. ఈ గణతంత్ర దినోత్సవ రోజున మనమందరం ఒక మాట చెప్పుకుం దాం...ప్రతి ప్రయాణికుడు మన కుటుంబ సభ్యుడే, ప్రతి ట్రిప్ ఒక బాధ్యత. ప్రతి రోజు జీరో యాక్సిడెంట్ లక్ష్యం. జెండా రంగులు మనకు గుర్తు చేస్తున్నా యి. కార్యక్రమంలో ఈడీలు మునిశేఖర్, వెంకన్న, సీటీఎంలు శ్రీధర్, శ్రీదేవి, సీపీఎం ఉషాదేవి, జాయింట్ డైరెక్టర్ (విఅండ్ఎస్) నర్మద పాల్గొన్నారు.

## బిజెపికి 400 సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చి రాసి ఉండేది

### సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పల్లా వెంకటరెడ్డి

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** కేంద్రలో అధికారంలో ఉన్న బిజెపి ఆశించినట్లుగా గత పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు వచ్చి ఉంటే ఈపాటికే రాజ్యాంగాన్ని తిరగ రాసేందుకు సకల ప్రయత్నాలు చేసి ఉండేదని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి అన్నారు. మెజార్టీ రాకపోవడం వల్లే రాజ్యాంగం రక్షి ంచబడుతోందన్నారు. సిపిఐ అధ్వర్యంలో 77వ గణ తంత్ర వేడుకలను సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం ముగ్ధూమ్‌భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పల్లా వెంకటరెడ్డి జాతీయ పతకాన్ని ఎగుర వేశారు. అనంతరం పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం, లౌకికత్వం, సమాఖ్య స్ఫూర్తికి తిలోదకాలు ఇచ్చి బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో పరిపాలన కొనసాగించేదన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాలు పూర్తిగా స్వేచ్ఛను కోల్పోయన్నారు. సమాఖ్య స్ఫూర్తిగా పూర్తి విఘాతం కలిగిస్తున్న గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాల్సిందేనని తమ పార్టీ ఎప్పటి నుంచే డిమాండ్ చేస్తోందని గుర్తు చేశారు. మతోన్మాదమే ఏకైక అజెండాగా బిజెపి పాలన కొనసాగిస్తుండడం ఆందోళనకరమన్నారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవాల్లో అపశ్రుతి

### మంత్రి వాకిటి శ్రీహరికి తప్పిన పెనుప్రమాదం

**మక్తల్ టౌన్, జనవరి 26, ప్రభాతవార్త :** గణతంత్ర దినోత్సవాల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. మక్తల్ పట్టణ కేంద్రంలో జాతీయ పతాకావిష్కరణ చేస్తున్న సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జెండా కట్టె ఒక అంతస్తు పైనుండి స్థానిక మక్తల్ తహసీల్దార్ సతీష్‌కుమార్ జెండా ఆవిష్కరిస్తుండగా తాడు లాగడంతో జెండా కట్టె సగానికి విరిగిపడింది. అక్కడే ఉన్న పశుసంవర్ధక యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి త్రుటితో పెనుప్రమాదం తప్పింది. విరిగిపడ్డ జెండా కట్టెను పైకి అందించగా కార్యాలయ సిబ్బంది మిగతా కట్టెను తాడుతో కట్టి వది లేశారు. నిరక్ష్యంతో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఎన్నో సంవత్స రాలుగా ఆ దిమ్మె ఎండకు ఎండుతూ వానకు నానుతూ పుచ్చు పట్టడం తోనే ఇవాళ జెండా ఎగరేస్తున్న సమయంలో విరిగిపడిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జాతీయ జెండాకు అవమానం జరిగిందని అధికారులు పూర్తి నిరక్ష్యంగా వ్యవహరించాలని సోషల్ మీడియాలో ఆరోపణలు వచ్చాయి. గణతంత్ర వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరికి త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆయన పక్కనే ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు కున్సి నాగేందర్ కాలి బొటనవేలుపై జెండా విరిగిన కట్టె పడటంతో గాయమైంది. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆయనను జిల్లా ఆస్పత్రికి తరలించారు.



## రిపబ్లిక్ వేడుకల్లో గుండెపోటుతో ఎస్ఐ మృతి

**ముంబయి, జనవరి, జనవరి 26:** మహారాష్ట్రలోని ధరాశివ్ జిల్లాలో రిపబ్లిక్ వేడుకల సందర్భంగా సోమవారం విషాదఘటన చోటుచేసుకుంది. జెండా ఆవిష్కరణ జరుగుతుండగా విధినిర్వహణలో ఉన్న పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌జాదవ్ గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలారు. తీవ్ర ఆందోళనకు గురైన సిబ్బంది ఆయనను ఆస్పత్రికి తరలిస్తుండగా కన్నుమూశారు. ఈ ఘటన స్థానికులను తీవ్రదిగ్భ్రాంతికి గురిచేసింది. ధరాశివ్ జిల్లా ఉమర్గా టౌన్‌లో గణతంత్ర వేడుకలు జరుగుతుండగా మోహన్‌జాదవ్ గుండెపోటుతో కన్నుమూసినట్టు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ సోషల్‌మీడియాలో పోస్టు చేసింది. జాతీయ పతాకానికి అధికారులు, సిబ్బందితో కలిసి వం దనం చేస్తుండగా అకస్మాత్తుగా ఆయన గుండెపోటుతో వెనక్కి పడి పోయారని, దీంతో తలకు తీవ్రగాయమైందని తెలిపింది. వెంటనే సిబ్బంది ఆయనను ఉమర్గాలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని పేర్కొంది. గుండెపోటుతో ఆయన మరణించినట్టు ప్రాథమిక సమాచారంలో వెల్లడైనప్పటికీ మరిన్ని వివరాలు తెలియాల్సి ఉన్నాయి.

## భారత్‌ను అగ్రదేశంగా తీర్చిదిద్దాలి

### యువతకు ఎంపి ఆర్.కృష్ణయ్య పిలుపు

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త :** పేదరికం, దరిద్రం, నిరుద్యోగం, నిరక్షరాస్యత లేని దేశంగా, ఆకలి అజ్ఞానం అసమానతలు, దోపిడీ, పీడన వివక్ష, అణచివేతలు లేని దేశంగా భారత దేశాన్ని తీర్చిదిద్దాలని అందుకు విద్యార్థులు యువకులు కృషి చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కృష్ణయ్య విద్యానగర్ లో జాతీయ జెండా ఎగురవేసి ప్రసంగించారు. లాలా పేట, నామాలగుండు, నారాయణగూడ, అబిడ్స్, చిక్కడపల్లి లో కూడా జెండా ఎగురవేసి ప్రసంగించారు. దేశానికి గణతంత్రం వచ్చి 77 సంవత్సరాలు గడిచిన ఇంకా 48 శాతం మంది ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారు. అభివృద్ధి ఫలాలు ఈ వర్గాలకు అందడం లేదు. దేశ సంపద ఒక శాతం ప్రజల చేతుల్లోనే 95 శాతం సంపద కేంద్రీకృతం అయిఉంది. పెరిగిన, పెరుగుతున్న సంపద అన్ని వర్గాలకు పంపిణి కావాలి. చెందాలి. దీనిని వికేంద్రీకరణ చేసే విధానాలు కావాలి. "ఒకరి ఇంట్లో వండిన అన్నం తినే వారు లేక పడేస్తున్నారు ఇంకొకరి ఇంట్లో అన్నం లేక పస్తులు ఉంటున్నారు". ఒకరు కోట్ల రూ. బ్యాంకు బాలెన్సు తో ఏ ఖర్చు పెట్టాలో తెలియని వర్గం ఇంకొక వైపు డబ్బులు లేక అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకొనే వర్గం అలాగే ఒక పెద్ద బంగ్లాలో 40 రూములుంటే ఇద్దరు ముగ్గరు ఉన్నారు. ఇంకొక వైపు ఇళ్ళు లేక అద్దె ఇంట్లో ఒక రూములోని ఆరు మంది ఉన్న తీరు ఉంది. ఈ అసమానతలు తొలగిపోవాలి. అందుకోసం ప్రభుత్వ విధానాలు మార్చే వ్యవస్థ కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

# కర్రెగుట్టల్లో మళ్లీ పేలుళ్లకు పాల్పడిన నక్సల్స్

### యేడాది క్రితం ఆర్‌సిఐఇడి బాంబులు.. నేడు ఐఇడి పేలుళ్లు



కర్రెగుట్టల్లో ఐఇడి బాంబు పేలుళ్ల తరువాత అక్కడ నెలకొన్న దృశ్యం

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ సరిహద్దులో గల కర్రెగుట్టలో మావోయిస్టులు మరోసారి భద్రతా బలగాలను టార్గెట్ చేస్తూ పేలుళ్లకు పాల్పడ్డారు. గత ఏడాది ఫిబ్రవరి నెలలో ఛత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్ అడవులతో పాటు కర్రెగుట్టల్లో కొత్త తరహా ల్యాండ్ మైన్ (ఆర్‌సిఐఈడీ)లను అమర్చిన మావోయిస్టులు పది మంది పోలీసులను బలిగొనడం తెలిసిందే. ఈ సందర్భంగా పలువురు గాయపడడం విదితమే. దీని తరువాత భద్రతాబలగాలు తగిన జాగ్రత్తలతో కూంబింగ్ నిర్వహిస్తున్నారు. తాజాగా కర్రెగుట్టల్లో ఆదివారం సాయంత్రం ఆరు ఐఈడీ బాంబులు పే ల్చిన నక్సలైట్లు పోలీసులకు మరోమారు సవాల్ విసిరారు. ఈ ఘటనలో 10 మంది ఛత్తీస్‌ఘడ్ రిజర్వ్ బలగం సిబ్బందితో పాటు కోబ్రా బెటాలి యన్‌కు చెందిన ఒక ఎస్ఐ గాయపడ్డారు. వీరి పరిస్థితి నిలకడగా వుందని వైద్యులు చెప్పడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన దరి మిలా కర్రెగుట్టలో ఐఈడీ బాంబులతో పాటు ఇతర పేలుడు పదార్థాలను గుర్తించేందుకు పోలీసు జాగిలాలచే పోలీసులు తనిఖీలు చేబట్టారు.వచ్చే మార్చి నెలాఖరుకు దేశంలో నక్సలైట్ల ఏరివేత పూర్తిగా జరగాలని, మావోయిస్టు రహిత భారత్‌ను ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటిం చడం తెలిసిందే. ఇందులో భాగంగా నక్సల్స్ ప్రభావం ఎక్కువగా వున్న ఛత్తీస్‌ఘడ్‌తో పాటు వారి స్థావరాలు వున్న మహారాష్ట్ర, ఝూర్కండ్‌లలో మావోయిస్టుల ఏరివేతకు కేంద్రం ఆపరేషన్ కగార్ చేబట్టడం విదితమే. ఇందులో భాగంగా వేల సంఖ్యలో పారా మిలటరీ బలగాలను నక్సల్స్ స్థావరా లున్న చోట మోహరించడం, కూంబింగ్ నిర్వహిస్తుండడం తెలిసిందే. ఈ క్రమంలో వరుసగా జరుగుతున్న ఎదురు కాల్పుల్లో నక్సల్స్ తరపున భా రీగా ప్రాణ నష్టం వాటిల్లుతోంది. గడచిన మూడు నెలల్లో 200 మంది నక్సలైట్లు పోలీసు ఎన్‌కౌంటర్లో మరణించగా వెయ్యి మంది వరకు లొంగిపోయారు. అయితే మావోయిస్టులపై పోరులో దూసుకుపోతున్న భద్రతా బలగాలకు నక్సలైట్లు కొత్తగా రూపొందించి రహదారి పొడవునా అమర్చిన బాంబులు మరోసారి సవాల్ విసురుతున్నాయి. గత ఏడాది మార్చి నెలలో నక్సల్స్ ఆర్‌సిఐఈడీ బాంబులతో పోలీసులను హడలెత్తించడం తెలిసిం దే. సాధారణ మందు పాతరలకు భిన్నంగా అర కిలోమీటర్ లేదా కిలోమీటర్ దూరం నుంచి కూడా రిమోట్‌లతో పేల్చగల ఆర్‌సిఐఈడీలను నక్సల్స్ వాడడం పోలీసులను కలవర పరిచింది. గత ఏడాది ఫిబ్రవరి నెలలో ఈ తరహా బాంబుల కారణంగా పది మంది భద్రతా సిబ్బంది మరణించారు. అప్పట్లో ఈ బాంబులు పోలీసులను రెండు నెలల పాటు తీవ్ర ఇబ్బందులకు గురిచేశాయి. దీని తరువాత ఆర్‌సిఐఈడీలపై భద్రతా బలగాలు ఆరా తీయగా ఇదే సమయంలో వీటి గురించి నిఘా వర్గాలు మ రింత సమాచారం సేకరించి పోలీసులను హెచ్చరించాయి. 2024లో ఛత్తీస్‌ఘడ్‌లో 50 మందు పాతరలు పేలిన ఘటనలు జరిగాయి. ఇందులో కొన్ని పోలీసులను బలి తీసుకోగా మరికొన్నింటిని పోలీసులు గుర్తించి పేల్చి వేశారు. మరో 28 మందు పాతరలను పోలీసులు గుర్తించి వాటిని నిర్వీర్యం చేశారు. 2025లో జనవరి నుంచి మార్చి నెల వరకు మందు పాతరలు పేలడం లే దా వాటిని నిర్వీర్యం చేయడం, పోలీసులు పేల్చడం వంటి ఘటనలు వంద వరకు వుండడం గమనార్హం. ఈ ఘటనల తరువాత భద్రతా బలగా లు తేరుకుని ఛత్తీస్‌ఘడ్‌తో పాటు నక్సల్స్ కోటగా ఒకప్పుడు వున్న కర్రెగుట్టలో వరుసగా కూంబింగ్ చేబట్టి వారి స్థావరాలను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా భారీగా ఆయుధాలను జప్తు చేశారు. ఈ క్రమంలోనే కర్రెగుట్టలో బేస్ క్యాంపులు, ఫార్వర్డ్ విభాగాలను నెలకొల్పి భారీగా పోలీసులను మోహరించారు. ఈ బలగాలు నిత్యం కర్రెగుట్టలో కూంబింగ్ నిర్వహిస్తుండగా ఆదివారం సాయంత్రం వేళ ఒక్కసారిగా వరుసా ఆరు ఐఈడీ పేలుళ్లు సంభవించాయి. ఈ ఘటనలో 11 మంది భద్రతా బలగాలు గాయపడగా వారిని రాయ్‌పూర్ ఆసుపత్రికి తరలించారు. వీరి పరిస్థితి నిలకడగా వుందని వైద్యులు తెలిపారు. కర్రెగుట్టలో నక్సల్స్‌ను ఏరివేసిన ధీమాతో వున్న పోలీసులకు ఇప్పుడు వారు అమర్చిన బాంబులు భద్రతా బలగాలను కలవర పరుస్తున్నాయి. తాజా ఘటన నేపథ్యంలో కర్రెగుట్టలో సిఆర్‌పిఎఫ్‌కు చెందిన పోలీసు జాగిలాలచేత మందు పాతరలు, పేలుడు పదార్థాల కోసం గాలింపు చేబట్టారు.

**పేలుళ్లలో పంథా మార్చిన నక్సల్స్**

ఇదిలా ఉండగా భద్రతా బలగాలను టార్గెట్ చేస్తూ పేలుళ్లకు పాల్పడే నక్సల్స్ ఇప్పుడు పంథా మార్చారు. గతంలో మందు పాతరలను పోలీసుల క్యాంపులకు మూడు నుంచి ఏడు కిలోమీటర్ల దూరం వరకు పేల్చేవారు. ప్రస్తుతం ఇది మూడు కిలోమీటర్ల వరకు చేరిందని పోలీసులు చెబుతున్నా రు. పోలీసు బేస్ క్యాంపులు ఎక్కువవుతుండడంతో నక్సలైట్లు ఎదురు దాడికోసం ఆర్‌సిఐఈడీలతో పాటు ఐఈడీలను భారీగా వాడుతున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. గత ఏడాది ఛత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్ సిఆర్‌పిఎఫ్ బేస్ క్యాంపు వద్ద ఐదు కిలోల ఆర్‌సిఐఈడీని నక్సల్స్ అమర్చగా దీనిని పోలీసు జాగిలాలు గుర్తించడంతో పెద్ద ముప్పు తప్పింది. ఇటువంటి ఆర్‌సిఐఈడీని గత ఏడాది జనవరి నెలలో మరో బేస్ క్యాంపు సమీపంలో పోలీసులు గుర్తించారు. ఒకచోట మందు పాతర లభించగా దానికి సంబంధించిన యాంటెన్నా అర కిలోమీటర్ లేదా కిలోమీటర్ దూరంలో చెట్ల వద్ద వుండడం పోలీసులను షాక్‌కు గురిచేసింది. ఇటువంటివి మరిన్నింటిని ఛత్తీస్‌ఘడ్‌తో పాటు జార్కండ్ రాష్ట్రంలో భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. తాజాగా ఐఈడీ బాంబుల నేపథ్యంలో నక్సల్స్ విషయంలో భద్రతా బలగాలు అప్రమత్తంగా వుండాలని నిఘా వర్గాలు హెచ్చరించాయి.


తోటి మనిషికి నువ్వు చేసే మంచిపని నీ సంపద అతనికి పంచి ఇవ్వడం కాదు. అతని సంపద ఏమిటో అతనికి తెలియ చెప్పడం.

-టాల్‌స్టాయ్

# వణికిస్తున్న మంచుతుఫాన్

ప్రపంచానికి భూతాపం, వాతావరణ ప్రతాపాల కారణంగా ముప్పువాటిల్లుతుందని శాస్త్రజ్ఞులు చెప్తున్న హెచ్చరికల్లో ఎంతో నిజం ఉందనడానికి గత పదేళ్లుగా తీవ్రమవుతున్న ప్రకృతి ప్రకోపాలే సాక్ష్యం. గాలి, నీరు, భూమి, కాలుష్యం వేగంగా కరుగుతున్న హిమనీనదాలతో భూగోళం ప్రమాదం అంచుకు నెట్టబడుతోంది. ఒకటికాదు, రెండు కాదు లెక్కకు మించిన ఎన్నో ప్రకృతివిలయాలను భారతదేశం చూస్తోంది. ప్రపంచం కూడా ఈ విలయ విధ్వంసాలకు వేదికగా మారింది. ఎన్నడూ లేనట్లుగా కరువుకాటకాలు, హిమపాతం, తుఫాన్లు, టోర్నడోలు వంటి ప్రకృతి ప్రకోపాలకు ఎంతగానే ధన ప్రాణ, మాన నష్టం సంభవించింది. ఒకపక్క చలిగాలుత ప్రతాపం, మరోపక్క మండే ఎండలు ఈ భారతదేశం వెంటవెంటనే చవిచూసింది. అవన్నీ కాలం కాని కాలంలో వచ్చినవే. ప్రపంచంలో వాతావరణ పరిస్థితులు మారిపోతున్నాయి. 2025లో వాతావరణ పరిస్థితులు విచిత్రంగా గోచరించాయి. ఎప్పుడు వానలు పడతాయో ఎప్పుడు ఎండలుంటాయో తెలియనిపరిస్థితి కనిపించింది. ఏక మొత్తంగా చెప్పాలంటే వాతావరణ విధ్వంసం వల్లనే హిమపాతాలూ వేడిగాలులు వీస్తున్నాయి. ఈ తుఫానుకు ఆర్కిటిక్ బ్లాస్ట్ వల్ల ఉత్తరధృవం నుంచి వచ్చే అతిశీతల గాలులే కారణమని వివరిస్తోంది. వాతవరణ శాఖ తాజాగా అమెరికాలోనే కాదు అఫ్ఘానిస్థాన్, కశ్మీర్ ప్రాంతాల్లోకూడా మంచు బాగా కురుస్తోంది. అమెరికాలోని ఎన్నో ప్రాంతాలు భారీ హిమపాతం, వర్షపాతం, అతిశీతల వాతావరణంతో వణికిపోతున్నాయి. దాదాపు అన్ని నగరాల్లో ఆరుబయట ప్రదేశాల్లో అరడగుల మేరకు మంచు పేరుకునిపోయింది. ఆ దేశవ్యాప్తంగా అన్ని నగరాలు, అన్ని ప్రదేశాల్లోనూ భీకర స్థాయిలో మంచు కురుస్తోంది. ఇలాంటి సందర్భాలను 'మంచు తుపాను'గా వర్ణిస్తాయి. దీనివలన 20 కోట్ల మందికిపైగా జనంపై ప్రభావితం చూపిస్తోంది. 18 రాష్ట్రాల్లో జనజీవనం స్తంభించింది. ఇళ్లల్లో నుంచి మనుషులు బయటకు రాలేని పరిస్థితి ఉంది. నిత్యావసర వస్తువుల కోసం కూడా బయటకు రాలేకపోతున్నారు. చాలా రాష్ట్రాల్లో రవాణా సేవలు నిలిచిపోయాయి. దాదాపు పదివేలకుపైగా విమాన సర్వీసులను అననుకూల పరిస్థితుల రీత్యా రద్దు చేశారు. విద్యా లయాలకు తప్పనిసరిగా సెలవులు ప్రకటించారు. మరో 3,4 రోజులు జనావాసాల పైన కూడా మంచు పేరుకు పోయే అవకాశముందని వాతావరణ పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి అతి శీతలగాలుల వలన అమెరికాలు చెట్లు, కరెంటు స్తంభాలు నేలకొరిగాయి. ఈ సీజన్‌లో ఇదే పెద్ద మంచు తుఫాన్. ఈ దశాబ్దానికే ఇది అతి భారీ మంచుతుఫాన్‌గా నమోదయ్యే పరిస్థితి ఉంది. పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు మైనస్ 20 నుంచి మైనస్ 40దాకా పడిపోతున్నాయి. అత్యవసర సేవలు అందించలేనిపరిస్థితుల్లో జనజీవనం మందకొడిగా ఉంది. జార్జియాలో గత దశాబ్దకాలంలో అతిశీతల మంచు తుఫాన్ ఇదేనని భావిస్తున్నారు. జనం విపరీతమైన చలికి తట్టుకోలేకపోతున్నారు. స్వెట్టర్‌లు కూడా వారిని అతిశీతల ప్రభావం నుంచి రక్షించలేకపోతున్నాయి. అమెరికాలో దాదాపు లక్ష ప్రాంతాలకుపైగా కరెంట్‌కోతలు విధించాల్సి వచ్చింది. టెక్సాస్ నగరం మొత్తం చీకటిలో మునిగిపోయింది. టెక్సాస్‌లో ఐదేళ్లనాడు తుఫాను సమయంలో భారీ కంరెటు కోతలు జరిగిన సందర్భంగా వందలాది మంది మరణించిన సంఘటనలను గుర్తుకు తెచ్చుకుని ఈసారి పలుజాగ్రత్తలు పాటిస్తున్నారు. ఈసారి ఒక్కమరణం కూడా సంభవించని విధంగా పాలనా యంత్రాంగాలు పనిచేస్తున్నాయి. మంచు బీభత్సం బాగా పెరిగే అవకాశమున్న జార్జియా, మిసిసిపి రాష్ట్రాలలో అత్యయికస్థితిని ప్రభుత్వం ప్రకటించింది. దానాదీనా ప్రాథమిక అంచనాలో దాదాపు 16కోట్లమంది మంచు తుఫాను బాధితులుగా ప్రభుత్వం ప్రకటించింది. నైరుతి ప్రాంతంలో న్యూమెక్సికో నుంచి ఈశాన్యంలోని న్యూ ఇంగ్లాండ్ వరకు భారీ మంచు తుఫాను బారినపడిన వారే. ఇటు భారతదేశంలోనూ హిమపాతాలు వణికిస్తున్నాయి. పక్షం రోజుల్నాడే కశ్మీరును మంచుదుప్పటి కప్పేసిందన్న సమాచారం వచ్చింది. కాస్త తెరపిన పడ్డా మనుకున్న తరుణంలో హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలిలో భారీ హిమపాతం నమోదైంది. వారాంతపు సెలవులరీత్యా మనాలి జాతీయ రహదారిపై కిలోమీటర్ల కొద్దీ రహదారి ట్రాఫిక్ స్తంభించిపోయింది. పర్యాటకుల తాకిడి బాగా ఎక్కువైంది. గడ్డకట్టే చలిలో యాత్రికులు ఆరోగ్యపరంగా ఇబ్బందిపడ్డారు. దాదాపు ఈ సీజన్‌లో మూడునెలల తర్వాత తొలిసారిగా భారీ హిమపాతం నమోదైంది. ప్రభుత్వ యంత్రాంగం ఎక్కడికక్కడ ఆహారం, నీరువంటి సదుపాయాలు కలిగించడంలో ఎంతో కష్టతరంగా ఉంది. ఎంతోమంది పర్యాటకులు మార్గమధ్యంలోనే ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంలో హోటళ్ల ఆక్యుపెన్సీ కూడా బాగా తగ్గిపోయింది. హిమపాతంతో 685 రోడ్లు ఎక్కడికక్కడ మూసుకుపోయాయి. మంచుగడ్డ కట్టిన ప్రతి చోటా విద్యుత్ అంతరాయం నిలిపి వేశారు. ఇలా మంచుతుఫానులు ఏర్పడినప్పుడు అది కరిగేందుకు చాలా సమయం తీసుకుంటుంది. పెద్ద పెద్ద నగరాల్లో ఉష్ణోగ్రతలు 30నుంచి 40 డిగ్రీలకు పడిపోయాయి. మంచుతుఫాను హెచ్చరికలు వచ్చినప్పుడు ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాకుంటే ఎంతో భద్రతగా ఉన్నట్లే. రేపొచ్చే ఎల్‌నినో, లానినోల ప్రభావం దుష్ఫలితాలను ఇవ్వకుండా జాగ్రత్త వహించాల్సిన బాధ్యత ప్రజలదే. ప్రకృతిని నిందిస్తూ కూర్చోలేం. కనుక వైపరీత్యాల నుంచి అప్రమత్తంగా గట్టెక్కేయడమే మానవ ధర్మం!

మిమ్మల్ని కిందికి లాగినప్పుడు వినయంగా ఉండటం గొప్ప కాదు. కాని మిమ్మల్ని ఆకాశానికి ఎత్తుతున్నప్పుడు వినయంగా ఉండటమే గొప్ప.



సెయింట్ బెర్నార్డ్

లక్ష్యం ఎంత ఉన్నతంగా ఉంటుందో దాన్ని సాధించడానికి ఎంచుకునే మార్గం కూడా అంతే సమున్నతంగా ఉండాలి.



రామకృష్ణ పరమహంస

## ప్రజావాక్కు



### పెరుగుతున్న వీధికుక్కల బెడద

**వీధికుక్కల** బెడద పెరిగిపోతున్న ఈసమయంలో గాయాలపాలైనవారు. మరణిస్తున్నవారు అధికమవుతున్నారు. కుక్కలు కరవడం కొత్తేమీకాకపోయినా ఈమధ్యన కుక్కకాట్లు ఎక్కువైపోయాయి. జంతుప్రేమికులు కుక్కలను చంపితే కేసులుపెడుతున్నారు. ఈనేపథ్యంలో సుప్రీంకోర్టు కుక్కల నిర్వహణ మీద కొన్ని సూచనలు చేయగా జంతుప్రేమికులుఖండించారు. రాత్రివేళల్లోకార్యాలయాల నుంచో ఊరెళ్ళి వస్తుంటేనో కుక్కలు అరుస్తూ వెంటబడి తరుముతున్నాయి. దీనికెవరు బాధ్యతవహిస్తారు? ఇంట్లో కుక్కలు పెంచుకునే వారింటికి వెళ్ళాలంటే భయమేస్తున్నది. ఒక వేళ అవి కాటువేస్తే వైద్యానికి అయ్యే ఖర్చులు ఆ యింటి యజమానులు భరించాలని వైకారియస్ లయబిలిటి అనే చట్టం విశదకరించి చెప్పింది. దీనిని కోర్టువారు విడమరచి చెప్పి ఉంటే బాగుండేది.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### పుష్కరాలతో అంటురోగాలు

**రెండువేల** ఇరవైఏడులో జూన్‌లో గోదావరి పుష్కరాలు కుంభమేళాను తలపించే విధంగా భారీఎత్తున జరపాలని ముఖ్యమంత్రిగారు ప్రకటించారు. కుంభమేలాలో ఎంత మంది చనిపోయారోలెక్కలేదు. గంగానదిలో శవాలు గుట్టలుగుట్టలుగాకొట్టుకపోయాయి. కోట్లాదిమంది మునిగి మలమూత్రాలతో గంగానదిమొత్తం కాలుష్యంతో నిండిపోయింది. గోదావరికూడా అలాకావాలని ముఖ్యమంత్రిగారి ఉద్దేశ్యమా! పుష్కరాలలో మునిగితే నీళ్లలో మునిగినప్పుడు మూత్రం వదలడం జీవలక్షణం. కనుక అలోచించండి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ఒంగోలు

### డబుల్ బెడ్‌రూమ్స్ కేటాయించాలి

**ప్రస్తుతం** మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్ననేటి వరకైనా గత ప్రభుత్వం నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇప్పుడు ప్రస్తుతంఉన్నప్రభుత్వం ఇవ్వటానికేఅభ్యంతరం ఏమిటి? ఓట్ బ్యాంకింగ్ తప్పమరోటి లేదా అయినా లబ్ధిదారులకు కేటాయించాల్సిన కేటాయిస్తే తమకేమి నష్టం వాటిల్తుందోఅర్థంకావటంలేదు. ప్రజలను ఒక రకమైన ఆందోళనకు గురిచేస్తున్నారు. గతప్రభుత్వంలో డబుల్ బెడ్రూంలో నిర్మించిఇంతవరకు ఇవ్వకుండా జాప్యం చేయుచున్నారు. పథకాలను వినియోగించడం లేదు.

- సింగు లక్ష్మీనారాయణ, చింతకుంట, కరీంనగర్

### సైబర్ నేరాలను అరికట్టాలి

**ప్రభుత్వ రంగ** బ్యాంకుల్లో ప్రజలు తమ కష్టార్జితాన్ని పొదుపు రూపంలో దాచుకుంటారు. అయితే సైబర్ నేరగాళ్లు ప్రజలకు తెలియకుండానే ఈ సొమ్మును దొంగిలిస్తున్నారు. ఇలాంటి మోసాలకు గురైన బాధితులు పోలీసులకు, బ్యాంకులకు, సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదులు చేసినా అవి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండటం ఆందోళన కలిగించే విషయం. బ్యాంకులు తమ నిస్సహాయతను వ్యక్తంచేస్తూ, పోగొట్టుకున్న లేదా స్తంభింపజేసిన సొమ్మును తిరిగి పొందడం కేవలం సైబర్ సెక్యూరిటీ సిబ్బందిద్వారానే సాధ్యమని చెబుతున్నాయి. దీనివల్ల సామాన్య ప్రజలు తమ సొంత డబ్బు కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అధికారులు సకాలంలో స్పందించి, సాంకేతికతను ఉపయోగించి బాధితులు పోగొట్టుకున్న సొమ్మును తిరిగివచ్చేలా చేయాలి. అప్పుడే ప్రజలకు బ్యాంకింగ్ వ్యవస్థపై, చట్టంపై నమ్మకం కలుగుతుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రమాదంలో నాటో

**ట్రంప్ చర్యతో** నాటో కూడా ప్రమాదంలో పడేఅవకాశం ఉంది. ఇది ఎంత మాత్రం ఆమోదనీయం కాదు. ఎందుకని సైబీరియన్ సముద్రం అంచులనుండి పశ్చిమ భాగాన్ని తనగుప్పిట్లో పెట్టుకోవాలి అని ఒక ఆలోచన. మరోవైపు ఆర్కిటిక్ భాగాన్ని కూడా గుప్పిట్లో పెట్టుకోవాలి అనే ఆలోచన మరొక వైపు. ఈ ఏడాది ట్రంప్ పరిపాలన ద్వేషాలతో సాగింది అని చెప్పడం లేదు. ఆక్రమణ ఆధిపత్యం ఈ ఏడాది పాలనలో కనిపిస్తాయి. బహుశా ఇలాంటి నేపథ్యం నుండి ఒక సమానత్వ అభివృద్ధి కలిగిన ఎజెండాను తయారు చేయవలసిన బాధ్యత దక్షిణాసియా దేశాలపై ఉంది.

- భారత అవినాష్, జనగామ

### జీవనధార వ్యవసాయ బావులు

**రైతులకు** వ్యవసాయ సాగునీటి అవసరాల కోసం ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా గత 30 సంవత్సరాల క్రితం ప్రవహించిన జీవనధార బావులలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద, వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గతంలో త్రవ్వించిన జీవనద్వారాబావులలో పూడికలు తీయించాలి. తిరిగి ఒడలు పోయించాలి. వ్యవసాయ దిగుబడులను నిలువ చేసుకోవడానికి చిన్న గది నిర్మాణం కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి.

- రాపాక రవీందర్, జనగాం

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'సంక్షేమా'నికి దూరంగా గ్రామీణ పేదలు

**దేశసంపద, భూములు కొద్దిమంది వద్ద కేంద్రీకృతమై ఉంది. ఫలితంగా గ్రామీణపేదలు భూమికి దూరంగా, ఉపాధికి దూరంకాగా, పట్టణపేదలు ఉపాధికి దూరమై పేదరికంలో మగ్గుతున్నారు. పేదరికం ఫలితంగా బడికి దూరమై కుటుంబ పోషణలో పిల్లలు బాలకార్మికులుగా మారుతున్నారు. ఫ్యాక్టరీల ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారు. పిల్లలు ఈపరిస్థితుల నుంచి బయటపడాలంటే గ్రామీణ పేదలకు భూపంపిణీ జరగాలి. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి ఉపాధిని కల్పించాలి. ప్రజా అవసరాలను తీర్చే పరిశ్రమలు నెలకొల్పి శ్రామికులకు పనికల్పించి పరిశ్రమల్లో భాగస్వామ్యం ఇవ్వాలి. పట్టణపేదలకు ఉపాధి కల్పించాలి. అలాంటి విధానాలను కేంద్రప్రభుత్వం, అమలు చేయదు. దాని వర్గస్వభావం అందుకు వ్యతిరేకం. దాన్ని గ్రహించి పేదలే ఉద్యమం ద్వారా సాధించుకోవాలి.**

బొల్లిముంతసాంబశివరావు

ఏ దేశంలో అయినా బాలలే రేపటిపౌరులు. అలాంటి బాలల భవిష్యత్తు పాలకుల విధానంపై ఆధారపడి ఉంది. బాలల పరిస్థితే ఆ దేశపరిస్థితికి, ఆర్థికవిధానాలకు అద్దంపడుతుంది. ప్రపంచజనాభాలో పిల్లలు 25శాతం ఉన్నారు. వీరిలో సుమారు 16.8 కోట్ల మంది బాలకార్మికులుగా ఉన్నారు. ప్రతి 10మందిలో ఒకరు ఏదోఒక పనిలో నిమగ్నమై ఉన్నారని అంతర్జాతీయ కార్మికసంస్థ (ఐఎల్వో) అంచనా వేసింది. సుమారు 3.6 కోట్లమంది పిల్లలు బానిస బ్రతుకులు గడుపుతున్నారని ఆస్ట్రేలియాకు చెందిన మానవ హక్కుల బృందం దవాక్ఫ్రీ ఫౌండేషన్ నివేదిక పేర్కొంది. పేదరికం, నిరక్షరాస్యత, అక్రమ రవాణా వంటివాటి వల్ల ఎంతోమంది పిల్లలు బాలకార్మికులుగా మగ్గిపోతున్నారు. తీవ్రమైన దోపిడీ దౌర్జన్యాలకు గురౌతున్నారు. బాలకార్మిక వ్యవస్థవల్ల విద్య, ఆరోగ్యం వంటి ప్రాథమిక హక్కులు హరించబడుతున్నాయి. లైంగిక, ఆర్థికదోపిడీకి గురౌతున్నారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన భారతదేశంలో 23,68,17,000 మంది పిల్లలున్నారు. వీరిలో 11.45 మంది పిల్లలు బడికి దూరంగాఉన్నారు. అంటే ప్రతి వందమంది పిల్లల్లో 11శాతం మంది పాఠశాలకు దూరంగా ఉన్నారు. దీన్ని గణాంకాలు, కార్యక్రమాల మంత్రిత్వశాఖ 8.12.2025 విడుదల చేసింది. అంతర్జాతీయ కార్మికసంస్థ నివేదిక ప్రకారం భారతదేశంలో 5 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్సులోని కోటి, ఒకలక్ష మంది పిల్లలు పనుల్లో కొనసాగుతున్నారు. బాలకార్మికశ్రమ శక్తిలో 14 నుంచి 17 సంవత్సరాల పిల్లలు సుమారు 63 శాతం ఉన్నారని సేవ్ ది చిల్డ్రన్ సంస్థతెలిపింది. యూనిసెఫ్ నివేదిక ప్రకారం పట్టణ ప్రాంతంలో 5-14 ఏళ్లవయస్సులోని బాల కార్మికుల్లో 54శాతం పెరుగుదల కనిపించింది. భారతదేశరాజ్యాంగంలో సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వ్యక్తి గౌరవం ఆధారంగా కొత్తసామాజిక వ్యవస్థను స్థాపించాలని, పేదరికం, అజ్ఞానం, అనారోగ్యాన్ని నిర్మూలించడం లక్ష్యంగా పేర్కొన్నది. 78 సంవత్సరాల స్వతంత్ర పాలనలో అవి అమలు జరగలేదు. 2025 నాటికి బాలకార్మికులను నిర్మూలించాలన్న ఐక్యరాజ్యసమితి లక్ష్యం భారతదేశానికి ఆచరణ సాధ్యం కాదని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన 52వ నివేదికలో పేర్కొంది. ఆర్టికల్ 24 ప్రకారం 6-17సంవత్సరాలలోపు బాలబాలికలను ప్రమాదకరమైన పనుల్లో పెట్టుకోరాదు. ఆర్టికల్ 39 ప్రకారం బాలికల ఆరోగ్యపరిరక్షణకు ఆటంకంగా ఉండే పరిస్థితులను తొలగించాలి. ఆర్టికల్ 45 ప్రకారం 6 ఏళ్లలోపు బాల, బాలికల అందరికీ ఉచితవిద్య, సంరక్షణ అందించాలి. జాతీయ బాలలకు అన్నివిధాలరక్షణ, హక్కులను కాపాడాలని కేంద్రమంత్రిత్వశాఖ, బాలకార్మిక చట్టం 1986కు సవరణ చేసింది. దీనిప్రకారం 14 సంవత్సరాలలోపు పిల్లలను ఎలాంటి పనుల్లో చేర్చగూడదు. వారు బడిలో చదువుకోవాలి. ఇవేవీ అమలు జరగకుండా రాజ్యాంగంలో అలంకారప్రాయంగా ఉన్నాయి. ప్రతి బిడ్డకు సమాన అవకాశాలు, హక్కుల రక్షణ పూర్తి భాగస్వామ్యం గురించి జనవరి1, 1996న చేసిన తీర్మానంతో సహా ఐక్యరాజ్యసమితి అన్ని తీర్మానాలపైనా భారతదేశం సంతకం చేసింది. ఆచరణ మాత్రం సంతకాలకే పరిమితమైంది. ఐక్యరాజ్యసమితి తీర్మానాలకు భిన్నంగా భారత బాలల పరిస్థితులున్నాయి. ప్రపంచంలోని పోషకాహార లోపంలో



ఉన్న మూడవ బిడ్డ భారతదేశంలో ఉన్నారు. దేశంలోని నలుగురు పిల్లల్లో ముగ్గురు రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రతి రెండవ బిడ్డ బరువు తక్కువగా ఉన్నాడు. ప్రాథమిక విద్యలోనే చదువుమానేసే పిల్లలు 71.01 ఉన్నారు. దేశం మొత్తంలో 11కోట్ల, 4లక్షల మంది బాలకార్మికులుగా ఉన్నారు. తక్కువ బరువుతో పుట్టినపిల్లలు 44శాతం ఉన్నారు. 3సంవత్సరాలకంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల్లో 79 శాతం మందిపిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారు. భారతదేశంలో పిల్లల పరిస్థితులు చాలా దుర్భరంగా ఉన్నాయి. చాలామంది పిల్లలకు బ్రతికే అవకాశం తక్కువగా ఉంది. వారికి ఆహారం లభించకపోవడమే కాదు, విద్యా అవకాశాలు కూడా లేవు. షెడ్యూల్డ్ కులాలు, తెగల బాలికలలో అక్షరాస్యతరేటు42 శాతం మాత్రమే. వంద మంది బాలికల్లో 30శాతం మందిమాత్రమే ప్రాథమిక విద్యను పూర్తిచేశారు. వీరిలో ఇంకా బాల్యవివాహాలు కొనసాగుతూనే ఉన్నాయి. భారతదేశంలో పిల్లల ఎదుగుదల చాలా తక్కువగా ఉంది. ఆర్థికపరిస్థితులే కాకుండా కులం కూడా అవరోధంగా ఉంది. అగ్రకుల పెత్తందారీ, ఆర్థిక సామాజిక తరగతుల పిల్లలతో పోలిస్తే, పేదల అణగారిన తరగతులకు చెందిన చిన్నారుల ఎదుగుదల లోపం అధికంగా ఉంది. ఆదివాసి దళిత పిల్లల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. 5 ఏళ్లలోపు పిల్లల్లో 35 శాతం మంది ఎదుగుదల సమస్యతో బాధపడుతున్నారు. ప్రపంచంలోని ఇతర దేశాలే కాదు, సబ్‌సహారాలోని ఆఫ్రికా దేశాలకన్నా భారతదేశంలోని పిల్లల్లోనే ఎదుగుదల లోపం ఎక్కువగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఎదుగుదల లోపంతో బాధపడుతున్న పిల్లల్లో దాదాపు 70శాతం మంది భారత్, ఆఫ్రికాదేశాల్లోనే ఉన్నారు. వీరిలో 35.7 భారత్లో ఉంటే, ఆఫ్రికాలో 33.6 శాతం ఉన్నారు. ప్రభుత్వాలనిర్లక్ష్యపూరిత విధానాలు, పేదరికం, పోషకాహార లోపంవల్ల పిల్లలు ఎదుగుదల సమస్యను ఎదుర్కొంటున్నారని నిపుణుల విశ్లేషణలు చెబుతున్నాయి. బాలకార్మికులుగా ప్రమాదకరమైన పనుల్లో పనిచేయడం వల్ల, పోషకాహార లోపంవల్ల ప్రతిసంవత్సరం భారతదేశంలో లక్షలాది మంది బాలలు చనిపోతున్నారు. 2015లో 5సంవత్సరాలలోపు చిన్నారులు 10 లక్షలకుపైగా మరణించారు. ఇది ఆసంవత్సరంలో ప్రపంచంమొత్తంమీద అత్యధికమని ప్రముఖ లాన్సెట్ పత్రిక తెలిపింది. బడికివెళ్లి ఆటపాటలతో జీవించాల్సిన పిల్లలుబడికి దూరమై బాలకార్మికులుగా పోషకాహారలోపం వల్ల అనేక ఆరోగ్యసమస్యలను ఎదుర్కొంటూ ప్రాణాలు కోల్పోతున్నారు. అందుకు కారణం వారి కుటుంబాల ఆర్థికపరిస్థితులే కారణం. గతప్రభుత్వాలు ముఖ్యంగా నేటి కేంద్రప్రభుత్వం పేదలకోసం కాకుండా, బడాపెట్టుబడిదారుల, బడాభూస్వాముల, సంపన్న వర్గాల, సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కోసం పనిచేశాయి, చేస్తున్నాయి. కేంద్రప్రభుత్వం ప్రభుత్వ దేశ సంపదలను, సహజవనరులను బడాపారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నది. సెజ్లు, పరిశ్రమలపేరుతో భూములు కూడా వారికి కట్టబెడుతున్నది. దేశసంపద, భూములు కొద్దిమంది వద్ద కేంద్రీకృతమై ఉంది. ఫలితంగా గ్రామీణపేదలు భూమికి దూరంగా, ఉపాధికి దూరంకాగా, పట్టణపేదలు ఉపాధికి దూరమై పేదరికంలో మగ్గుతున్నారు. పేదరికం ఫలితంగా బడికి దూరమై కుటుంబ పోషణలో పిల్లలు బాలకార్మికులుగా మారుతున్నారు. ఫ్యాక్టరీల ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారు. పిల్లలు ఈపరిస్థితుల నుంచి బయటపడాలంటే గ్రామీణ పేదలకు భూపంపిణీ జరగాలి. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి ఉపాధిని కల్పించాలి. ప్రజా అవసరాలను తీర్చే పరిశ్రమలు నెలకొల్పి శ్రామికులకు పనికల్పించి పరిశ్రమల్లో భాగస్వామ్యం ఇవ్వాలి. పట్టణపేదలకు ఉపాధి కల్పించాలి. అలాంటి విధానాలను కేంద్రప్రభుత్వం, అమలు చేయదు. దాని వర్గస్వభావం అందుకు వ్యతిరేకం. దాన్ని గ్రహించి పేదలే ఉద్యమం ద్వారా సాధించుకోవాలి. •

# డిజిటల్ శబ్దాల్లో మసకబారుతున్న శతకబోధన

తిప్పర్తి శ్రీనివాస్

తెలుగు సాహిత్య చరిత్రలో శతకాలు ఒక ప్రత్యేకమైన, విలువైన స్థానం కలిగి ఉన్నాయి. నైతిక బోధ, జీవిత సత్యాల ఆవిష్కరణ, సామాజిక విమర్శ, భక్తి భావంఇవన్నీ సులభమైన ఛందస్సులో, సామాన్యుడికి చేరువగా చెప్పిన సాహిత్య రూపమే శతక పద్యాలు. వేమన, సుమతి, భాస్కర శతకం, దాశరథి శతకం వంటి రచనలు తరతరాలుగా ప్రజల నోట నానుతూ, వారి ఆలోచనలను తీర్చిదిద్దాయి. అయితే ఆధునిక యుగంలోకి అడుగుపెట్టిన తర్వాత శతక పద్యాలకు ఆదరణ క్రమంగా తగ్గిపోతోందన్న వాస్తవం ఆందోళన కలిగించేది. డిజిటల్ యుగం మన చదువు అలవాట్లను పూర్తిగా మార్చేసింది. క్షణాల్లో సమాచారం కావాలన్న ఆత్రుత, చిన్న వీడియోలు, రీల్స్, సోషల్ మీడియా పోస్టుల మాయలో పడి మనసు లోతైన పఠనానికి దూరమవుతోంది. శతక పద్యం చదవాలంటే ఓర్పు, ఆలోచన, అంతర్ముఖత అవసరం. కానీ ఆధునిక మనిషి జీవితంలో ఇవన్నీ అరుదైపోయాయి. త్వరగా చదివి, వెంటనే మరిచిపోవాలి. అన్నధోరణి పెరుగుతున్న కొద్దీ శతకాల వంటి సాంప్రదాయ సాహిత్యానికి స్థానం తగ్గుతోంది. విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులు కూడా ఈ పరిస్థితికి కారణమని చెప్పక తప్పదు. ఒకప్పుడు పాఠశాలల్లో శతక పద్యాలు పాఠ్యాంశాలుగా ఉండేవి. విద్యార్థులు వాటిని కంఠస్థం చేసి, వాటి భావాన్ని చర్చించేవారు. నేడు పరీక్షా కేంద్రిత విద్య, మార్కుల పోటీ, ఇంగ్లీష్ మాధ్యమ ప్రాధాన్యం కారణంగా మాతృభాషా సాహిత్యానికి తగిన ప్రాధాన్యం దక్కడం లేదు. ఫలితంగా శతకపద్యాలు యువతకు పాతకాలం వాటిగా మాత్రమే కనిపిస్తున్నాయి. అదే సమయంలో, ఆధునిక సాహిత్య రూపాలు స్వేచ్ఛా ఛందస్సు కవిత్వం, నవలలు, కథలు ప్రస్తుత జీవన సమస్యలను నేరుగా ప్రతిబింబిస్తున్నాయన్న భావన బలపడింది. శతకాలు ఎక్కువగా నైతికబోధ, ఆధ్యాత్మికత చుట్టూ తిరుగుతాయన్న అపోహ కూడా ఉంది. కానీ వాస్తవానికి వేమన శతకం వంటి రచనలు సమాజంలోని మూఢాచారాలను, అసమానతలను తీవ్రంగా ప్రశ్నించాయి. ఈ కోణాన్ని మనం సరిగ్గా ఆవిష్కరించకపోవడమే శతకాల పట్ల ఆసక్తి తగ్గడానికి ఒకకారణం. మరో ముఖ్యమైన అంశం ప్రచారం లోపించడం. ఆధునిక సాహిత్యానికి వేదికలు, సాహిత్య సమావేశాలు, మీడియా చర్చలు లభిస్తున్నాయి. కానీ శతకాలపై సమకాలీన చర్చలు చాలా అరుదు. టెలివిజన్, డిజిటల్ మాధ్యమాల్లో శతకాలను ఆధునిక సందర్భాలకు అన్వయిస్తూ ప్రజలకు చేరవేయగలిగితే, వాటి విలువ మరింత స్పష్టమవుతుంది. పాతదాన్ని పాతదిగా కాకుండా, నేటి జీవితానికి అర్థవంతంగా చూపించడంలోనే అసలు సవాలు ఉంది. అయితే ఈ తగ్గుతున్న ఆదరణను పూర్తిగా నిరాశగా చూడాల్సిన అవసరం లేదు. శతకపద్యాల్లో ఉన్న సంక్షిప్తత, గాఢమైన భావం నేటి కాలానికే మరింత అవసరం. ఒకే పద్యంలో జీవనతత్వాన్ని చెప్పగలసామర్థ్యంశతకాలకుఉంది. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి ఆడియో శతకాలు, వీడియో వివరణలు, సోషల్ మీడియా కోట్స్ రూపంలో వాటిని పరిచయంచేస్తే యువతలో ఆసక్తి మళ్లీ చిగురించవచ్చు. విద్యాసంస్థలు కూడా శతకాలను కేవలం పాఠ్యాంశంగాకాకుండా, జీవిత విలువల బోధనగా పరిచయం చేయాల్సిన అవసరంఉంది. ముగింపుగా చెప్పాలంటే, ఆధునిక యుగంలో శతకపద్యాలకు తగ్గుతున్న ఆదరణఅనేది కాలప్రవాహంలో వచ్చిన మార్పుల ప్రతిబింబమేకానీ, శతకాల విలువ తగ్గినట్టు కాదు. వాటిని చదివే విధానం, పరిచయం చేసేతీరులో మార్పురావాలి. తెలుగు సాహిత్యానికి పునాదైన ఈశతక సంప్రదాయాన్ని నిర్లక్ష్యంచేయడమంటే మన సాంస్కృతిక మూలాలను విస్మరించినట్టే. ఆధునికతతో పాటుసంప్రదాయానికి సమతుల్యం సాధించినప్పుడే సాహిత్యం నిజమైన అర్థం. •

# అశాంతివైపు జారుతున్న ప్రపంచం

వి.వి.రమణ

అమెరికా లేకపోతే నాటో దేశాలకు విలువే లేదంటూ మిగిలిన దేశాలకు చులకన భావనతో చూడటం, రాత్రికి రాత్రే ఒక దేశాధ్యక్షున్ని బంధించి ఆదేశానికి సంక్షోభానికి గురిచేసి వారి చమురు సంపదను హస్తగతం చేసుకోవడం, ప్రపంచం భవిష్యత్తు కోసం వాతావరణ మార్పులపై ఎన్నో ఒప్పందాలు చేసుకున్న వాటిని సైతం అసలు విలువే లేదనితుంగలో తొక్కడం, భారత్, పాక్ యుద్ధాన్ని నా హెచ్చరికలతో ఆపాననే అబద్ధపు పబ్లిసిటి చేయడం, మెక్సికో, క్యూబా లాంటి చుట్టు పక్కల దేశాలకు మాత్రమే కాకుండా అనేక దేశాలకు భయభ్రాంతులకు గురిచేసే విధానం, తన మాటలను వినకపోతే ఆర్థిక పరమైన యుద్ధ ఉన్మాదంతో 500శాతం వరకు సుంకాలను విధించే గుణం గలగడం, తనకు ఇష్టం లేని దేశంతో మరోదేశం వాణిజ్యం చేసుకోవడానికి సైతం అడ్డుపడే తత్వం కలిగి ఏకంగా వారి చమురు టాంకర్స్‌ను బంధించడం, అనేక కారణాలను సాకుగా చూపెట్టి విలునైన ఖనిజాల కోసం డెన్మార్క్ ఆధ్వర్యంలో ఉన్న గ్రీన్లాండ్‌ను ఆక్రమించడం కోసం ఉవ్విళ్లూరడం, అంతర్గత సమస్యలను సాకుగా చూపించి ఇరాన్ లాంటి దేశాలపై దాడికి ప్రయత్నించడం లాంటి ఎన్నో భయానక వాతావరణం సృష్టిస్తున్న తీరు ప్రపంచ ప్రజానీకానికి కనబడుతున్నప్పటికీ తను అత్యంత శాంతి మంతుని అని ప్రకటించుకుంటూ ఏకంగా తనకు తాను నేను శాంతి నోబెల్ ప్రైజ్ కి పూర్తి అర్హుడని ప్రకటించుకోవడం అనేది బహుశా అమెరికా అధ్యక్షుడైన ట్రంప్‌కే సాధ్యమవుతుందేమో అనే అభిప్రాయం కలుగుతుంది నేటి ప్రపంచ ప్రజానీకానికి. ప్రస్తుత సమయంలో ప్రపంచవ్యాప్తంగా వరల్డ్ ఇష్యూస్ న్యూస్ గమనిస్తే ట్రంప్ లేని వార్తలే లేనేలేదేమో అనిపిస్తున్న సందర్భంఇదని చెప్పవచ్చు. ప్రస్తుత తరుణంలో ట్రంప్ హెచ్చరికలు అనేక రూపాలలో వెలువడుతూనే ఉన్నాయి. అందులో ఒకటి స్వతహాగా వ్యాపారవేత్త అయినా ట్రంప్ వ్యాపారపరమైన ఆలోచనలతో అనగా ఆర్థికపరమైన యుద్ధాలను ప్రకటించి యుద్ధ భయం కల్పిస్తున్నారు. రష్యాతో ఎన్నోఏళ్ల నాటి పరోక్ష శత్రుత్వాన్ని కొనసాగిస్తున్న అమెరికా ఉక్రెయిన్ రష్యా యుద్ధాలను సాకుగా చూపి రష్యాతో వాణిజ్య సంబంధాలను కొనసాగిస్తున్న దేశాలపై ఆర్థిక యుద్ధం ప్రకటించడం లాంటి విధానం చూస్తే ట్రంప్ ది ఎలాంటి మనస్తత్వమో తేటతెల్లమవుతుంది. రష్యాపై ఆంక్షల చట్టం2025 అనే బిల్లుతో భారత్ అమెరికా సంబంధాలను బీటలు పడేలా చేస్తున్నది అమెరికా. ఈబిల్లు వలన ద్వితీయ పక్ష కొనుగోళ్లు, పునఃవిక్రయంపై 500 శాతం సుంకాలను భారత్, చైనా, బ్రెజిల్ లాంటి దేశాలపై అమలు చేయుటకు సమాయత్తమవడంతో అది ట్రంప్ ఆర్థికపరయుద్ధ మనస్తత్వానికి అద్దం పడుతుందని అభిప్రాయం కలుగుతుంది నేటి ప్రజానీకానికి. వాస్తవానికి ప్రపంచంలో అతిపెద్ద జనాభా కలిగిన భారత్‌కు రోజువారి అవసరత మేరకు చమురు వినియోగం పెరగడం సహజం. దీని దృష్ట్యా అంతమంది జనాభాకు అవసరాన్ని తీర్చడానికి చౌకగా దొరుకుతున్న రష్యా చమురును కొనుగోలు చేయక తప్పని పరిస్థితి భారత్‌కు ఉన్నదనే విషయం అమెరికాకు సైతం తెలిసిన విషయమే. పైగా ఎప్పటి నుండో రష్యా భారత్ స్నేహం తెలిసిందే. అయినప్పటికీ ట్రంప్ అడ్డంకులను సృష్టిస్తున్నారు. ట్రంప్ సృష్టిస్తున్న అడ్డంకులను నిశితంగా పరిశీలిస్తుంది భారతావని. ఇదే విధానం పలు దేశాలపై రుది వాటిని నిస్సహాయత వైపు నెట్టడం



చేస్తున్నట్లు అర్థమవుతుంది. ఇందులో భాగంగానే ఇరాన్ పై దాడి చేస్తానని హెచ్చరికలు చేస్తూ ఇరాన్‌ను బలవంతంగా తన చెప్పుచేతుల్లో ఉంచడానికి అవకాశం ఉన్న అన్ని విధానాలను ముందుకు తెస్తున్నట్లు అభిప్రాయపడాల్సి వస్తుంది. అప్పటికే అమెరికా, పాశ్చాత్య దేశాల అనేక ఆర్థిక ఆంక్షల వలన ఆర్థిక సంక్షోభంలోపడ్డ ఇరాన్‌పై తన ప్రజలే తిరగబడుతున్న సమయాన్ని అవకాశంగా తీసుకున్న ట్రంప్‌ఏకంగా ఇరాన్‌లో ఆందోళనలను మరింత రెచ్చగొట్టేలా వ్యాఖ్యానాలను చేస్తున్నారు. ప్రభుత్వ సంస్థలను స్వాధీనం చేసుకోండి, ఆందోళన కొనసాగించండి, మీకోసం సాయం వస్తుందనే విధంగా ట్రంప్ వ్యాఖ్యానాలు ఎంతో అశాంతియుతంగా ఉన్నట్లు అభిప్రాయపడాల్సి వస్తుందన్నట్లుగా ఉంది. అయితే ఇరాన్ నిరసనకారులను అణిచివేతను ట్రంప్ సాకుగాచూపించి మరింత దూకుడుగా ఇరాన్‌పై యుద్ధమేఘాలను కమ్ముకునేటట్లు చేసి, చర్చలకు కూర్చోబెట్టి, మరింత ఆర్థిక సంక్షోభంలో నెట్టేందుకు సమాయాత్తం అవుతున్నారని విశ్లేషకుల వాదన. ఇందులో భాగంగానే ఇరాన్‌తో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తే ఆయాదేశాలపై 25శాతం టారిఫ్‌లను విధిస్తామని తన ట్రూత్ సోషల్ ద్వారా చెప్పడం జరిగింది. పైగా ఈ విధానం తక్షణమే అమలులో వస్తుందని ఘంటాపదంగా తెలియపరచడం చేశారు. ఇది భారత్ పై కూడా కొంతమేర ప్రభావం చూపనుంది. ఇరాన్‌తో వాణిజ్య భాగస్వాములుగా ఇండియా, చైనా, యూఏఈ, ఇరాక్ లాంటి దేశాలే అయినప్పటికీ వాటిలో చైనాయే ప్రధానమైనదని భావించాలి. ఇరాన్ నుండి చైనాకు చవకగా చమురు సరఫరా అవుతున్నందువలన తాజాగా ట్రంప్ అదనపు టారిఫ్‌ల ప్రభావం చైనాపై ఎక్కువగా ఉంటుందనేది ప్రధాన అభిప్రాయం. దీనికి ప్రతిస్పందనగా చైనా సైతం ప్రతీకారచర్యలు తప్పవని హెచ్చరికలు చేస్తుంది. వెనిజులా అధ్యక్షుడిని ట్రంప్ బంధించి చైనా వాణిజ్యం తగ్గించడం, ఇరాన్ పై ఆంక్షలువేసి చైనా, భారత్ మరికొన్ని దేశాల వాణిజ్యం దెబ్బతీయడం, రష్యా ఆంక్షలు చట్టం2025 తో ప్రధానంగా భారత్ పై 500శాతం టారిఫ్‌ను విధించి కట్టడి చేసే ప్రయత్నం చేయడంచూస్తే అన్ని వ్యూహాత్మకం గానే ట్రంప్ అశాంతి వైపు ప్రపంచ దేశాలను నెట్టి వేస్తున్నట్లుగా ఉంది. ఒకే సందర్భంలో ట్రంప్‌లో రెండు కోణాలను మనం గమనించవచ్చు. అందులో మొదటిది తనమాట వినని దేశాల అభివృద్ధికి ఎంతమేరకుఅవరోధాలు కలిగించవచ్చునో అంతగా వారి ఆర్థిక అభివృద్ధికి అడ్డు తగలడం, వారిపై ఆర్థికపరమైన యుద్ధమే ప్రకటించినట్లుగా చేయడం. అలానే రెండోవిధానం చూస్తే అదే సమయంలో ట్రంప్ అమెరికా వాణిజ్య ఆర్థికతను బలోపేతం చేసుకునేందుకు అనుసరిస్తున్న విధానాలను అవలంబిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ విధానంలో భాగమే వెనిజువెలా, గ్రీన్ల్యాండ్, ఇరాన్ లాంటివాటిపై భయాలు సృష్టించడం ట్రంప్ చేస్తున్నట్లుంది. అనగా వెనుజులాకు ఆర్థికంగా బలోపేతానికి కారణమైన అక్కడి చమురు సంపదపై ట్రంప్‌కు మక్కువఎక్కువైనదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విధంగాట్రంప్ వీలైనంతవరకు చాలాదేశాలనువాణిజ్య ఆర్థికంగాకుంగుబాటుకు గురిచేస్తూ తనకు శత్రువుగా ఉన్నదేశాలకు తను వాణిజ్య పరంగా సపోర్టు చేసే దేశాలు సైతం శత్రువుగా చూడాలని ఆజ్ఞాపిస్తూ, ఖనిజ సంపదలతో ఉన్న గ్రీన్లాండ్‌ను కలుపుకునేందుకు ట్రంప్ చేసే ప్రయత్నాలు లాంటి ప్రస్తుత పరిస్థితులనుచూస్తే అమెరికాకున్న గుణాలకు నిదర్శనమని ప్రపంచ దేశాలు భావించాల్సి ఉన్నది. ప్రపంచ దేశాలలో ఇన్ని రకాల అశాంతికి కారణభూతమైన ట్రంప్ తను శాంతి దూతనని ప్రకటించుకోవడమే కాక తన ఆధ్వర్యంలో ఉన్న దేశంలోని విపక్ష నేత మారియా కోరీనా మచాడో కు వచ్చిన నోబెల్ శాంతి పురస్కారాన్ని తన నుండి గిఫ్ట్‌గా తీసుకోవడం అనేదిచూస్తే నోబెల్ శాంతి బహుమతి నోబెల్..అశాంతి కలిగించే వారికి బహుమతిగా మారిపోయిందా! అనే అభిప్రాయం ప్రపంచ ప్రజానీకానికి రాక మానదేమో! •

# భారత్ ఓ విజయవంతమైన దేశం

## - ప్రపంచానికి ఇండియాతో భద్రత, సుస్థిరత
## - యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా



**న్యూఢిల్లీ, జనవరి 26:** "భారత్ ఓ విజయవంతమైన దేశం.. ప్రపంచాన్ని మరింత స్థిరంగా, సంపన్నంగా, సురక్షితంగా భారతదేశం చేస్తుంది" అని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ అభిప్రాయపడ్డారు. న్యూఢిల్లీలో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు విశిష్ట అతిథిగా ఉర్సులా హాజరయ్యారు. ఈ వేడుకలకు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా కూడా పాల్గొన్నారు. ఇరువురు కర్తవ్య పథ్‌లో విశిష్ట అతిథులుగా హాజరై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీలతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం, ఆమె తన మనసులో మాటను 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. "భారత దేశ గణతంత్ర దినోత్సవంలో పాల్గొనడం తన జీవితంలో లభించిన అతిపెద్ద గౌరవం. భారత దేశ విజయ ప్రస్థానంతో ప్రపంచానికి శాంతిసౌభాగ్యాలు, సుస్థిరత లభిస్తాయి. అందరికీ మేలు జరుగుతుంది" అంటూ రాసుకొచ్చారు. తొలుత రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ముర్ముతో కలిసి ఉర్సులా, ఆంటోనియో కోస్టా ప్రెసిడెంట్ గార్డ్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం, రాష్ట్రపతితో కలిసి ప్రత్యేక బగ్గీలో కర్తవ్యపథ్ వద్ద ఏర్పాటు చేసిన వేదికకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ, రాష్ట్రపతితో పాటు ముఖ్య అతిథులకు ఘన స్వాగతం పలికారు. జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం అనంతరం, ప్రముఖులు పరేడ్‌ను వీక్షి ంచారు. ఇక మంగళవారం భారత్, ఇయు (ఐరోపా సమాఖ్య) మధ్య జరగనున్న శిఖరాగ్ర సమావేశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇయుతో భారత్ కుదుర్చుకోనున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమితాసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటికే భారత్‌కు ఇయు ముఖ్య వాణిజ్య భాగస్వామిగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇయు-భారత్‌ల వాణిజ్యం 135 బిలియన్ డాలర్లను దాటింది. ఒప్పందం తరువాత ద్వైపాక్షి క వాణిజ్యం కొత్త పుంతలు తొక్కుతుందని మార్కెట్ వర్గాలు అంచనా

# హిందూ మైనార్టీలపై దాడులకు భయపడి భారత్‌కు వచ్చేసిన ఎన్టీపిసి ఉద్యోగులు..

**న్యూఢిల్లీ,జనవరి 26:** బంగ్లాదేశ్‌లో పెచ్చుమీరిన హిందూ మైనార్టీలో దాడులు ఆదేశంలో ఇక జీవించలేమన్న భయాన్ని పెంచుతున్నాయి. తాజాగా అక్కడ పని చేస్తున్న భారతీయులు చాలా మంది ఇండియాకు తిరిగొచ్చేస్తున్నారు. ప్రైవేటు రంగంలోనే కాకుండా భారత రాయబార కార్యాలయంతోపాటు వివిధ రంగాల్లో పని చేస్తున్న కేంద్ర సంస్థల ఉద్యోగులు కూడా బంగ్లాను వీడుతున్నారు. తొమ్మిది మంది ఎన్టీపీసీ ఇంజినీర్లు బంగ్లాదేశ్‌ను వదిలి ఇండియా వచ్చినట్లు తెలుస్తోంది. కేంద్ర విద్యుత్ రంగ సంస్థ అయిన ఎన్టీపీసీకి చెందిన ఉద్యోగులు కొందరు బంగ్లాదేశ్‌లో డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. ఇండియాబంగ్లా మధ్య ఉన్న మైత్రి ప్రకారం బంగ్లాదేశ్ ఇండియా ఫ్రెండ్‌షిప్ పవర్ కంపెనీ నిర్వహిస్తున్న రాంపాల్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో పని చేస్తున్నారు. అక్కడ నెలకొన్న సంక్షోభం నేపథ్యంలో తొమ్మిది మంది భారతీయ ఉద్యోగులు ఆ దేశాన్ని వీడి, శనివారం ఇండియా వచ్చినట్లు తెలుస్తోంది. దీనికి వారు అక్కడి అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు పొందలేదని, నోటీసులు కూడా ఇవ్వలేదని తెలుస్తోంది. అక్కడి ఉద్యోగులను తనిఖీ చేయగా వారు విధులకు రాలేదని తెలియడంతో విచారించారు. వారు ఇండియా వెళ్లిపోయారని తెలిసింది.

భోమ్రా మార్గం ద్వారా వారు ఇండియా వచ్చినట్లు గుర్తించారు. బంగ్లాలో ఉన్న భారత ఉద్యోగులకు ఇండియన్ ఎంబసీ ఇప్పటికే ఒక సూచన చేసింది.

కుటుంబంతో కలిసి అక్కడ ఉండటం క్షేమం కాదని, కుటుంబాల్ని ఇండియాకు పంపించాలని సూచించింది. దీంతో రాయబార కార్యాలయంతోపాటు పలువురు ఉద్యోగులు తమ ఫ్యామిలీ మెంబర్స్‌ను ఇండియాకు పంపించారు.

# వెనిజులాపై 'డిస్కాంబోబ్యులేటర్' సీక్రెట్ వెపన్ వాడాం!

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ వెల్లడి



**వెనిజువెలా, జనవరి 26:** వెనిజులాపై ఉపయోగించిన రహస్య ఆయుధం పేరును ట్రంప్ వెల్లడించారు. వెనిజులా సైన్యాన్ని నిర్వీర్యం చేసేందుకు అమెరికా "డిస్కాంబోబ్యులేటర్" ఆయుధాన్ని ఉపయోగించినట్లు చెప్పారు. న్యూయార్క్ పోస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ యుధం కారణంగా కారకాస్‌లో దాదాపు అన్ని లైట్లను ఆర్పేసిందని ఆ ఆయుధం వెనిజులా ఆయుధాలు పని చేయకుండా చేసిందని వివరించారు. ఇంతకు మంచి ఆ ఆయుధం గురించి ఇంకేమి చెప్పబోనని పేర్కొన్నారు. దాని గురించి ఎక్కువ మాట్లాడదల్చుకోలేదు. తమ సైన్యం ఎలా విజయం సాధించగలిగిందో వివరించలేనని చెప్పుకొచ్చారు. డిస్కాంబోబ్యులేటర్ గురించి మాట్లాడటానికి నాకు అనుమతి లేదని ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఆ ఆయుధం వెనిజులా పరికరాలను పనిచేయకుండా చేసిందని తెలిపారు. వెనిజులా దగ్గర రష్యా, చైనా రాకెట్లు ఉన్నాయని కానీ ఒక్కటి కూడా ప్రయోగించలేకపోయారని తమ సైన్యం వెనిజులాలోకి ప్రవేశించగానే వారు బటన్లు నొక్కినప్పుడు ఏమీ పని చేయలేదని అప్పటికే వారంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తమ సైన్యం దాడులు కొనసాగుతాయని.. మాదకద్రవ్యాల కార్టెల్‌లను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నందున తమ లక్ష్యం దక్షిణ అమెరికా నుంచి ఉత్తర అమెరికాకు విస్తరించవచ్చని ట్రంప్ సూచించారు. మాకు వారి మార్గాలు తెలుసు. వారి గురించి మాకు అన్నీ తెలుసు. వారి ఇళ్లు మాకు తెలుసని ట్రంప్ అన్నారు. ఇక వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు మచాడో అందజేసిన నోబెల్ శాంతి బహుమతిని ఎక్కడ పెట్టాలో ఆలోచిస్తున్నామని ప్రస్తుతం ఓవల్ కార్యాలయంలోని విగ్రహానికి ఆనుకుని ఉందని చెప్పారు.



సోమవారం న్యూఢిల్లీలో రిపబ్లిక్ డే వేడుకలకు ప్రత్యేక అశ్విక శకటంలో వచ్చిన రాష్ట్రపతి ముర్ము, విశిష్ట అతిథులు



రిపబ్లిక్ డే వేడుకల్లో ప్రదర్శించిన తమిళనాడు అభివృద్ధి శకటం

## రిపబ్లిక్‌డే పెరేడ్‌లో ఆకట్టుకున్న

# వందేమాతరం శకటం




**న్యూఢిల్లీ, జనవరి 26:** భారత 77వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. వందేమాతరానికి 150 ఏళ్ళు ప్రధాన ఇతివృత్తంతో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ నేపథ్యంలో 'వందేమాతరం కళాకృతులతో కూడిన శకటం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కళాకారుడు తేజేంద్ర కుమార్ మిత్రా వందేమాతర్మ్ ప్రారంభ పద్యాలను లిఖించారు. ఈ ఏడాది రిపబ్లిక్ డే పరేడ్ వందేమాతరం శతజయంతి ఉత్సవ ప్రధాన ఇతివృత్తంగా కొనసాగింది. రిపబ్లిక్ డే పరేడ్ ఆహ్వాన పత్రికలపై కూడా వందేమాతరం శతజయంత్యుత్సవ లోగోతో పాటుతో ఆ గీతం ఉన్నది. బంకిం చంద్ర ఛటర్జీ సిల్హౌట్ చిత్రం, వందేమాతరం వాటర్‌మార్క్‌గా ఉన్నాయి. మరోవైపు 1875లో బంకిం చంద్ర ఛటర్జీ రచించిన వందేమాతర్మ్ గీతం స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ఒక నినాదంగా మారింది. 1950లో రాజ్యాంగ పరిషత్ భారత జాతీయ గీతంగా దీనిని స్వీకరించింది.

# ఇస్లామాబాద్ ఎయిర్‌పోర్టు నిర్వహణ డీల్‌ను రద్దుచేసిన ఎమిరేట్స్

## పాక్‌కు షాకిచ్చిన గల్ఫ్‌దేశం.. భారత్‌తో చెలిమికి సంసిద్ధం



**న్యూఢిల్లీ,జనవరి 26:** ప్రపంచదేశాల్లో భారత్‌ప్రతిష్ట ఎలా పెరుగుతున్నదనడానికి తాజా సంఘటనలు ఉదాహరణలుగా నిలిచాయి. యూఏఈ అధ్యక్షుడు భారత పర్యటన ముగించుకుని వెళ్లిన వారం రోజుల్లోనే పాకిస్తాన్‌కు షాకిచ్చారు. పాకిస్తాన్‌తో చేసుకున్న ఎయిర్‌పోర్ట్ ఒప్పందాన్ని యూఏఈ రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. ఈ డీల్ రద్దుకు భారత్‌తో యూఏఈ కుదుర్చుకున్న ఒప్పందమే కారణం అనే ప్రచారం జరుగుతోంది. గత వారం యూఏఈ ప్రెసిడెంట్ షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఇండియాలో ఆయన మూడు గంటలు మాత్రమే ఉన్నారు. ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఈ మూడు గంటల్లోనే ఇండియాయూఏఈ మధ్య కీలక ఒప్పందాలు జరిగాయని రెండు దేశాలు ప్రకటించాయి. ఇదే సమయంలో గతంలో పాకిస్తాన్‌తో యూఏఈ కుదుర్చుకున్న ఎయిర్‌పోర్ట్ డీల్‌ను రద్దు చేసుకుంది. ఇస్లామాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను నిర్వహిస్తామని పాకిస్తాన్‌తో యూఏఈ గత ఏడాది ఆగష్టులో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. తాజాగా ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. పాకిస్తాన్ సరైన నిర్వహణ భాగస్వామిని చూపించకపోవడం వల్లనే ఈ డీల్ రద్దైనట్లు అధికారికంగా వెల్లడించింది. కానీ, దీని వెనుక అంతర్జాతీయ రాజకీయ కారణాలు ఉన్నట్లు స్పష్టమవుతోంది. సౌదీ అరేబియా, యూఏఈ మధ్య ఉన్న వివాదం కూడా మరో కారణంగా చెప్పుకోవచ్చు. పాకిస్తాన్ సౌదీతోపాటు మరికొన్ని దేశాలను కలుపుకొని ఇస్లామిక్ నాటోను ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తోంది. సౌదీ అరేబియా ఉంది కాబట్టి ఇందులో ఆ దేశ ప్రత్యర్థి అయిన యూఏఈ ఉండబోదు. అందుకే దీనికి పోటీగా యూఏఈ ఇండియా, ఇజ్రాయెల్‌తో కలిసి కూటమి ఏర్పాటు చేసే ఆలోచనలో ఉంది. ఇండియాకు మరింత దగ్గరయ్యేందుకు ఎమిరేట్స్ గతంలో తాను పాక్‌తో డీల్ క్యాన్సిల్ చేసుకుంది.

# ట్రంప్ సుంకాలవేళ భారత్‌తో దోస్తీకి జిన్‌పింగ్ భాయియా భాయియా!

**బీజింగ్, జనవరి 26:** మిత్రుడు అనుకున్న అమెరికా భారత్‌పై సుంకాలతో విరుచుకుపడుతున్న వేళ, శత్రువుగా భావించే చైనా నుంచి భారత్‌కు సానుకూల సందేశం వచ్చింది. జిన్‌పింగ్ భారతదేశ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు చెప్పారు. డ్రాగన్‌ఏనుగు కలిసి నృత్యం చేయడం రెండు దేశాలకు సరైన ప్రాధాన్యతలని అన్నారు. భారత్‌లో చైనా రాయబారి ఫీహాంగ్ కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వెల్లడించారు. చైనా, భారత్ మంచి పొరుగు స్నేహితులు. భాగస్వాములుగా ఉండటం, ఒకరినొకరు విజయవంతం చేసుకోవడం, సహాయపడటం, డ్రాగన్ ఏనుగు టాంగో సరైన ఎంపిక అని అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిన్‌పింగ్ సోమవారం భారత అధ్యక్షురాలు ద్రౌపది ముర్ముకు శుభాకాంక్షలు తెలిపారు.

# భారత్‌తో వాణిజ్య డీల్‌కు వారే అడ్డు!

## ట్రంప్ పాలనపై సెనేటర్ టెడ్‌క్రూజ్ సంచలన వ్యాఖ్యలు



**వాషింగ్టన్, జనవరి 26:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరిపాలనలోని అంతర్గత విభేధాలు రోజురోజుకూ రచ్చకెక్కుతున్నాయి. ట్రంప్ అనుసరిస్తున్న ధోరణులకు సొంతపార్టీనుంచే భారీ స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. మరికొన్ని అత్యున్నత న్యాయస్థానాల్లోకూడా పిటిషన్లు వేసేవరకూ ట్రంప్ నిర్ణయాలు పోయాయి.అయినా కూడా ట్రంప్ తన దూకుడు వైఖవీడలేదు. ఈక్రమంలోనే మరో దుమారం రేగింది. భారత్‌అమెరికా మధ్య జరగాల్సిన కీలకమైన వాణిజ్య ఒప్పందాన్ని ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, శ్వేతసౌధ ఆర్థిక సలహాదారు పీటర్ నవారోలే అడ్డుకున్నారంటూ రిపబ్లికన్ సెనేటర్ టెడ్ క్రూజ్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ముఖ్యంగా ఆక్సియోస్ సంస్థ వెలుగులోకి తెచ్చిన టెడ్ క్రూజ్ లీక్డ్ ఆడియో రికార్డింగ్‌లు ట్రంప్ కేబినెట్‌లోని ఈ లొసుగులను బయటపెట్టాయి. 2025లో ప్రైవేట్ దాతలతో టెడ్ క్రూజ్ జరిపిన సంభాషణల ఆడియో ఇప్పుడు బయటకు వచ్చింది. భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని తాను శ్వేతసౌధంతో నిరంతరం పోరాటం చేస్తున్నానని క్రూజ్ ఆ ఆడియోలో పేర్కొన్నారు. అయితే ఈ ఒప్పందానికి పరిపాలన విభాగంలో అడ్డుపడుతోంది ఎవరని ఓ వ్యక్తి ప్రశ్నించగా పీటర్ నవారో, జేడీ వాన్స్, కొన్ని సందర్భాల్లో స్వయంగా డొనాల్డ్ ట్రంపే ఈ ప్రక్రియను నిలిపి వేస్తున్నారని క్రూజ్ బాంబు పేల్చారు. అంతేకాకుండా ట్రంప్ అమలు చేస్తున్న దూకుడు సుంకాల విధానం వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని క్రూజ్ హెచ్చరించారు. ఏప్రిల్ 2025లో ట్రంప్ ఈ సుంకాలపై సంతకం చేసినప్పుడు అర్ధరాత్రి వరకు జరిగిన ఫోన్ కాల్‌లో తాను ట్రంప్‌ను వారించానని తెలిపారు. అయితే ట్రంప్ తీవ్ర అసహనంతో తనపై విరుచుకుపడ్డారని క్రూజ్ వివరించారు. ధరలు 20 శాతం పెరిగితే.. రిపబ్లికన్ పార్టీ అనేక సవాళ్లు ఎదుర్కోవాలి.

# 75 దేశాలకు వీసాల బ్రేక్.. అందుబాటులోకి 50 వేల గ్రీన్ కార్డులు

**వాషింగ్టన్, జనవరి 26:** వలసదారుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తోన్న అమెరికా ప్రభుత్వం.. ఇటీవల 75 దేశాల పౌరులకు వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేసింది. ఈ నిర్ణయంతో 2027 సంవత్సరానికి గానూ గ్రీన్‌కార్డు కోటా పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. కుటుంబ ఆధారిత గ్రీన్‌కార్డులను.. ఉద్యోగ ఆధారిత కేటగిరీ బదలీ చేస్తే ఈ అదనపు గ్రీన్‌కార్డులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఇమిగ్రేషన్ అటార్నీ ఎమిలీ న్యూమన్ వెల్లడించారు. సాధారణంగా వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయకపోతే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ 75 దేశాలకు దాదాపు 67 వేల ఇమిగ్రెంట్ వీసాలను జారీ చేసేవారు. ఈ నెల 21 నుంచి ఈ దేశాల పౌరులకు వీసీ ప్రాసెసింగ్ నిలిపివేశారు. అయితే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గానూ అక్టోబరు 1 నుంచి ఇప్పటికే ఈ దేశాలకు చెందిన పౌరులకు కొన్ని వీసాలు జారీ అయ్యాయి. ఈ లెక్కన చూసుకుంటే.. ఈ దేశాలపై నిషేధం అమలైతే వచ్చే యేడాదికి గానూ అదనంగా మరో 50 వేల గ్రీన్‌కార్డులు అందుబాటులో ఉంటే అవకాశం ఉందని ఇమిగ్రేషన్ అటార్నీ వివరించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, రష్యా, అఫ్ఘానిస్థాన్, బ్రెజిల్, ఈజిప్టు, ఇరాన్, ఇరాక్ సహా మొత్తం 75 దేశాల పౌరులకు తమ దేశ ఇమిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను అమెరికా నిలిపివేసింది. అమెరికా ప్రభుత్వ పథకాలపైనే వారు ఎక్కువగా ఆధారపడి జీవించే అవకాశాలు ఉన్నాయని, అందుకే ఈ చర్యకు ఉపక్రమించామని అగ్రరాజ్యం తెలిపింది.

# సంక్షిప్తంగా..

## జిన్‌పింగ్ విధేయుడిపై విచారణకు ఆదేశం!



**బీజింగ్, జనవరి 26:** చైనా రాజకీయ, సైనిక వర్గాల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఆ దేశ అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు అత్యంత నమ్మకస్తుడిగా, సైన్యంలో అత్యున్నత హోదాలో ఉన్న జనరల్ జాంగ్ యూక్సియా (75)పై చైనా ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. అవినీతి ఆరోపణలే కాకుండా అత్యంత సున్నితమైన అణ్వాయుధ రహస్యాలను అమెరికాకు చేరవేరారన్న సంచలన ఆరోపణలు రావడం ఇప్పుడు అంతర్జాతీయంగా హాట్ టాపిక్ అయింది. చైనా సెంట్రల్ మిలిటరీ కమిషన్ వైస్ ఛైర్మన్ హోదాలో ఉన్న జాంగ్ యూక్సియాపై అణ్వాయుధ కార్యక్రమానికి సంబంధించిన కోర్ టెక్నికల్ డేటాను అమెరికాకు లీక్ చేశారన్న ప్రధాన ఆరోపణ ఉంది. దీంతో పాటు సైనిక పదవుల కేటాయింపులో భారీగా లంచాలు తీసుకోవడం, సొంత వర్గాలను ఏర్పాటు చేయడం, సైనిక కొనుగోళ్లలో అవినీతికి పాల్పడటం వంటి తీవ్రమైన ఉల్లంఘనలపై విచారణ జరుపుతోంది.

## పనిమనిషిపై అత్యాచారం కేసులో బాలీవుడ్ నటుడు నదీమ్‌ఖాన్ అరెస్టు


**ముంబయి, జనవరి 26:** బాలీవుడ్ నటుడు నదీమ్ ఖాన్‌ను అత్యాచారం కేసులో ముంబై పోలీసులు అరెస్ట్ చేశారు. తన ఇంట్లో పనిచేసే 41 ఏళ్ల మహిళపై పదేళ్లుగా లైంగిక దాడికి పాల్పడినట్టు ఆయనపై ఆరోపణలు నమోదయ్యాయి. పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఈ దారుణానికి ఒడిగట్టారని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. రణ్‌వీర్ సింగ్ నటించిన దురంధర్ సినిమాలో నదీమ్ ఖాన్ ఒక పాత్రలో కనిపించారు. బాధితురాలు పలువురు నటుల ఇళ్లలో పనిచేస్తుండగా కొన్ని సంవత్సరాల క్రితం నదీమ్ ఖాన్‌తో పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతో వీరి మధ్య సంబంధం కొనసాగింది. ఈ క్రమంలో మాల్వానీలోని తన నివాసంలో, వెర్సోవాలోని నదీమ్ ఖాన్ ఇంట్లో పలుమార్లు తనపై అత్యాచారం చేశాడని బాధితురాలు ఆరోపించింది. ఇటీవల నదీమ్ ఖాన్ పెళ్లికి నిరాకరించడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది.

## అమెరికా సరిహద్దుల్లో రోజుకు 65 మందిభారతీయుల అరెస్ట్



**వాషింగ్టన్, జనవరి 26:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసలపై కఠినచర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆ దేశ సరిహద్దుల వద్ద రోజుకు 65 మంది భారతీయులు అరెస్టు అవుతున్నట్లు యుఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం వెల్లడించింది. 2025 జనవరి-డిసెంబరు మధ్యలో 23,830 మంది భారతీయులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపింది. 2024లో ఈ సంఖ్య 85,119గా ఉంది. గతేడాది అదుపులోకి తీసుకున్న వారి సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ.. ఇలా పట్టుబడుతున్న అక్రమ వలసదారుల్లో అత్యధికులు భారతీయులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఉద్యోగాలు, మెరుగైన వేతనం కోసమే భారత్‌తో సహా పలు దేశాలకు చెందిన వారు అమెరికాలోకి అక్రమంగా వచ్చేందుకు యత్నిస్తున్నారు. అయితే వారిలో ఒక్కోసారి ఎలాంటి తోడు లేని పిల్లలు కనిపిస్తుండటం ఆందోళన కలిగిస్తుందని యుఎస్ అధికారులు తెలిపారు.

## రష్యాలో పెరుగుతున్న కార్మికుల కొరత!



**మాస్కో, జనవరి 26:** కార్మికరంగంలో నిపుణుల కొరత, అసంఘటితరంగంలోకూడా తీవ్ర లోటును ఎదుర్కొంటున్న రష్యా ఇపుడు భారత్‌వైపు దృష్టిసారించింది. ఈ ఏడాది దాదాపు 40వేల మంది భారతీయ కార్మికులను నియమించుకోవడానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే సుమారు 70 వేలు నుంచి 80వేలమంది భారతీయులు గత ఏడాది చివరి నాటికి రష్యాలో పనిచేస్తున్నట్లు అంచనా. భారతదేశం నుంచి నైపుణ్యం, పాక్షిక నైపుణ్యం ఉన్న కార్మికులను రష్యాకు పంపించే ప్రక్రియను సులభతరం చేసేందుకు గత డిసెం బర్‌లో ఇరు దేశాలు రెండు కీలక ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందాల ద్వారా కార్మికుల తరలింపు ప్రక్రి యను క్రమబద్ధీకరించడం తో పాటు, గతంలో జరిగిన మోసాల వంటివి పునరావృతం కాకుండా వారికి రక్షణ కల్పించ నున్నారు.

# చోర్లాఘాట్‌లో రూ.400 కోట్లు చోరీ

## - గోవా నుంచి మహారాష్ట్రకు నగదు తరలింపు - గత యేడాది అక్టోబర్ 16న ఘటన, ఆలస్యంగా వెలుగులోకి - రంగంలోకి మహారాష్ట్ర, కర్ణాటక, గోవా పోలీసులు - నలుగురు నిందితుల అరెస్టు... మరో ఇద్దరి కోసం గాలింపు - ప్రత్యేక సిట్ ఏర్పాటు.. ముమ్మరంగా దర్యాప్తు



**బెళగావి, జనవరి 26:** కర్ణాటక- గోవా- మహారాష్ట్ర సరిహద్దు సమీపంలో రూ.400 కోట్ల కంటైనర్ చోరీకి గురైంది. అక్టోబర్ 16న బెళగావి జిల్లా ఖానాపూర్ తాలూకాలోని చోర్లా ఘాట్ వద్ద చోటుచేసుకుంది. ఈ విషయంలో ఆలస్యంగా బయటపడటం సంచలనం సృష్టిస్తోంది. దేశంలోని అతిపెద్ద దొంగతనం కేసుగా చెబుతున్నారు.పోలీసుల సమాచారం మేరకు, గోవా నుండి మహారాష్ట్రకు ఓ కంటైనర్‌లో రూ.400 కోట్లు. అవన్నీ పాత రూ.2 వేల నోట్లు. ఓ కంటైనర్‌లో గోవా నుండి మహారాష్ట్రకు తరలిస్తుండగా, కర్ణాటకలోని చోర్లా ఘాట్ స్ట్రెచ్ వద్ద అకస్మాత్తుగా కనిపించకుండా పోయింది. ఈ డబ్బు మహారాష్ట్రకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కిషోర్ శెట్టికి చెందినదిగా అనుమానిస్తున్నారు. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికలలో ఉపయోగం కోసం ఈ నగదును తరలిస్తున్నట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు, ఇది తీవ్రమైన రాజకీయ నిధుల ఆందోళనలను లేవనెత్తింది. దేశంలోనే అతిపెద్ద దొంగతనం కేసులో 3 రాష్ట్రాలు అలర్ట్ అయ్యాయి. రూ.400 కోట్ల నగదు దోపిడీ కేసులో మహారాష్ట్ర, కర్ణాటక, గోవా పోలీసులు ఉమ్మడిగా విచారణ చేపట్టారు. పాత నోట్లు, భారీగా నగదు తరలింపు వెనుక ఉన్న హవాలా నెట్‌వర్క్, రాజకీయ ప్రమేయంపై 3 రాష్ట్రాల పోలీసులు దృష్టి సారించారు. ఎహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఆదేశాలతో రంగంలోకి దిగిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) అధికారులకు సహకరించేందుకు కర్ణాటక, గోవా పోలీసులు కూడా చేతులు కలిపారు. నాసిక్‌కు చెందిన సందీప్ పాటిల్ అనే రియల్ ఎస్టేట్ ఏజెంట్.. జనవరి 1వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.ఈ దోపిడీ గురించి సమాచారం తెలుసనే నెపంతో తనను కొందరు కిడ్నాప్ చేసి, చిత్రహింసలకు గురిచేశారని సందీప్ పాటిల్ ఆరోపించారు. కర్ణాటక పోలీసుల ఎంట్రీ కావడంతో ఈ కేసు తీవ్రతను బట్టి మహారాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. మహారాష్ట్ర సిట్ చీఫ్ ఆదిత్య మిర్కెల్కర్ అభ్యర్థన మేరకు.. బెళగావి ఎస్పీ కె. రామరాజన్ ఒక స్పెషల్ టీమ్‌ను నాసిక్‌కు పంపించారు. ప్రస్తుతం ఈ కేసు కేవలం ఫిర్యాదుదారుడి వాంగ్మూలంపైనే ఆధారపడి ఉందని బెళగావి ఎస్పీ కె. రామరాజన్ తెలిపారు. కర్ణాటక హోం శాఖ మంత్రి జి. పరమేశ్వర కూడా ఈ కేసుపై స్పందించారు. దోపిడీకి గురైన కంటైనర్ల ఆచూకీ కోసం మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి అదనపు సమాచారం కోరినట్లు వెల్లడించారు. ఫిర్యాదుదారుడు, ఆరోపించిన బాధితుడు సందీప్ పాటిల్ వీడియో ప్రకటన విడుదల చేసిన తర్వాత కేసు నాటకీయ మలుపు తిరిగింది. తప్పిపోయిన మొత్తం రూ.400 కోట్లకే పరిమితం కాదని, రూ.1,000 కోట్లకు మించి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కంటైనర్ అదృశ్యమైన వెంటనే, కిషోర్ శెట్టి సహచరులు తనను తుపాకీతో కిడ్నాప్ చేశారని పాటిల్ ఆరోపించారు. పాటిల్ తనను దాదాపు ఒకటిన్నర నెలలు చట్టవిరుద్ధంగా నిర్బంధించారని, హింసించారని, అదృశ్యమైన కంటైనర్ గురించి పదేపదే ప్రశ్నించారని చెప్పారు. ఆ నగదు ఎక్కడ ఉందో వెల్లడించాలని లేదా ప్రస్తుతం చెల్లుబాటులో ఉన్న రూ.100 కోట్లు చెల్లించాలని అల్టిమేటం ఇచ్చారని ఆయన ఆరోపించారు. నిర్బంధంలో ఉన్నప్పుడు తాను తీవ్రమైన మానసిక, శారీరక వేధింపులకు గురయ్యానని పాటిల్ భావోద్వేగంగా పేర్కొన్నాడు. ఈ కేసు తీవ్రతను మరింత పెంచుతూ, పాటిల్ ఇద్దరు మహారాష్ట్ర పోలీసు అధికారులపై ప్రమేయం ఉన్నట్లు ఆరోపించారు. పోలీసు అధికారుల నుండి తనకు బెదిరింపు వాట్సాప్ కాల్స్ వచ్చాయని, ప్రాణభయంతోనే తాను మౌనంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు.



సౌమ్యను పరామర్శించిన తర్వాత ఆమె తల్లి, సోదరుడిని ఓదార్చుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

## కానిస్టేబుల్ సౌమ్యను పరామర్శించిన వైద్య మంత్రి రాజనర్సింహ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జనవరి 26, ప్రభాతవార్త:** నిజామాబాద్ నగర శివారులో గంజాయి తరలిస్తున్న ముఠాను పట్టుకొనే క్రమంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్యను సోమవారం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పరామర్శించారు. నిమ్స్ కు వెళ్లిన ఆయన ఆమె ఆరోగ్య పరిస్థితిని, వైద్యం అందుతున్న తీరును వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కానిస్టేబుల్ తల్లి, సోదరుడుతో ఆయన మాట్లాడారు. సౌమ్యకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటా మన్నారు. కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోగ్తు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ విపత్తులో ఆపద మిత్రల భాగస్వామ్యం కీలకం

### 'ఆపద మిత్ర' వలంటీర్ల సమావేశంలో కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** విపత్తులు ఏర్పడే సమయంలో ప్రజల మరువలేని భాగస్వామ్యం, ముందస్తు సంసిద్ధత, సమన్వయం ఎంతో కీలకమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. అందులో భాగంగా ఆపద మిత్ర వాలంటీర్ల అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా బలమైన, ప్రజా కేంద్రిత విపత్తు ప్రతిస్పందన వ్యవస్థ నిర్మాణానికి కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ముఖ్యంగా విపత్తు ప్రమాద తగ్గింపు విషయంలో ప్రధానమంత్రి ప్రతిపాదించిన పది అంశాల కార్యాచరణతో అంతర్జాతీయ స్థాయిలో భారత్ కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకల నేపథ్యంలో సోమవారం న్యూఢిల్లీలోని సుష్మా స్వరాజ్ భవన్ లో ఎన్డీఎంఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆపద మిత్ర వలంటీర్ల సంభాషణ కార్యక్రమంతోపాటు యువర్ ఫ్రెండ్ (మీ నేస్తం) కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆపద మిత్ర స్వచ్ఛంద సేవకులు ఈ యేడాది గణతంత్ర దినోత్సవ పరేడ్ లో దేశవ్యాప్తంగా నుండి హాజరైన 150 మంది ఆపద మిత్ర స్వచ్ఛంద సేవకుల పాల్గొనడం, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించడంతోపాటు సమాజ ఆధారిత విపత్తు సంసిద్ధత ఎంత కీలకం అన్నారు. ఆపద మిత్ర స్వచ్ఛంద సేవకుల సేవలను గుర్తిస్తూ ఐదుగురు ఆపద మిత్ర వలంటీర్లతో రాష్ట్రపతి భేటీ కావడంతోపాటు గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ ప్రత్యేక శకటం పాల్గొనడం ఆనందంగా ఉంది. శోధన-రక్షణ, ప్రథమ చికిత్స, తరలింపు, సహాయక చర్యల్లో అవసరమైన నైపుణ్యాలతో సిద్ధంగా ఉండి, విపత్తు అనంతర కీలక తొలి గంటల్లో అధికారిక బలగాలు చేరకముందే ఆపద మిత్రలు ఎంతో మంది ప్రాణాలను రక్షించి గుర్తింపు పొందుతున్నారని పేర్కొన్నారు. అంతకుముందు మీ నేస్తం వలంటీర్లతో పరస్పర సమావేశం కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ విపత్తు నిర్వహణకు సంబంధించిన ప్రదర్శనను వీక్షించారు. యువర్ ఫ్రెండ్ వాలంటీర్లకు డిజిటల్ సర్టిఫికెట్లు అందజేశారు. డిజాస్టర్ విక్టిమ్ ఐడెంటిఫికేషన్ అండ్ మేనేజ్‌మెంట్ మార్గదర్శకాలను విడుదల చేయడంతో పాటు, సమూదాయ ఆధారిత వాలంటీరిజం కోసం 'యువర్ ఫ్రెండ్' మోడల్‌ను ఆవిష్కరించారు.

**హక్కులు మాత్రమే కాదు, బాధ్యతలను ఇచ్చింది: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు డా. కె. లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డా. ఎన్. గౌతం రావు, వేముల అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. కాసం వెంకటేశ్వర్లు, డా. బూర నర్సయ్య గౌడ్, బండ కార్తీక రెడ్డి, సీనియర్ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి, చింతల రామచంద్ర రెడ్డి, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్, మోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ.. మన దేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అధ్యక్షతన రూపొందించిన భారత రాజ్యాంగాన్ని ఈ గణతంత్ర దినోత్సవ సందర్భంగా మనమందరం తప్పకుండా స్మరించుకోవాలి. ఈ రాజ్యాంగం మనకు హక్కులు మాత్రమే కాదు, బాధ్యతలను కూడా ఇచ్చింది. ప్రభుత్వాలు ఎలా నడవాలి, ప్రజాస్వామ్యం ఎలా కొనసాగాలి అనే దిశ, దశ ఈ రాజ్యాంగమే నిర్దేశించింది. కానీ దురదృష్టవశాత్తూ, మన రాజ్యాంగాన్ని మార్చేందుకు, అవహేళన చేసేందుకు గతంలో అనేక ప్రయత్నాలు జరిగాయి. 1947లో స్వాతంత్రం వచ్చినప్పటికీ, 1951 వరకు దేశంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వం లేదు. ఆ సమయంలో ప్రధానమంత్రిగా ఉన్న జవహర్ లాల్ నెహ్రూ అవసరమైతే రాజ్యాంగాన్ని కూడా పక్కన పెట్టాలి అన్నట్టుగా వ్యాఖ్యలు చేశారు. ఎదురు మాట్లాడితే జైలుకు పంపే సంస్కృతిని దేశంలోకి తీసుకొచ్చారు. ఈరోజు రాహుల్ గాంధీ చేతిలో రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని తిరుగుతుంటారు. కానీ పదేపదే రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారు. దేశ ప్రజలకు మేలు చేసేలా నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై తప్పుడు సమాచారాన్ని ప్రజల్లోకి వ్యాప్తి చేస్తున్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత పవిత్రమైన హక్కు. కానీ ఆ ఓటు హక్కు భారత పౌరులకే ఉండాలి. కానీ కొన్ని ప్రాంతాల్లో అక్రమంగా విదేశాల నుంచి మన దేశంలోకి చొరబడ్డవారికి, స్థానిక రాజకీయ నాయకుల సహకారంతో ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు ఇప్పించి ఓటర్ల జాబితాల్లో చేర్పిస్తున్నారు. ఓటు చోరీ కాదు, ఆయనకు మెదడు చోరీ అయిందనుకున్నారు. మనందరం రాజ్యాంగాన్ని గౌరవించాలి. సమానత్వంతో ముందుకు సాగాలి. నరేంద్ర మోదీ ప్రభుత్వం సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ అనే సూత్రంతో దేశాన్ని ముందుకు తీసుకెళ్తోంది. కాబట్టి తెలంగాణలో అవినీతి పార్టీలుగా మారిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు తిరస్కరించి, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని గెలిపించాలని కోరుతున్నానని ఆయన అన్నారు.





బీసీ జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో గుజ్జ కృష్ణ, ఉప్పరి శేఖర్ సగర తదితరులు

## రాహుల్‌గాంధీ హామీకి రాష్ట్రంలో దిక్కులేదు

### మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రకారం టికెట్లు కేటాయించకపోతే పర్యటన అడ్డుకుంటాం

### బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** ప్రస్తుతం జరిగే మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం 56శాతం టికెట్లు ఇవ్వకుంటే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తెలంగాణ పర్యటన అడ్డుకుంటామని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లో బీసీ జేఏసీ కోచైర్మన్ ఉప్పరి శేఖర్‌సగర అధ్యక్షతన బిసి జెఏసి సమావేశం జరిగింది. అనంతరం జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణతో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగబద్దంగా రిజర్వేషన్లు ఇవ్వడం వీలుకాకపోతే పార్టీపరంగా కాంగ్రెస్ పార్టీ ఇవ్వాలనుకుంటే 42 శాతం కాకుండా తెలంగాణలో జరిగిన కులగణన ప్రకారం 56శాతం చొప్పున పార్టీ పరంగా టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇతర పార్టీలు కూడా 56శాతం చొప్పున టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. తక్షణమే సిఎం రేవంత్‌రెడ్డి, పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ మున్సిపల్ ఎన్నికలపై స్పష్టత నివ్వాలన్నారు. బీసీలకు 68 మున్సిపల్ చైర్మన్లు, 1,150 కౌన్సిలర్లు కార్పొరేటర్ పదవులు ఇవ్వాలన్నారు.

## ఎమ్మెల్యే రాజాసింగ్‌కు మళ్లీ బెదరింపులు

### ఎన్నిసారు కాల్స్ వస్తున్నా నిందితులను పోలీసులు పట్టుకోరా?

**హైదరాబాద్ (గోషామహాల్), జనవరి 26, ప్రభాతవార్త:** గోషామహాల్ నియోజకవర్గం బిజెపి శాసనసభ్యుడు టి.రాజాసింగ్‌కు మరోసారి ఓ గుర్తుతెలియని వ్యక్తి చంపేస్తామని బెదరింపు లేఖ రావడంతో స్థానికంగా తీవ్రకలకలం రేపింది. ఆదివారం సాయంత్రం దూల్‌పేటలోని నివాసానికి ఈ ఓ లేఖ వచ్చింది. ఆ లేఖలో ఎమ్మెల్యే టి.రాజాసింగ్‌కు ప్రాణహాని ఉందని తేలింది. దీంతో వెంటనే కుటుంబసభ్యులు, పార్టీ నాయకులు అప్రమత్తమై ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. అబ్దుల్ హాఫీజ్ అనే వ్యక్తి పేరుతో ఉన్న ఈ లేఖలో ఎమ్మెల్యే టి.రాజాసింగ్‌ను ఉద్దేశించి తీవ్రస్థాయిలో హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేకు బెదరింపు జారీ చేస్తూ వచ్చిన లేఖలోని అంశాలు అత్యంత వివాదాస్పదంగా ఉన్నాయి. పోలీసులు కూడా తనను ఏమి చేయలేరని సదరు వ్యక్తి లేఖలో సవాలు విసిరినట్లు సమాచారం. గతంలోనూ రాజాసింగ్‌కు పలుమార్లు విదేశాల నుండి స్థానికంగా ఫోన్‌కాల్స్ ద్వారా బెదరింపులు వచ్చాయి. కాని ఈసారి నేరుగా ఎమ్మెల్యే నివాసానికి లేఖ రావడం భద్రతా పరంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై రాజాసింగ్ అనుచరులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

## 2026 నుండి అన్ని నియామకాలు నిర్ణీత సమయంలోనే పూర్తి

### గణతంత్ర వేడుకల్లో టిజిపిఎస్‌సి ఛైర్మన్ బుర్రా వెంకటేశం



**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇకపై 2026 నుంచి అన్ని నియామకాలు నిర్ణీత సమయంలోనే పూర్తవుతాయని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. టిజిపిఎస్‌సి కార్యాలయంలో సోమవారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కమిషన్ సభ్యులు అమీర్ ఉల్లా ఖాన్, ప్రొఫెసర్ నారి యాదయ్య, లక్ష్మీకాంత్ రాథోడ్ కమిషన్ కార్యదర్శి ఎం.హరిత, అధికారులు, సిబ్బంది సమక్షంలో ఛైర్మన్ బుర్రా వెంకటేశం జాతీయ జెండాను ఆవిష్కరించారు. సమావేశాన్ని ఉద్దేశించి ఛైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ.. టిజిపిఎస్‌సి అనేది గొప్ప బాధ్యత, గౌరవాన్ని కలిగి ఉన్న రాజ్యాంగ సంస్థ అన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని నియామకాలు పూర్తయ్యాయని తెలిపారు. గతంలో కొన్ని నియామక ప్రక్రియలు ముగియడానికి చాలా సంవత్సరాలు పట్టిందని తెలిపారు. 2026 నుండి అన్ని నియామకాలు నిర్ణీత సమయాల్లో పూర్తవుతాయని ప్రకటించారు. ఒకే దశలో జరిగే పరీక్షలను మూడు నెలల్లోపు, బహుదశల్లో జరిగే పరీక్షలను 6 నెలల్లోపు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. 2026 సంవత్సరం కమిషన్‌కి అనేక సంస్కరణలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌లో రెండు జాతీయ స్థాయి సమావేశాలు విజయవంతంగా నిర్వహించామన్నారు. ఛైర్మన్ హైలైట్ చేశారు. టిజిపిఎస్‌సి రిసోర్స్ పర్సన్‌ల సమగ్ర డేటాబేస్‌ను రూపొందించింది దేశంలోనే మొట్టమొదటి పిఎస్‌సిగా నిలిచిందన్నారు. టిజి పిఎస్‌సి ద్వారా గ్రూప్-3 ఉద్యోగాలకి ఎంపికైన ఉద్యోగులకు నిర్మాణాత్మక శిక్షణ అందించబడు తుందన్నారు. సిబ్బంది బాధ్యత, అంకితభావంతో తమ విధులను నిర్వర్తించాలని బుర్రా వెంకటేశం సూచించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత, అసంతృప్తి

### అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతాం: ప్రొఫెసర్ కోదండరాం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి26:** తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి నెలకొన్నాయని అన్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. అధికార పార్టీకి తమ నిర్ణయాన్ని తెలియజేశామని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల అంశానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీని సంప్రదించామని, ఆ పార్టీ నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని ఆయన అన్నారు. తాము మాత్రం పోటీ చేయాలని నిర్ణయించుకున్నామని స్పష్టం చేశారు. సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డపై ఉందని కోదండరాం అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సింగరేణిని కార్పొరేట్ శక్తుల చేతిలో బందీ కానివ్వబోమని ఉద్ఘాటించారు. తాను కూడా ఫోన్ ట్యాపింగ్ బాధితుడినేనని ఆయన వెల్లడించారు. అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ చేసినప్పుడు లేని భయం, విచారణ సమయంలో ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. అమరవీరుల త్యాగంతో సాధించిన తెలంగాణలో ప్రజలు పదేళ్లు అధికారమిస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆయన విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం తప్ప ఎవరూ బాగుపడలేదని దుయ్యబట్టారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తెలంగాణ జన సమితి కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## రాజ్యాంగమే భారత్‌ను సార్వభౌమ దేశంగా తీర్చిదిద్దింది

### గణతంత్ర వేడుకల్లో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** దేశంతోపాటు గల్లీ, గల్లీలో 77వ గణతంత్ర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. అందులో భాగంగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలోనూ అలాగే ఉన్నత విద్యా సంస్థల్లోనూ జాతీయ జెండాను ఎగురవేసి గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఈ రోజు 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్-1 ప్రొఫెసర్ పురుషోత్తం, వైస్ ఛైర్మన్-2 ప్రొఫెసర్ ఎస్.కె. మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్‌తోపాటు ఉన్నత విద్యా మండలి, తెలంగాణ ఫీ రెగ్యులేటరీ కమిటి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఛైర్మన్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య సాధనకు తమ ప్రాణాలను అర్పించిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు మరువలేనివన్నారు.

## హెచ్‌ఎండిఏ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవాలు

**హైదరాబాద్, జనవరి 26 ప్రభాతవార్త:** హెచ్‌ఎండిఏ కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు దేశభక్తి వాతావరణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ జాతీయ జెండాను ఆవిష్కరించి, హెచ్‌ఎండిఏ అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. భారత ప్రభుత్వ 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే దృష్టికోణాన్ని విశదీకరించారు. స్వాతంత్ర్యానికి 100 సంవత్సరాలు పూర్తయ్యే ఈ దశలో చేపడుతున్న ప్రధాన కార్యక్రమాల గురించి తెలియజేశారు. ఇందులో హెచ్‌ఎండిఏ ద్వారా చేపడుతున్న రేడియల్ రోడ్ల అభివృద్ధి, ఎలివేటెడ్ కారిడార్లు, నదుల పునరుజ్జీవన ప్రాజెక్టులు, పట్టణ సుందరీకరణ పనులు, పార్కుల అభివృద్ధి తదితర మౌలిక సదుపాయాల కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వ దృష్టికోణానికి అనుగుణంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం, తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రతి ఉద్యోగి తాజా జాతీయ, అంతర్జాతీయ పరిణా మాలపై అవగాహన కలిగి ఉండాలని, వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని మెట్రోపాలిటన్ కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ (జనరల్) కార్యదర్శి, హెచ్‌ఎండిఏ శ్రీవత్స కోట మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలకు ఘన నివాళులు అర్పించారు. అలాగే విభాగం చేపడుతున్న వివిధ కొనసాగుతున్న కార్యక్రమాలపై వివరించారు.

## జలమండలిలో గణతంత్ర దినోత్సవాలు

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** జలమండలిలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ వేడుకలకు ఎండి అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఈడి మయాంక్ మిట్టల్, ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్, టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ఫైనాన్స్ డైరెక్టర్ పద్మావతి, ఆపరేషన్స్ డైరెక్టర్1 వినోద్ భార్గవ, సీజీఎంలు, జీఎంలు, ఉద్యోగులు, అధికారులు, వివిధ యూనియన్ నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



నకిలీ విత్తనాలను పట్టుకున్న పోలీసులు

## రూ. కోటి విలువైన నకిలీ విత్తనాలు పట్టివేత

**నారాయణ పేట, జనవరి 26, ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో నకిలీ విత్తనాల వ్యాపారంపై పోలీస్ అధికార యంత్రాంగం ఉక్కు పాదం మోపింది. రైతులను మోసం చేస్తూ నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డా.వినీత్ తెలిపారు. జిల్లాలోని బండగొండ, భూనీడ్ గ్రామాల్లో సోమవారం అధికారులు దాడులు నిర్వహించారు. జిల్లా పోలీసులు, టాస్క్ ఫోర్స్, వ్యవసాయ శాఖ అధికారులు కలిసి నిర్వహించిన ఆపరేషన్‌లో 100 క్వింటాళ్ల నకిలీ హెచ్‌టి పత్తి విత్తనాలను నిందితుల ఇళ్ల నుండి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వి. బాలకృష్ణ నాయుడు, శశివర్ధన్ నాయుడు అనే తండ్రీ కొడుకులను పోలీసులు నిందితులుగా గుర్తించారు. ఈ ఘటనపై నారాయణపేట రూరల్, మద్దూరు పోలీస్ స్టేషన్లలో రెండు కేసులు నమోదు చేశారు. రైతులను మోసం చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్యాకింగ్ లేని లేదా అనుమానాస్పద విత్తనాలు కొనవద్దని రైతులకు సూచించారు. గుర్తింపు పొందిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేసి, తప్పనిసరిగా బిల్ తీసుకోవాలని వ్యవసాయ శాఖ సూచించింది. ఈ కేసును ఛేదించిన డీఎస్పీ నల్లపు లింగయ్య పర్యవేక్షణలో పనిచేసిన పేట, కోస్గి సీఐలు, ఎస్ఐలు విజయ్ కుమార్, రాముడు, టాస్క్ ఫోర్స్ ఎస్ఐ పురుషోత్తం, ప్రత్యేక పోలీసు బృందం, వ్యవసాయ శాఖ అధికారులను జిల్లా ఎస్పీ అభినందించారు పోలీసు, వ్యవసాయ శాఖ బృందాలను ఎస్పీ అభినందించారు.

## ఇప్పటికీ వడ్డెరల బతుకులు ఏమీ మారలేదు

### గణతంత్ర దినోత్సవాల్లో జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు పిట్ల శ్రీధర్

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా 77వ గణతంత్ర వేడుకలను నిర్వహించుకుంటున్నప్పటికీ.. ఈ 77 సంవత్సరాల్లో వడ్డెరల బ్రతుకులు ఏమీ మారలేదన్నారు జాతీయ వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు పిట్ల శ్రీధర్. సోమవారం హైదరాబాద్ అత్తాపూర్‌లోని జాతీయ వడ్డెర సంఘం కార్యాలయంలో సంఘం జాతీయ అధ్యక్షులు పిట్ల శ్రీధర్ జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు.

అనంతరం పిట్ల శ్రీధర్ మాట్లాడుతూ .. భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అమలు కాబట్టి 77 సంవత్సరాలు అవుతున్నప్పటికీ వడ్డెరుల బ్రతుకులు ఏమి మారలేదన్నారు. అన్ని ప్రభుత్వాలు కూడా వడ్డెరులను వాడుకోవటం, వారి శ్రమను దోచుకోవడం తప్ప వడ్డేరులకు చేసింది ఏమి లేదన్నారు. మన హక్కుల కోసం మనమంతా ఒక్కటై ఉద్యమించాలని... యువకులు, మేధావులు అందరూ కుల సఖ్యతకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా అన్ని సంఘాల నాయకులు బేధాభిప్రాయాలు వీడి కులాభివృద్ధి కొరకు అందరూ ఒక తాటిపైకి వచ్చి సంఘటితంగా పోరాడాలని, అప్పుడే మన హక్కులను మనం సాధించుకోవచ్చన్నారు.

## జనసేన తెలంగాణ కార్యాలయంలో ఘనంగా గణతంత్ర వేడుకలు

### జాతీయ జెండా ఆవిష్కరించిన రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్‌గౌడ్



**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ జనసేన పార్టీ కార్యాలయంలోనూ గణతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించి, గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణతంత్ర దినం అనేది కేవలం ఒక వేడుక మాత్రమే కాదని, రాజ్యాంగం ఇచ్చిన హక్కులను గుర్తు చేసుకుని, వాటిని కాపాడే బాధ్యతను ప్రతి పౌరుడు స్వీకరించాల్సిన రోజన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాలు సాగాలని జనసేన పార్టీ స్పష్టమైన సిద్ధాంతమన్నారు. అబద్ధాలు, అవినీతి రాజకీయాలకు తావులేకుండా, నిజాయితీగా ప్రజల తరఫున నిలబడే రాజకీయ ఉద్యమమే జనసేన అని ఆయన స్పష్టం చేశారు. దేశం ముందుకు సాగా లంటే ప్రజల కోసం అంకితభావంతో పనిచేసే నాయకత్వం అవసరమని, ఆ దిశగా జనసేన పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాధారం రాజలింగం, ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్, కావ్య, శిరీషా, సుధాకర్‌తోపాటు జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, జన సైనికులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య

## ప్రభుత్వరంగ జూనియర్ కాలేజీల్లో ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాల ఉపసంహారణ అన్యాయం

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వరంగ జూనియర్ కాలేజీల్లో ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాల ఉపసంహారణ అన్యాయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అన్నారు. ఇంటర్ బోర్డు ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గత పదేళ్లుగా ప్రభుత్వ రంగానికి చెందిన జూనియర్ కళాశాలలు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలుగా సమర్థవంతంగా పనిచేస్తున్నాయని ఎమ్మెల్సీ తెలిపారు. అన్ని అవసరమైన మౌలిక సదుపాయాలు పూర్తిగా అందుబాటులో ఉండటంతో పాటు, ఇంటర్మీడియట్ విద్యా మండలికి అనుసంధానమైన సీసీటీవీ కెమెరాలు నిరంతరం నిర్వహణలో ఉండగా, అకస్మాత్తుగా ఈ ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలను ఉపసంహరించుకోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ కళాశా లలకు ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాల అనుమతులు ఇస్తూ, అదే అవకాశం ప్రభుత్వ రంగ కళాశా లలకు నిరాకరించడం వివక్షపూరిత నిర్ణయమని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మండిపడ్డారు. ఈ నిర్ణయంతో ముఖ్యంగా హాస్టళ్లలో నివసించే విద్యార్థులు ఇతర కళాశాలలకు 15 కిలోమీటర్లు అంతకంటే ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తోందని, దీని కారణంగా విద్యార్థులు తీవ్ర అసౌకర్యం, మానసిక ఒత్తిడి, ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వ రంగ కళాశాలల్లో గతంలో కొనసాగిన విధంగానే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలను వెంటనే పునరుద్ధరించాలని అలాగే బోర్డుకు అనుసంధానమైన సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థతోనే పరీక్షలు కొనసాగించాలని ఇంటర్మీడియట్ విద్యా మండలిని ఎమ్మెల్సీ కోరారు. ఇంటర్ బోర్డు తమ నిర్ణయం విద్యార్థుల ప్రయోజనాల కోసమేనని పేర్కొంటున్నప్పటికీ.. ఈ అంశంపై ఇంటర్ విద్యామండలి సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య విజ్ఞప్తి చేశారు.



కారును ధ్వంసం చేసిన జనం

## రూ. 26 వేలకే కారు అంటూ ఇన్‌స్టాలో పోస్ట్!

### తీరా కార్లు లేకపోవడంతో జనం ఆగ్రహం

**హైదరాబాద్ (నాచారం), జనవరి 26, ప్రభాతవార్త :** సోషల్ మీడియాల్లో వచ్చే తప్పుడు ప్రకటనలు ఒక్కోసారి ఎంతటి ఉద్రిక్తతకు దారి తీస్తాయో చెప్పడానికి మల్లాపూర్‌లో పాత కార్ల విక్రయదారుడు చేసిన పోస్టు సాక్ష్యంగా నిలుస్తోంది. నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లాపూర్‌లో జరగిన ఘటన సంభందించి వివరాలిలా ఉన్నాయి. మల్లాపూర్‌కు చెందిన రోషన్ అనే పాత కార్ల వ్యాపారి తన వ్యాపారాన్ని ప్రమోట్ చేసుకునేందుకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఇటీవల ఓ ప్రకటన ఇచ్చాడు. కేవలం రూ. 26లకే సెకండ్ హ్యాండ్ కార్లను విక్రయిస్తున్నానని ఇది రిపబ్లిక్ డే సందర్భంగా ఇస్తున్నానని ప్రకటన ఇచ్చాడు. దీంతో ఈ ప్రకటన నెట్టింట వైరల్‌గా మారింది. తక్కువ ధరకు దొరుకుందని ఆశతో స్థానికులతోపాటు దూరప్రాంతాల నుంచి వచ్చిన యువకులు, ప్రజలు సోమవారం ఉదయం నుంచి రోషన్ షోరూంకు వచ్చారు. వందలాది మంది ఒక్కసారిగా రావడంతో ఈ ప్రాంతమంతా కిక్కిరిసి పోయింది. తీరా షాపు తెరిచాక కార్ల గురించి జనం రోషన్‌ను అడు గగా కార్లులేవు ఏమిలేవని నిర్లక్ష్యంగా సమాదానం ఇచ్చాడు. వ్యాపారి మాటలతో తీవ్ర ఆగ్రహానికి గురైన ప్రజలు తాము మోసపో యామని గ్రహించారు. తాము గంటల తరబడి వేచిచూశామని జనం షాపు అతనిని మందలించారు. అంతటితో ఆగకుండా కొందరు అక్కడ ఉన్న ఓ కారు అద్దాలను పగుల గొట్టారు. దీంతో ఈ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. విష యం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తప్పుడు ప్రకటన చేసిన రోషన్‌ను స్టేషన్‌నకు తరలించారు. అతనిపై కేసు నమోదు చేశారు.



## 21వ పారాస్పెషల్ ఫోర్స్ లెఫ్టినెంట్ కల్నల్ ఘటాగే ఆదిత్య శ్రీకుమార్‌కు 'శౌర్యచక్ర'

**న్యూఢిల్లీ, జనవరి 26:** మయన్మార్ భూభాగంలో భారత్ ఓ రహస్య ఆపరేషన్ చేపట్టింది. మిలిటెంట్లు లక్ష్యంగా మన సైన్యం గతేడాది ఆ కోవర్ట్ ఆపరేషన్‌ను నిర్వహించింది. తాజాగా 'శౌర్యచక్ర' పురస్కార ప్రకటనతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఇలాంటి ఆపరేషన్ గురించి కేంద్రం ధృవీకరించడం చాలా అరుదు. 21వ పారా స్పెషల్ ఫోర్స్‌కు చెందిన లెఫ్టినెంట్ కల్నల్ ఘటాగే ఆదిత్య శ్రీకుమార్‌కు కేంద్రం శౌర్యచక్ర అవార్డును ప్రకటించింది. మయన్మార్‌లో అత్యంత కచ్చితత్వంతో ఆపరేషన్ చేపట్టి మిలిటెంట్ క్యాంప్‌ను ధ్వంసం చేసినందుకు గాను ఆదిత్య శ్రీకుమార్‌ను ఈ పురస్కారంతో సత్కరించింది. అయితే ఈ ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను కేంద్రం వెల్లడించలేదు. కేవలం దేశ వ్యతిరేక ముఠాలకు చెందిన శిబిరాలను లక్ష్యంగా చేసుకున్నామని మాత్రం వెల్లడించింది. 2025 జులై 11 నుంచి 13 వరకు భారత్, మయన్మార్ సరిహద్దు ప్రాంతంలో ఈ ఆపరేషన్ జరిగింది. ఇందులో 9 మంది మిలిటెంట్ నాయకులు హతమయ్యారు. మయన్మార్‌లోని సగైంగ్ ప్రాంతంలో జరిపిన డ్రోన్ల, క్షిపణి దాడుల్లో తమ సంస్థకు చెందిన అగ్ర నాయకులు మరణించినట్లు గతేడాది జులైలో యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సాం ప్రకటించింది. ఈ దాడి చేసింది భారత ఆర్మీనేనని అప్పట్లో ఆ సంస్థ ఆరోపించింది. అయితే దీనిపై నాడు కేంద్రం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. భారత్‌కు మయన్మార్‌తో దాదాపు 1600 కిలోమీటర్ల మేర సరిహద్దు ఉంది. అస్సాం ప్రత్యేక ప్రతిపత్తిని డిమాండ్ చేస్తూ గత కొన్నేళ్లుగా ఈ సరిహద్దు ప్రాంతం నుంచి ఉల్ఫా దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతోంది.



## హైకోర్టు ఆవరణలో గణతంత్ర వేడుకలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జనవరి26:** హైకోర్టు ఆవరణలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తులు, రిజిస్ట్రార్లు, అధికారులు,సిబ్బందితో పాటు న్యాయవాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శాసన మండలి, అసెంబ్లీ ఆవరణలో గణతంత్ర వేడుకలు

### జాతీయ జెండాలను ఆవిష్కరించిన చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జనవరి26:** దేశ 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శాసనసభ ఆవరణలో జాతీయ జెండాను తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆవిష్కరించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్, జాతిపిత మహాత్మాగాంధీ గార్ల విగ్రహాలకు స్పీకర్ ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, కౌన్సిల్ సెక్రటరీ డా.వి నరసింహా చార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి. అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతీయులందరికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ హృదయ పూర్వక గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ శాసనమండలి ప్రాంగణంలో మండలి చైర్మన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మల్కా కొమురయ్య,దయానంద్,తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



## రాయల్ ఛాలెంజర్స్‌పై ముంబయి ఇండియన్స్ గెలుపు

### 15 పరుగుల తేడాతో ఆర్సీబి ఓటమి

### ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నాట్‌సివర్‌బ్రంట్

**వదోదర, జనవరి 26:** మహిళాప్రీమియర్‌లీగ్‌లో 16 మ్యాచ్ ఆద్యంతం ఆసక్తికరంగా మారింది. తొలుత బ్యాటింగ్‌చేపట్టిన ముంబయి ఇండియన్స్ నాలుగు వికెట్ల నష్టానికి 199 పరుగులుచేయగా తదనంతరం లక్ష్యఛేదనలో ఆర్సీబీ చివరికంటూ పోరాడినా ఫలితం దక్కలేదు. నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 184 పరుగులు మాత్రమే చేయగలిగింది. 15 పరుగుల తేడాతో ముంబయి ఇండియన్స్ మహిళా జట్టు విజయం సాధించింది. ప్లే ఆఫ్స్ అవకాశాలను మెరుగుపరుచుకోగలిగింది.

బ్రంట్ 100 పరుగులు చేసి శతకంతో చెలరేగి ఆడితే ఓపెనర్ మాథ్యూస్ కూడా 56 పరుగులుచేసి అర్థశతకంచేసింది. ప్రత్యర్థి జట్టులో రిచాఘోష్ 90 పరుగులుచేయడం మినహా జట్టులో మరెవ్వరూ రాణించలేకపోయారు.

ముంబయి బౌలర్లలో మాథ్యూస్ మూడు వికెట్లు తీస్తే ఇస్మాయిల్, అమేలియా ఖేర్‌లు చెరో రెండు వికెట్లు తీసారు. అమన్‌జ్యోత్‌కౌర్ మరో వికెట్‌తీసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నాట్‌సీవర్‌బ్రంట్ ఎంపికయింది. కేవలం 57 బంతుల్లోనే 100 పరుగులుచేసి మురిపించింది. తదనంతరం ముంబియి ఇండియన్స్‌లో హేలీమాథ్యూస్ కూడా అర్థశతకంతో రాణించింది.

## అల్పపీడన ద్రోణి ప్రభావంతో టిఎస్, ఎపిలో అక్కడక్కడా వర్షాలు

### రాష్ట్రంలో మారుతున్న వాతావరణం

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో చలి తీవ్రత బాగా తగ్గింది. అయితే కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఉదయం పూట చలిగాపోటు, దట్టమైన మంచు కురుస్తోంది. ముఖ్యంగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ తరుణంలో ఈ రెండు రాష్ట్రాల్లో వాతావరణ పరిస్థితులపై ఆ శాఖ కీలక సమాచారం ఇచ్చింది. అల్పపీడన ద్రోణి ప్రభావంతో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. యానములో దిగువ ట్రోపో ఆవరణములో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయి. అల్పపీడన ద్రోణి ఉత్తర కేరళ, అరేబియా సముద్రం వైపు ముందుకు కదులుతోందని, వీటి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇదే సమయంలో తెలంగాణలో చెదురుమదురు జల్లులు పడే వీలుందని తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో వాతావరణం వేగంగా మారుతోంది. గత కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత స్వల్పంగా పెరిగినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ముఖ్యంగా ఉదయం, రాత్రి సమయాల్లో పొగమంచు ప్రభావం అధికంగా ఉంటోంది. రాష్ట్రంలో అత్యంత తక్కువ ఉష్ణోగ్రత కుమరం భీం జిల్లా సిర్పూర్లో 9.8 డిగ్రీ సెల్సియస్ గా నమోదైంది. ఇంకా సంగారెడ్డి జిల్లా కోహీర్ లో 9.8, రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లిలో 9.7, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ఉప్పల్ లో 10 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా తక్కువ ఎత్తులో ఆగ్నేయ, తూర్పు గాలులు వీస్తుండటమే ఈ చలి తీవ్రత పెరగడానికి ప్రధాన కారణమని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అలాగే తూర్పు నుంచి వీస్తున్న గాలుల వల్ల పగటి ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో గాలుల్లో తేమ శాతం పెరగడం వల్ల ఉదయం వేళల్లో అక్కడక్కడా పొగమంచు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో పొగమంచు ప్రభావం ఎక్కువగా ఉంటుందని వెల్లడించారు.

## చార్‌ధామ్‌లో ఇక హిందువులకే ప్రవేశం

### కేదార్‌నాథ్, బద్రీనాథ్ కమిటీ నిర్ణయం

**డెహ్రాడూన్, జనవరి 26:** హిమాలయ పర్వత శ్రేణుల ప్రాంతంలో కొలువై ఉన్న చార్‌ధామ్ పుణ్య క్షేత్రాలైన బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాల్లోకి ఇకపై హిందువులకు మాత్రమే ప్రవేశం కల్పించాలని ఆలయ కమిటీ నిర్ణయించింది. అన్య మతస్థుల ప్రవేశాన్ని నిషేధిస్తూ బద్రీనాథ్ కేదార్‌నాథ్ ఆలయ కమిటీ త్వరలోనే అధికారికంగా తీర్మానం చేస్తోంది. బద్రీనాథ్‌కేదార్‌నాథ్ ఆలయ కమిటీ పరిధిలోని అన్ని ఆలయాలకు వర్తించేలాదీనినిర్ణయించినట్లు బద్రీనాథ్ కేదార్‌నాథ్ ఆలయ కమిటీ అధ్యక్షుడు హేమంత్ ద్వివేది వెల్లడించారు. కమిటీ నియంత్రణలో ఉన్న అన్ని దేవాలయాల్లోకి అన్యమతస్థుల ప్రవేశాన్ని నిషేధిస్తామని ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనను రాబోయే బోర్డు సమావేశంలో ఆమోదించనున్నట్లు తెలిపారు. శీతాకాలం విరామం తర్వాత ఈ ఏడాది చార్‌ధామ్ యాత్ర ప్రారంభం కానుంది. ఆలయాల పునఃప్రారంభ తేదీలు ఇలా ఉన్నాయి. బద్రీనాథ్ ఆలయ ద్వారాలు ఏప్రిల్ 23న తెరుచుకోనున్నాయి. కేదార్‌నాథ్ ఆలయ పునఃప్రారంభ తేదీని మహాశివరాత్రి నాడు అధికారికంగా ప్రకటిస్తారు. గంగోత్రి, యమునోత్రి ఆలయ ద్వారాలను అక్షయ తృతీయ సందర్భాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 19న తెరుస్తారు.



ఉత్తరాఖండ్‌లో పెరుగుతున్న భద్రతా ఆందోళనలు, మతపరమైన పవిత్రతను కాపాడాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా హిందూ సంస్థలు, స్థానిక పూజారులు ఈ విజ్ఞప్తిని కమిటీ ముందు ఉంచుతున్నారు. ఈ ప్రతిపాదన ఆమోదం పొందితే బద్రీనాథ్‌కేదార్‌నాథ్ ఆలయ కమిటీ పరిధిలోకి వచ్చే అన్ని ఉపాలయాలకు కూడా ఈ నిబంధన వర్తిస్తుంది.

## బిజెపి సంస్థాగత సంస్కృతి కలిగిన పార్టీ

### రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** బిజెపి ఒక విశిష్టమైన సంస్థాగత సంస్కృతి కలిగిన పార్టీ అని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పేర్కొన్నారు. సంఘటన్ పర్వ్‌లో భాగంగా భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుని ఎన్నిక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో రిటర్నింగ్ ఆఫీసర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించిన రాజ్యసభ సభ్యులు డా. కె. లక్ష్మణ్‌ని సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఘనంగా సత్కరించారు. సాధా రణ కార్యకర్త కూడా అంకితభావం, క్రమ శిక్షణ, సేవాభావంతో కష్టపడితే పార్టీ అత్యున్నత స్థాయిలకు ఎదగగలిగే అవకాశం కల్పించే ఏకైక రాజకీయ పార్టీ భారతీయ జనతా పార్టీనేనని వారు స్పష్టం చేశారు. ఇదే బిజెపిని ఇతర రాజకీయ పార్టీలన్నిటికంటే భిన్నంగా నిలబెడుతోం దని తెలిపారు. సంఘటన్ పర్వ్ వంటి కీలక దశలో డా. కె.లక్ష్మణ్ అత్యంత బాధ్యతాయు తమైన పాత్రను సమర్థవంతంగా నిర్వహించడంపై బిజెపి రాష్ట్ర నాయకత్వం గర్వంగా భావిస్తున్నదని తెలిపారు. ఆయన నిబద్ధత, పారదర్శకత, సంస్థాగత నైపుణ్యం పార్టీ నాయ కత్వం లోని బలం, లోతును ప్రతిబింబిస్తు న్నాయని కొని యాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డా. ఎన్. గౌతమ్ రావు, సీనియర్ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి, మర్రి శశిధర్ రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోల్‌కతాలో ఏడుగురు సజీవదహనం

### ఆహార ఉత్పత్తుల గోదాములో భారీ అగ్నిప్రమాదం, 20 మంది ఆచూకీ కోసం అన్వేషణ

**కోల్‌కతా, జనవరి 26:** గణతంత్ర వేడుకలతో దేశం మొత్తం తలమునకలయి ఉంటే పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా శివార్లలోని నజీరాబాద్ ప్రాంతంలో తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఓ ఆహార పదార్థాల గోదాంలో మొదలైన మంటలు క్షణాల్లో పక్కనే ఉన్న మరో రెండు గోదాములకు వ్యాపించాయి. ఈ ఘోర ప్రమాదం ఏడుగురి ప్రాణాలను బలితీసుకుంది. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని నజీరాబాద్ (ఆనందపూర్ ప్రాంతం)లో ఉన్న ప్యాక్ చేసిన ఆహార పదార్థాలు, సాఫ్ట్ డ్రింక్ బాటిళ్ల గోదాములో సోమవారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. ఇప్పటివరకు ఏడుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. గోదాము లోపల పని చేస్తున్న సుమారు 20 మంది కార్మికులు గల్లంతైనట్లు వారి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో గోదాముకు బయట నుంచి తాళం వేసి ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల లోపల ఉన్న సెక్యూరిటీ గార్డులు, నైట్ డ్యూటీలో ఉన్న కార్మికులు బయటకు



రాలేకపోయారు. గల్లీలు చాలా ఇరుగ్గా ఉండటం వల్ల ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. పైపుల పొడవు సరిపోకపోవడంతో మంటలను అదుపు చేయడం ప్రారంభంలో కష్టతరమైంది. అగ్నిమాపక శాఖ వెంటనే అప్రమత్తమై 15 ఫైర్ ఇంజన్లను, డజన్ల కొద్దీ ఫైర్ ఫైటర్లను రంగంలోకి దించింది. గ్యాస్ కట్టర్ల సాయంతో గోదాము గోడలను, తలుపులను పగులగొట్టి లోపలికి ప్రవేశించారు.

ప్రస్తుతం మంటలు చాలా వరకు అదుపులోకి వచ్చాయి. శిథిలాల నుంచి ఇప్పటివరకు రెండు మృతదేహాలను వెలికితీశారు.మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇంధన శాఖ మంత్రి అరూప్ బిస్వాస్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. గల్లంతైన వారి కోసం గాలిస్తున్నాం. రాజకీయం చేయాల్సిన సమయం కాదు, బాధిత కుటుంబాలను ఆదుకోవడమే మా ప్రాధాన్యతని మంత్రి పేర్కొన్నారు. అగ్నిప్రమాదానికి ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు.

షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. గోదాముల్లో కనీస అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అనే కోణంలో అధికారులు విచారణ జరుపుతున్నారు. పండుగ పూట జరిగిన ఈ ప్రమాదం కోల్‌కతాలో తీరని శోకాన్ని నింపింది. గల్లంతైన 20 మంది కార్మికుల పరిస్థితిపై ఆందోళన నెలకొంది.

## భూమిలో ఫెస్టిసైడ్స్‌ను తొలగించే కొత్త టెక్నాలజీ

### తెలంగాణ శాస్త్రవేత్తల విజయం

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** ప్రస్తుతం వ్యవసాయంలో రసాయన మందుల వాడకం ఎక్కువయిపోయింది. దీంతో మళ్లీ పాతకాలంలో మాదిరిగా ఆర్గానిక్ పద్ధతిలో పండించే పంటలను డిమాండ్ పెరిగింది. ఇందుకోసం భూమిలోని పెస్టిసైడ్స్ ను తొలగించే పద్ధతిని తెలంగాణ శాస్త్రవేత్తలు కనిపెట్టారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం మైక్రోబయాలజీ విభాగానికి చెందిన శాస్త్రవేత్తలు వ్యవసాయంలో రసాయన ఎరువుల ఎఫెక్ట్‌ను తొలగించే పరిష్కారాన్ని కనుగొన్నారు. పంటల కోసం ఉపయోగించే రసాయన ఎరువులను మట్టిలోంచి తొలగించే సరికొత్త ప్రయోగాన్ని సక్సెస్‌ఫుల్‌గా జరిపారు. కేవలం మూడు వారాల్లో 90 శాతం వరకు భూమిలోని పెస్టిసైడ్స్ తొలగించే మైక్రోబియల్ ప్రక్రియను అభివృద్ధి చేశారు. ఈ పరిశోధనను ప్రొఫెసర్ బుర్గుల సందీప్త నేతృత్వంలో మూడు సంవత్సరాలపాటు నిర్వహించారు. ఈ అధ్యయనంలో శాస్త్రవేత్తలు అధికంగా పురుగుమందులు వినియోగించే వ్యవసాయ భూముల నుండి 12 రకాల సూక్ష్మజీవులను గుర్తించారు. వీటిలో ఐదు రకాలను ఎంపిక చేసి వాటివల్ల విషపూరిత రసాయనాల తొలగింపు సామర్థ్యాన్ని పరిశీ లించారు. ప్రయోగాల కోసం రెడ్, బ్లాక్ మట్టిలో నాలుగు నుంచి ఐదు రెట్లు అధికంగా కలిగిన పెస్టిసైడ్ స్థాయిని ఉపయోగించారు. ఈ సూక్ష్మజీవులను సహజ వెలుతురు, గాలి పరిస్థితుల్లో ప్రయోగించగా, కేవలం మూడు వారాల్లో మట్టిలోని పెస్టిసైడ్ మిగులు 75 నుండి 90 శాతం వరకూ తగ్గినట్లు ఫలితాలు చూపించారు.

## 4,500 మంది విద్యార్థులతో జాతీయ పతాకాల ఎగురవేత

### హైటెక్స్ వేదికగా శ్రీచైతన్య విద్యాసంస్థల ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి26:** దేశభక్తికి ప్రతీకగా శ్రీచైతన్య విద్యాసంస్థలకు చెందిన 50కిపైగా బస్సులలో హైదరాబాద్ నలుమూలల నుంచి తరలివచ్చిన 2026 మంది ఎన్‌సిసి బాలికలు పాల్గొని ఏకకాలంలో 2026 జీతాయ పతాకాలను ఆవిష్కరించి రికార్డు సృష్టించారు. వీరితోపాటు ప్రభుత్వ,ప్రైవేట్ చిత్ర పరిశ్రమలకు చెందిన ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై జెండా వందన కార్యక్రమంలో పాల్గొన్నారు.సోమవారం హైటెక్స్ వేదికగా గణతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత విశేషంగా జరిగాయి. ప్రాంగణమంతా త్రివర్ణమయమై జాతీయ భావం ఉప్పొంగేలా ఈ గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ కార్య క్రమం ద్వారా ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందింది. నారీ శక్తి నేపథ్యంగా,దేశభక్తి ప్రతీకగా శ్రీచైతన్య విద్యా సంస్థలకు చెందిన 2026 ఎన్సీసి బాలికలు పాల్గొని 2026 జాతీ య పతాకాలను ఎగురవేసి రికార్డ్ సృష్టించారు. ఇదే విధంగా మల్లారెడ్డి కాలేజీ నుంచి సైతం 2000 మంది విద్యార్థినులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వా హకులు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వ్యవ స్థాపకులు కె.వివేకానంద బాబు మాట్లాడుతూ ఈ విధంగా గణతంత్ర దినోత్స వేడుకలు నిర్వహిం చడం ఇదే తొలిసారి అని తెలిపారు. 2026 సంవత్సరంలో 2026 జాతీయ పతాకాలను, 2026 మంది ఎన్‌సిసి బాలికలతో పాటు దాదాపు 4500 మంది పాల్గొని ఏకకాలంలో ఆవిష్క రించడం ఒక రికార్డుగా పేర్కొన్నారు.






## ఐద్వా మహాసభల్లో 'సర్'కు వ్యతిరేకంగా తీర్మానం

### రెండో రోజు 4 తీర్మానాలకు ఆమోదం

### ప్రారంభంలో జాతీయ జెండాను ఎగురవేసి గణతంత్ర దినోత్సవం నిర్వహణ

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో ఆదివారం నుంచి ప్రారంభమైన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభల్లో భాగంగా సోమవారం రెండో రోజు ప్రతినిధుల సభ కొనసాగింది. ప్రతినిధులు సభ ప్రారంభం కంటే ముందు ఉదయం 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఐద్వా మాజీ అధ్యక్షురాలు, మాజీ ఎంపి మాలినీ భట్టాచార్య జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఐద్వా జాతీయ అధ్యక్షురాలు, ప్రధాన కార్యదర్శి రాజ్యాంగం ప్రవేశికను చదివి వినిపించారు. ప్రతినిధులు రాజ్యాంగంలో పొందుపరచబడిన సూత్రాలను నిలబెట్టుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కేరళ ప్రభుత్వ ఉన్నత విద్యా మంత్రి ఆర్. బింధు ఎంపిక చేసిన 10 మంది మహిళా కళాకారుల చిత్రాలను ప్రదర్శించిన ఐలమ్మ కళా ప్రదర్శనను ప్రారంభించారు.ఐద్వా జాతీయ మహాసభలకు సోదర సంఘాలైన సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐఏకెస్ సంఘాల నాయకులు తమ సౌహార్ధ సందేశాలను ఇచ్చారు. ఆల్ ఇండియా కిసాన్ సభ (ఏఐకెఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, భారత కార్మిక సంఘాల కేంద్రం (సిఐటియు) జాతీయ అధ్యక్షుడు సుదీప్ దత్తా, భారత ప్రజాస్వామ్య యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) అఖిల భారత ప్రధాన కార్యదర్శి హిమఘ్నరాజ్ భట్టాచార్య, భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) జాతీయ ఉపాధ్యక్షురాలు ఎస్. శిల్ప, అఖిల భారత శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జాతీయ కన్వీనర్ ఎ.ఆర్. సింధు తమ సందేశాలను ఇచ్చారు. మహాసభల్లో జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపై నివేదికను ప్రధాన కార్యదర్శి సమర్పించారు. దీనిపై మధ్యాహ్నం వరకు 16 రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు మాట్లాడారు. మహాసభల సందర్భంగా ఐద్వా జాతీయ అధ్యక్షులు పికె శ్రీమతి, జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే, జాతీయ సహాయ కార్యదర్శి అర్చనా ప్రసాద్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ మీడియాతో మాట్లాడారు. మహాసభల్లో రెండో రోజు నాలుగు తీర్మానాలు ఆమోదం పొందినట్టు తెలిపారు.

## అంబేద్కర్ వర్సిటీలో త్వరలో వ్యవసాయ ఆధారిత వృత్తి నైపుణ్య కోర్సులు

### విసి ప్రొ. ఘంటా చక్రపాణి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జనవరి 26, ప్రభాతవార్త:** రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ కలలు కన్న సమాజాన్ని నిర్మించడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని వైస్ ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూడా బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో కొత్తగా వ్యవసాయ ఆధారిత వృత్తి నైపుణ్య కోర్సులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో విశ్వవిద్యాలయం వృత్తి నైపుణ్య, వ్యవసాయ ఆధారిత కోర్సులు అందించనున్నట్లు, గ్రామీణ తెలంగాణ విద్యార్థులకు, రైతులకు మేలు జరిగేలా ఈ కోర్సులను రూపొందిస్తున్నామన్నారు.




గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ జోనల్ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణచేస్తున్న ఎల్ఐసి జోనల్‌మేనేజర్ పునీత్‌కుమార్

## డిజిటల్ సాంకేతికతతో మరింత చేరువగా ఎల్ఐసి సేవలు

### జోనల్‌మేనేజర్ పునీత్‌కుమార్

**హైదరాబాద్,జనవరి 26:** జీవితబీమాసంస్థలో మరింతగా అమలుచేస్తున్న డిజిటల్ సాంకేతికతతో పాలసీదారులకు మరింత మెరుగైన సేవలందించగలుగుతున్నామని సంస్థ జోనల్‌మేనేజర్ పునీత్‌కుమార్ తెలిపారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జోనల్ కార్యాలయంలో ఆయన జాతీయ పతాకం ఆవిష్కరించి అనంతరం ప్రసంగించారు. ఉద్యోగులు, ఏజెంట్లు కృషితోనే ఎల్ఐసి మరింతగా ప్రజల్లోకి వెళుతోంద న్నారు. అత్యంత స్వల్ప వ్యవధిలోనే డిజిటల్ టెక్నాలజీ సాయంతో ప్రజలకు చేరువవుతున్నామన్నారు. ఉద్యోగులు, ఏజెంట్లు మరింత అంకితభావంతో పనిచేసి సంస్థ పురోభివృద్ధికి కారకులుగా నిలిచి దేశాన్ని మరింత శక్తివంతమైన పథంలోకి నడిపించేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. జీవితబీమాసంస్థకు కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా సేవలందిస్తుందని, మరింతగా కొత్త ఉత్పత్తులను రూపొందిస్తూ ప్రజలకు చేరువచేస్తోందని అన్నారు. పెట్టుబడులు,బీమారంగాల్లో జీవితబీమాసంస్థకు మించింది మరోటిలేదని ఆయన అన్నారు. మై ఎలహైసి, మై కంట్రీ, మై ఎర్త్ ఈమూడు అంశాలే ప్రామానిఖంగా ఎల్ఐసి ఉద్యోగులు,ఏజెంట్లు ముందుకు సాగాలని అన్నారు. అలాగే ప్లాస్టిక్ వినియోగాన్ని వదిలి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలన్నారు. మేకిన్ ఇండియా కార్యాచరణను మరింత ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. సీనియర్ అధికారులు పిపి కేల్కర్, ఎం రవికుమార్; ఎస్ సర్వణ రమేష్; జిఎస్ శాస్త్రి, ఎఎం హిలాలి, జోనల్ కార్యాలయం, డివిజనల్‌కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.




సోమవారం రిపబ్లిక్ డే సందర్భంగా అమరావతిలో ప్రదర్శించిన విద్యారంగ శకటం




సోమవారం రిపబ్లిక్ డే సందర్భంగా అమరావతిలో ప్రదర్శించిన నైపుణ్యాభివృద్ధి శకటం

# ఆకట్టుకున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ శకటాలు

**విజయవాడ, జనవరి 26 ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై 22 శాఖలు ప్రత్యేక శకటాలు రూపొందించాయి. అమరావతిలో తొలి పర్యాయం జరిగిన "గణతంత్ర దినోత్సవాలల్లో వీటిని ప్రదర్శించారు. వీటిలో వందేమాతరంకు 150 వసంతాలు ఇతివృత్తంగా సాంస్కృతిక శాఖ, పది సూత్రాల మిషన్ కింద పేదరికం లేని సమాజం ఇతివృత్తంతో ప్రణాళికా శాఖ, సెర్ఫ్ శాఖ లు, జనాభా నిర్వహణ, మానవ వనరుల అభివృద్ధి ఇతివృత్తంతో ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్యా శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ లు, నైపుణ్యం, ఉపాధి ఇతివృత్తంతో స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, పాఠశాల విద్యా శాఖ, పరిశ్రమల శాఖ, పర్యాటక శాఖ లు, నీటి భద్రత ఇతివృత్తంతో జలవనరుల అభివృద్ధి శాఖ, మైక్రో ఇరిగేషన్, అటవీ శాఖ లు, రైతువ్యవసాయ సాంకేతికత తో వ్యవసాయ శాఖ, మత్స్య శాఖ లు, ప్రపంచ ఉత్తమ లాజిస్టిక్స్ అంశంతో మౌలిక వసతులు పెట్టుబడులు, సముద్ర మరియు వైమానిక రంగాలు, సీఆర్డీఏ లు, వ్యయ అత్యుత్తమీకరణ (ఖర్చుతగ్గింపు) – శక్తి, ఇంధనం ఇతివృత్తంతో నెడ్కాప్ ఉత్పత్తి పరిపూర్ణత చేనేత, జౌళి శాఖ, ఉద్యానవన శాఖ లు, స్వచ్ఛ ఆంధ్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ (స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్), పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ లు, జీవితంలోని అన్ని రంగాల్లో లోతైన సాంకేతికత ఇతివృత్తంతో ఆర్టీజీఎస్ శకటాలు ఆకట్టుకున్నాయి.

# మంత్రి నారా లోకేష్ 'యువగళం' పాదయాత్రకు మూడేళ్లు

### - కుప్పంలో మొదలై.. రాష్ట్రంలో పెను సంచలనం!

### - అవరోధాలు..అడ్డంకుల్ని అధిగమించి.. మొక్కవోని ధైర్యంతో జనంలోకి !!



కుప్పంలో 2023 జనవరి 27న పాదయాత్ర ప్రారంభించిన నారా లోకేష్ (ఫైల్‌ఫోటో)

**కుప్పం, జనవరి 26 ప్రభాతవార్త** తాత ఇచ్చిన స్ఫూర్తి.. తండ్రి నుంచి అలవర్చుకున్న పట్టుదల.. రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు, యువత గళంగామారి రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర మొదలై మంగళవారంతో మూడేళ్ల పూర్తి చేసుకు ంటోంది. తన యువగళం పాదయాత్రకు మంత్రి నారా లోకేష్ 2023 జనవరి 27న తన తండ్రి, సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం అయిన కుప్పం నుంచే శ్రీకారం చుట్టారు. మూడేళ్ల క్రితం స్థానిక లక్ష్మీపురంలోని శ్రీ వరదరాజస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సుదీర్ఘ యువగళం పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. అదేరోజు కుప్పంలో బహిరంగసభలో ప్రస ంగించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 నియోజక వర్గాల్లోను తొలుత తన పాదయాత్రను కొన సాగించారు. పాదయాత్రఅడుగడుగునా ప్రజలు, రైతులు, మహిళలు, యువత ఇలా అన్ని వర్గాల ప్రజలతో మమేకమై మంత్రి నారా లోకేష్ ముందుకు సాగారు. అవరోధాలు..అడ్డంకుల్ని తట్టుకుని : యువగళం పాదయాత్ర చేపట్టిన మంత్రి నారా లోకేష్ అప్పటి అధికార వైఎస్సార్సీ ప్రభుత్వం నుంచి వచ్చిన జిఓ నెం 1, కొంతమంది అధికారులనుంచి వచ్చిన అవ రోధాలు, అడ్డంకులను తట్టుకుని ముందుకు సాగారు. చిత్తూరు జిల్లాలోని బంగారుపాళ్యంలో మంత్రి నారా లోకేష్ ప్రజలనుద్దేశించి ప్రసంగించేందుకు అప్పటి పోలీసు అధికారులు అనుమతులు నిరాకరించడంతో రోడ్డుపైనే ఛెయిర్‌పై ఎక్కి మంత్రి లోకేష్ ప్రస ంగించారు. ఇలా చాలా చోట్ల పాదయాత్రకుఅడ్డంకులు ఎదురయ్యాయి. అయితే మొక్కవోని ధైర్యంతో మంత్రి లోకేష్ జనంలో వెళ్లి వారి సాదక బాధలు అడిగి తెలుసుకుంటూ ముందుకుసాగారు. ఎక్కడికక్కడ పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో సమావేశమై వారిలో నూతనోత్సాహం తెచ్చారు. పేదరికం లేని రాష్ట్రం కోసమే తాను పాదయాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. కుప్పంలో మొదలు పెట్టిన యువగళం పాదయాత్రను మంత్రి నారా లోకేష్ అలు రాష్ట్రంలోనిదాదాపు వర్గాల్లో ఆయన 31 32 కిలోమీటర్లు యువగళం పాద గళం పాద యాత్ర కారంలో రాగానే మంత్రి నారా లోకేష్ దిగ్వి జయంగా నిర్వ హించారు. 10 00 కి.మీ.ల పాదయాత్ర ఆదోని, 1500కి.మీ.యాత్ర కడప, 2000 కి.మీ.ల పాదయాత్ర కావలి, 3వేలకి.మీ.ల పాదయాత్ర అనకాపల్లి, 3132కి.మీ.ల పాద యాత్ర ఆగనంపూడిలో కొనసాగింది. ఏది ఏమైనా మం త్రి నారా లోకేష్ నాటి పరిస్థితులను ధైర్యం గా ఎదుర్కొని అకుంఠిత దీక్షతో చేపట్టిన 'యువగళం' పాదయాత్ర దిగ్విజయంగా పూర్తి.

## ఈతకు వెళ్లి తండ్రి, కుమారుడు మృతి

**చిట్వేలి, జనవరి 26 ,ప్రభాతవార్త:** ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు తండ్రి, కుమారుడు మృతి చెందిన విషాదకర సంఘటన సోమవారం తిరుపతి జిల్లా చిట్వేలిలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై వినోద్ కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం తిరుపతి నెహ్రూ నగర్ కు చెందిన షేక్ ఆఫ్రిద్( 30) తన కుమార్తె పుట్టెంట్రుకుల కార్యక్రమానికి జనవరి 24 శనివారం రాత్రి 15మంది బంధువులతో చిట్వేలికి చేరుకున్నారు. ఆదివారం వీరిలో నలుగురు తిరుపతికి వెళ్లిపోగా మిగిలిన 11 మంది దర్గాలో ఉన్నారని తెలిపారు. వారిలో ఇద్దరు మినహా మిగిలిన 9 మంది సోమవారం సాయంత్రం నయారా పెట్రోల్ బంకు సమీపంలోని గుంజనేరు వద్ద ఈత కోసం వెళ్లారన్నారు. తన కుమారుడు షేక్ ఆసిఫ్(14) నీటి ప్రవాహంలో కొట్టుకుపోతూ ఉండగా తన కుమారుని కాపాడే ప్రయత్నంలో తండ్రి ఆఫ్రిద్ ఈత రాకపోవడంతో ఇద్దరూ నీట మునిగి ఊపిరాడక మృతి చెందారన్నారు. సంతోషకర సమయంలో విషాదం చోటు చేసుకోవడంతో కుమార్తె గ్రామం చిట్వేలిలో, స్వగ్రామం తిరు పతిలో విషాదం చోటు చేసుకుంది. కేసు నమో దు చేసి, మృతదేహాలను పంచనామాకు తరలిం చినట్లు ఎస్సై వినోద్ కుమార్ వెల్లడించారు.

## భక్తులకు మరింత సౌకర్యవంతమైన దర్శనం

### -గణతంత్రదినోత్సవాన టిటిడి చైర్మన్ నాయుడు

**తిరుమల,జనవరి 26ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం కోసం దేశంనలుమూలల నుండి వస్తున్న భక్తులకు చక్కగా సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే మా ధ్యేయమని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు స్పష్టం చేశారు. సామాన్యభక్తులకు సంతోషకర దర్శనం చేయించేందుకు అధికారులు, పాలకమండలి సంసిద్ధంగా పనిచేస్తోందన్నారు. ఆ దేవుని దర్శనాన్ని వీలైనంత త్వరగా చేయించడంతో బాటు వసతి సదుపాయం పారదర్శకంగా కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నా మన్నారు. సోమవారం ఉదయం తిరుమలలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో 77వ గణతంత్రదినోత్సవాన ఆయన జాతీయజెండాను ఎగురవేశారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, శాంతారామ్, నరేశ్, దర్శన్, అధికారులు పాల్గొన్నారు.

# భక్తుల అభిప్రాయాలతోనే సేవల్లో నాణ్యత

### - కొనుగోళ్ల విభాగంలో విప్లవాత్మక మార్పులు

### - టిటిడి అదనపు ఇఓ వెంకయ్యచౌదరి



**తిరుమల,జనవరి 26ప్రభాతవార్తప్రతినిధి:** భక్తుల అవసరాలకు అనుగుణంగా అభిప్రాయాల సేకరణతోనే సేవల్లో సంస్కరణలు చేపడుతున్నామని టిటిడి అదనపు ఇఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. టిటిడి పురాతన, మహత్తర ధార్మిక సంస్థగా కాలానుగుణంగా తన వ్యవస్థలను పరిశీలిస్తూ, కొనుగోళ్లలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నట్లు చెప్పారు. ఉత్పత్తులు, ప్రక్రియలు, అగ్రిమెంట్స్,రద్దు, నిషేదిత బాజితా వంటి అంశాలతో సమగ్ర పాలసీ సిద్ధమవుతోందని అన్నారు. సోమవారం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను తిరుమలలోని గోకులం అతిధిగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా త్రివర్ణపతాకాన్ని ఆయన అధికారులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం అదనపు ఇఓ వెంకయ్యచౌదరి మాట్లాడుతూ టిటిడిలో వ్యవస్థలను మరింత పటిష్టం చేస్తూ,భక్తులకు నాణ్యమైన సేవలందించడమే లక్ష్యంగా అనేక సంస్కరణలు అమలుచేస్తున్నామన్నారు. భారతరాజ్యాంగం కాలానుగుణంగా సవరణలు చేసుకుంటూ ,ప్రజల అవసరాలకు తగ్గట్లు ముందుకు సాగడం వల్లే భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలిచిందన్నారు. ఏడాదిన్నర కాలంలో టిటిడిలో అన్నప్రసాదం విభాగంలో పాలసీలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామన్నారు. కాటేజీ డొనేషన్ పథకంలో సమగ్రపాలసీ తీసుకురాగలిగామన్నారు. కొనుగోళ్ళ ప్రక్రియ పోర్టల్‌ద్వారా నిర్వహించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని,దీనివల్ల పారదర్శకత పెరిగి మానవజోక్యం గణనీయంగా తగ్గుతుందని ఆయన వివరించారు. వాట్సాప్,ఐవిఆర్ఎస్, ఫోన్‌కాల్స్,శ్రీవారిసేవకుల ద్వారా భక్తుల నుండి ఎప్పటికప్పుడు అభిప్రాయాలను సేకరిస్తూ సేవల నాణ్యతను నిరంతరం మెరుగుపరుస్తున్నామని అదనపు ఇఓ తెలిపారు.అన్నప్రసాదం, లడ్డూల నాణ్యతపై పూర్తి స్థా యిలో భ క్తులు సం తృప్తి వ్యక్త ం చేస్తు న్నారని అన్నారు. సాంకేతిక సంస్క రణలతో వైకుంఠం 1లో ఏర్పాటుచేసిన ఏఐ ఆధారిత కేంద్రం ద్వారా వైకుంఠ ద్వార దర్శన రోజుల్లో దర్శన సమయాన్ని సమర్ధవంతంగా వినియోగించుకుని చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా అత్యధికంగా 7.83లక్షలమందికి దర్శనం కల్పించామన్నారు. ప్రతి వ్యవస్థలో పవిత్రత, పారదర్శకత,భక్తుల ప్రయోజనాలే కేంద్రంగా టిటిడి ముందుకు సాగుతుందని,

తిరుమల ఎల్లప్పుడూ ప్రపంచంలోనే అత్యుత్తమ ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలన్నదే తమ లక్ష్యమని వెంకయ్యచౌదరి అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం ఉద్యోగులకు, విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. భద్రత సిబ్బంది నుండి గౌరవవందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి సిఇ సత్యనారాయణ, డిప్యూటీ ఇఓలు లోకనాథం, భాస్కర్, రాజేంద్ర, సోమన్నారాయాణ, వెంకటయ్య, డిఇ చంద్రశేఖర్, విఎస్‌ఓ అల్లం సురేంద్ర. పిఆర్‌ఓ నీలిమ పాల్గొన్నారు.

# టిటిడిలో శ్రీవారి వైద్యసేవ

### -భక్తుల సౌకర్యార్థం అలిపిరిలో ఇంటెగ్రేటెడ్ టౌన్‌షిప్ - సమున్నత ప్రణాళికతో అంకితభావ సేవలు: టిటిడి ఇఓ ఎకె సింఘాల్



**తిరుపతి,జనవరి 26ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలోని స్విమ్స్, బర్డ్, ఆయుర్వేద, చిన్నపిల్లల ఆస్పత్రులతోబాటు తిరుమలలోని అశ్విని ఆస్పత్రిలో నిపుణులైన వైద్యులతో శ్రీవారివైద్యసేవ త్వరలోనే ప్రారంభించ నున్నట్లు టిటిడి ఇఓ అనిల్‌కుమార్ సింఘాల్ ఉద్ఘాటించారు. శ్రీవారి వైద్యసేవ సేవకుల ద్వారా రోగులకు ఉచితంగా సేవలందించేందుకు ఈ వైద్యసేవను ప్రారంభించేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. భక్తులకు ఇతోధికంగా సేవలం దిస్తున్న శ్రీవారిసేవ విజయవంతం కావడంతో ఇప్పుడు వైద్యసేవ అమలు చేసేదిశగా చూస్తున్నామన్నారు. దేశం నలుమూలల నుండి తిరుమలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అలిపిరిలో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలన ఒక సమున్నత ప్రణాళికతో ఆదర్శవంతంగా భక్తజనావళికి సేవలందిస్తున్నామని అన్నారు. టిటిడి పరిపాలన భవనంలోని మైదానంలో జరిగిన కార్యక్రమంలో మువ్వెన్నెల జాతీయజెండాను టిటిడి ఇఓ అనిల్‌కుమార్ సింఘాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేస్తున్నా మన్నారు. తొలిసారిగా పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలను వైకుంఠ ఏకాదశి లక్కీడిప్ విధానం అమలు చేయడంపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. దేశం నలువైపుల నుండి సుదూర ప్రాంతాల నుండి తిరుమలకు రాలేని భక్తుల సౌకర్యార్థం దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలను నిర్మిస్తున్నట్లు ఇఓ తెలిపారు. గత ఏడాది శ్రీవారి బ్రహ్మోత్సవాలు, పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు, రథసప్తమి.అన్నప్రసాదాలు, శ్రీవారి ఆలయాల నిర్మాణం, శ్రీవారిసేవకుల సేవలు, భక్తులకు అందుబాటులో పిఎసి 5,ఎస్వీగోశాల అభివృద్ధి, పచ్చదనం పెంపు, దాతల వివరాలు వాటిపై ఇఓ సింఘాల్ సమగ్రంగా వివరించారు. విధుల్లో అంకితభావ సేవలందించి ప్రశంసాపత్రాలు, అవార్డులు అందుకున్న ఉద్యోగులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అంతకుముందు భద్రత సిబ్బంది నుండి గౌరవవందనం స్వీకరించారు. ఉద్యోగులకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి. జెఇఓలు వి.వీరబ్రహ్మం, డాక్టర్ శరత్,సివిఎస్‌ఓ కెవి మురళీకృష్ణ, అదనపు సివిఎస్‌ఓ శివకుమార్‌రెడ్డి. సిఇ సత్యనారాయణ, డిఎఫ్‌ఓ ఫణికుమార్ నాయుడు, ఇన్‌ఛార్జి డిఎల్‌ఓ సుబ్బానాయుడు, బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి, డిప్యూటీ ఇఓలు, సూపరింటెండెంట్‌లు, సిపిఆర్‌ఓ డాక్టర్ తలారి రవి, పిఆర్‌ఓ నీలిమ, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 31మంది అధికారులు, 266మంది ఉద్యోగులకు శ్రీవారి వెండి డాలర్, ప్రశంసాపత్రం అందజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

# తిరుమల సమాచారం



## సమష్టి సహకారం.. సమన్వయంతో సేవలు

## అశేష భక్తులకు వాహనసేవల వీక్షణం ఆనందం

**తిరుమల,జనవరి 26ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన మాఘమాసం రథసప్తమిరోజు ఉదయం నుండి రాత్రి వరకు ఏడుకొండల్లో అంగరంగవైభవంగా ఏడు వాహనసేవలు ప్రశాంతంగా జరిగాయి. వారాంతం...వరుసగా కలసివచ్చిన మూడురోజుల సెలవులు వెరసి ఆదివారం రథసప్తమి జరగడంతో అశేషంగా భక్తులు తరలివచ్చారు. ఈ వాహనసేవల వీక్షణకు ముందురోజు శనివారంరాత్రే 2లక్షలమంది భక్తులు ఆలయ మాఢవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరుకున్నా 24గంటలుపాటు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు, పోలీసు, విజిలెన్స్, శ్రీవారిసేవకులు, ఇతర డిప్యూటేషన్ సిబ్బంది విజయవంతంగా భక్తులకు సేవలందించడం అభినందనీయం. గత నెలరోజులు నుండి పక్కా ప్రణాళికలు....కార్యాచరణతో టిటిడి ఉద్యోగులు, తిరుపతి జిల్లా పోలీసుయంత్రాంగం, టిటిడి నిఘాభద్రత విభాగం సమన్వయంతో పనిచేయడంతో అశేషంగా వచ్చిన భక్తులకు వాహనసేవలు వీక్షణం ప్రశాంతంగా చేయించారు. ఏకంగా మూడులక్షలమంది భక్తులు మాఢవీధుల్లో ,వెలుపల జనసంద్రంగా మారినా చిన్నపాటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించడం టిటిడి అధికారులు, జిల్లా యంత్రాంగం టిటిడి ఇఓ అనిల్‌కుమార్‌సింఘాల్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, టిటిడి అదనపు ఇఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్‌ఓ మురళీకృష్ణ, పూర్తిస్థాయిలో జిల్లా అధికారులు,ఉద్యోగులతో,శ్రీవారిసేవకులతో కలసి పటిష్ట వ్యూహంతో సమష్టి పనితీరు అభినందనీయం. ఆలయ మాఢవీధుల్లోని గ్యాలరీల్లో గంటలుగంటలు నిరీక్షించి వేచివున్న ,ప్రతి భక్తునికి శ్రీవారిసేవకులు, పోలీసులు, టిటిడి నిఘాభద్రత సిబ్బంది, ఉద్యోగులు చక్కటి సేవలందించి అన్నప్రసాదాలు, తాగునీరు, టీ అందించి భక్తుల నుండి అధికారులు ,సిబ్బంది మన్ననలు అందుకున్నారు. సిఎం చంద్రబాబునాయుడు కూడా రథసప్తమి విజయవంతంపై టిటిడిని అభినందించారు.

## శ్రీవారి దర్శనంతో మనసుకు ఆనందం

### - తిరుమలలో ప్రముఖులు



**తిరుమల,జనవరి 26ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని గణతంత్రదినోత్సవాన దర్శనం చేసుకుని ఆశీస్సులందుకోవడం ఆనందంగా ఉందని పలువురు ప్రముఖులు తెలిపారు.స్వామివారి ఆశీస్సులందరిపై ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం ఉదయం విఐపి బ్రేక్‌లో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరస వెంకటనారాయణబట్టి, విశాఖ ఎంపి భరత్, సినీనటుడు బ్రహ్మాజీ, తమిళ నటుడు సంతానభారతి కుటుంబంతో కలసి స్వామివారిని దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా ఆలయంవద్దకు విచ్చేసిన వీరికి టిటిడి అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# వాణిజ్య ఉపగ్రహాల ప్రయోగాలతో అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ బలోపేతం

### - షార్ డైరెక్టర్ ఇఎస్ పద్మకుమార్



జాతీయ జెండాకు గౌరవవందనం చేస్తున్న షార్ డైరెక్టర్

**సూళ్లూరుపేట, జనవరి 26 ప్రభాతవార్త** ఇస్రో చేపడుతున్న వాణిజ్య ఉపగ్రహాల ప్రయోగాలతో భారతదేశ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ బలోపేతం అయ్యేందుకు దోహదపడుతుందని షార్ డైరెక్టర్ ఇఎస్ పద్మకుమార్ వెల్లడించారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీహరికోట ఫేజ్2 పెరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ జెండాను ఎగురవేశారు. సందర్భంగా మాట్లాడుతూ ఎస్ఎల్‌వి3 ప్రయోగం నుంచి మొదలైన ఇస్రో ప్రస్థానం ప్రస్తుతం చంద్రయాన్, మార్స్ ఆర్బిట్ మిషన్, గగన్‌యాన్ వంటి ప్రయోగాలు చేసే స్థాయికి చేరుకుందని తెలిపారు. అంతరిక్ష రంగంలో ఇస్రో ఎన్నో మైలురాళ్లను అధిగమించిందని తెలిపారు. ఎల్‌విఎం3 రాకెట్ ద్వారా స్వదేశీ పరిజ్ఞానంతో బ్లూబర్డ్ బ్లాక్3 ఉపగ్రహాన్ని నింగిలోకి ప్రవేశపెట్టిన ఘనత ఇస్రోకి దక్కిందన్నారు. అంతర్జాతీయ అంతరిక్ష రంగంలో ఇస్రో, నాసా సంయుక్తంగా నిసార్ ఉపగ్రహాన్ని గత ఏడాది డిసెంబర్‌లో ప్రయోగించినట్లు ఆయన గుర్తు చేశారు. ప్రధాని మోడీ వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా భారతదేశంలో స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో ఇస్రో ముందుకు దూసుకుపోతుందని తెలిపారు. ఇందుకు ఇస్రోలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరి కృషి ఉందన్నారు. 24/7 పనిచేసే సంస్థలు, పనిచేసే సైంటిస్టులు భారత అంతరిక్ష ప్రగతికి దోహదపడ్డారని పద్మకుమార్ తెలిపారు. దేశం కోసం పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా సిఐఎస్ఎఫ్ దళాలు చేస్తున్న కృషి ఎంతైనా ప్రశంసనీయమని చెప్పారు.

# ఫిబ్రవరి 10 వరకు ఏకీకృత కుటుంబ సమగ్ర సర్వే గడువు పెంపు

**.విజయవాడ,జనవరి 26,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ నెలలో చేపట్టిన ఏకీకృత కుటుంబ సమగ్ర సర్వే గడువును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. వైసీపీ ప్రభుత్వంలో వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి కుటుంబ సర్వే చేపట్టారు. ఈ సర్వేలో ప్రతీ కుటుంబసభ్యుడి వివరాలు, ఆర్థిక వివరాలు నమోదు చేసుకున్నారు. దీని ద్వారా సంక్షేమ పథకాలు అర్హులైనవారికి అందిస్తున్నారు. అయితే గత ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వేలో పలు వివరాలు తప్పుగా నమోదయ్యాయి. దీంతో కొంతమంది ప్రభుత్వ పథకాలకు అర్హత పొందలేకపోతున్నారు. దీనిని గమనించిన కూటమి ప్రభుత్వం.. తప్పులను సరిదిద్దేందుకు కుటుంబ సమగ్ర సర్వేకు శ్రీకారం చుట్టింది. గత ఏడాది డిసెంబర్ నెలలో ఈ సర్వే ప్రారంభించింది. ఫిబ్రవరి 10 వరకు పొడిగింపు డిసెంబర్‌లో సర్వే మొదలవ్వగా.. 30 రోజుల పాటు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 12 వరకు ఈ సర్వే పూర్తి చేయాలని లక్ష ్యంగా పెట్టుకుంది. కానీ ప్రభుత్వం విధించిన డెడ్ లైన్ ముగిసినా సర్వే ఇంకా పూర్తి కాలేదు. టెక్నికల్ కారణాల వల్ల సర్వే ఆలస్యమవుతోంది. దీంతో గడువును ఫిబ్రవరి 10 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సర్వే ద్వారా ఏపీలోని ప్రతీ కుటుంబం వివరాలు నమోదు చేయనున్నారు. ఆన్‌లైన్ విధానంలో ఈ సర్వే చేపడుతుండగా.. గ్రామాల్లో ఫోన్ సిగ్నల్స్ ఉండకపోవడం, ఇంటర్నెట్ స్పీడ్ తక్కువగా ఉండటం వల్ల వివరాలు నమోదు చేయడంలో జాప్యం జరుగుతోంది. దీంతో సర్వేలో వివరాలు నమోదు చేయడం కష్టమవుతుందని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. ఈ సమగ్ర కుటుంబ సర్వేలో ఇంటింటికి వెళ్లి 20 రకాల అంశాలపై సమాచారం సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఒక్కో కుటుంబం వివరాల నమోదుకు గంటకుపైగా సమయం పడుతోంది. ఆన్‌లైన్‌లో కుటుంబ వివరాలు నమోదు చేసేందుకు మధ్యలో టెక్నికల్ సమస్య వస్తే.. అప్పటివరకు నమోదు చేసిన వివరాలు అన్నీ పోతున్నాయి. దీంతో మళ్లీ మొదటి నుంచి వివరాలు నమోదు చేయాల్సి వస్తోంది. దీని వల్ల మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఉద్యోగులు వాపోతున్నారు. ఈ కారణం వల్లనే సర్వేలో జాప్యం జరుగుతోంది. ఇప్పటికే ఈ సమస్య గురించి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆఫ్‌లైన్‌లో ఈ సర్వే చేపడితే బాగుంటుందని సూచిస్తున్నారు. దీని వల్ల సిగ్నలింగ్ సమస్య ఉండదని, సర్వే వేగంగా పూర్తవుతుందని అంటున్నారు.

# టీ బదులు ఇది తాగండి !



వేపుదు కూరలు తినొద్దు,

1.కాయగూరలను ఉడికించి తాలింపు పెడితే మంచిది అంటున్నారు ఆహార నిపుణులు. అలా కూరగాయల్ని ఉడికించాక.. ఆ నీటిని పారబోస్తున్నారా! ఆ నీళ్ల తాగటం వల్ల ఎన్ని ప్రయోజనాలున్నాయో తెలుసా.... కూరగాయలు ఉడికించిన నీళ్లలో చిటికెడు ఉప్పు కలిపి తాగారంటే.. శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు అందుతాయి. ఇంకా రుచిగా ఉండాలంటే కాస్తంత మిరియాల పొడి జోడిస్తే సరి.

2.ఈ నీరు తేలిగ్గా జీర్ణమై వెంటనే శక్తి కలుగుతుంది.

3.వెచ్చగా ఉన్నప్పుడు తాగితే.. అలసట పోయి ఉత్సాహంగా ఉంటుంది. కాఫీ, చాయ్‌కు బదులు ఈ నీటిని తాగటం అలవాటు చేసుకుంటే ఆరోగ్యం సురక్షితం. బరువు తగ్గాలనుకునేవారికి ఈ నీరు తాగడంలా పనిచేస్తుంది. గోరుచిక్కుడు, క్యారెట్, క్యాబేజ్, క్యాలీఫ్లవర్, బీట్రూట్, దోస.. స్థిర కొద్దికొద్దిగా చేర్చి ఉడికించి తాగితే మరింత ఉపయోగం. రక్తహీనత నుంచి బయటపడొచ్చు. ఆ నీటిని అలాగే తాగటం ఇష్టం లేకపోతే.. సూప్, పులుసు, నూడుల్స్, పాస్తా ఫ్రైడ్ రైస్ వంటి వాటిలో ఉంటాయి.

# స్క్రీన్‌టైమ్ పెరిగితే..



గత రెండు దశాబ్దాలుగా భారత్ బాలికల్లో రుతుచక్రం మొదలయ్యే వయసు తగ్గుతూ వస్తోందని వైద్యులు చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణాలుగా... తీసుకునే ఆహారం, దానితో పాటు జీవనశైలి మార్పులను చెబుతున్నారు. ఎక్కువగా ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను తీసుకుంటాం. వాటిలో కొవ్వులూ, కార్బోహైడ్రేట్లూ అధిక మోతాదులో ఉన్నాయి. పైగా వాటిలో నిల్వ వేసేందుకు, రుచి, రంగు కోసం... మోనో సోడియం గ్లుటామెట్, సోడియం నైట్రేట్, కృత్రిమ గులు, గవార్ గం, సోడియం బెంజోయెట్... లాంటి అనేక పదార్థాలను జోడిస్తుంటారు. ఇవన్నీ ఇవిధ రకాలుగా ఆరోగ్యానికి హానిచేసేవే పాటు ఎక్కువ సమయం కదలకుండా స్క్రీన్ సూస్తూ కూర్చొని ఉంటూ ఆటలకు తగినంత సమయం కేటాయించడం లేదు. స్క్రీన్ని ఎక్కువగా వాడటంవల్ల హార్మోన్లలో మార్పులు ఉన్నాయి. ఆహారంలో హార్మోన్లు ఇచ్చి పెంచిన పౌల్ట్రీ తృత్తులు, పాలు... ఇవన్నీ రుతుచక్రం చాలా చిన్న వయసులోనే మొదలయ్యేం దుకు సహాయపడు తున్నాయి. కొందరిలో తొమ్మిదేళ్లకే ఇంకొందరిలో అంతకంటే రెండుమూడేళ్ల ముందే శరీరంలో దార్పులు వస్తున్నాయి. వాతావరణ కాలుష్యం కూడా హార్మోన్ల అసమతుల్యతకు రణమవు తున్నాయి. ముడి పదార్థాలతో తాజా ఆహారాన్ని తీసుకోవడం, రోజూ నంత వ్యాయామం చేసేలా చూడటం వంటి జీవనశైలి మార్పులతో శరీరంలోని ముందస్తు కార్పుల్ని ఆలస్యం చేయొచ్చని నిపుణులు ఎక్కువగా చేస్తారు.

# ఆమె సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక అవార్డు




**సాంకేతికత, ఆర్థిక అంశాల్లో దూసుకెళ్తున్న దేశాలే కాదు... దయనీయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నవీ చాలానే! అలాంటి వాటిలో దక్షిణ సూడాన్ ఒకటి. పేదరికం, వివక్ష, గృహహింస, విశ్రాంతి వేధింపులు... వంటి ఎన్నింటికో మారు పేరు. అలాంటి శాంతికోసం కృషి చేస్తున్నారు మేజర్ స్వాతి శాంతకుమార్.**

ఆ సేవలకు గుర్తింపుగా తాజాగా ప్రతిష్ఠాత్మక యూఎన్ సెక్రటరీ జనరల్స్ అవార్డును అందుకున్నారు. మేజర్ స్వాతిది బెంగళూరు. ముగ్గురు తోబుట్టువుల్లో ఆమె పెద్దది. చిన్నతనం రక్షణ రంగంలోకి రావాలి, దేశ నుంచి సేవ చేయడానికి కలలుకన్నారు. అమ్మా నాన్నలూ ప్రోత్సహించడంతో ఇంజినీరింగ్ పూర్తయ్యాక భారత సైన్యంలోకి అడుగుపెట్టారు స్వాతి. ఇండియన్ ఆర్మీలోని ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీర్స్ దళంలో సేవలందిస్తున్నారామె. యుద్ధం. తీవ్రవాదం, రాజకీయ పోరాటాలు, మహిళలపై హింస వంటి సమస్యలతో కూడిన శాంతిని నెలకొల్పేందుకు ఐక్యరాజ్యసమితి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుంది. వివిధ దేశాలకు చెందిన సైనికులు, పోలీసులు శాంతి దూతలుగా ఉన్న ప్రాంతాలకు పంపుతారు. అలా ఐక్యరాజ్యసమితి శాంతిదూతగా ఎంపికయ్యారు మేజర్ స్వాతి. దక్షిణ సూడాన్‌లో 15 నెలలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. తూర్పు ఆఫ్రికాలోని పేద దేశాల్లో దక్షిణ సూడాన్ ఒకటి. లింగవివక్ష, అమ్మాయిలు చదువుకు దూరమవ్వడం, బాల్యవివాహాలు, అత్యాచారాలు ఎక్కువగా జరుగుతుంటాయి. అలాంటి చోట లింగ సమానత్వం, శాంతి నెలకొల్పే దిశగా కృషి చేస్తున్నారు స్వాతి. ఇందుకోస ఈక్వల్ పార్టనర్స్, లాస్టింగ్ పీస్ అనే ప్రత్యేకత రూపొందించ బడింది... తన బృందంతో అక్కడి ప్రాంతాలలో గస్తీ, ఎయిర్ పెట్రోలింగ్ కాలనీ చేశారు. ఈ చర్యల ద్వారా ఎంతోమంది మహిళలకు రక్షణను అందించడమే కాదు.. లింగ సమాన త్వం దిశగా అడుగులు పడేలానూ చూశారు స్వాతి, కాబట్టే, ఐక్యరాజ్య సమితి మెప్పును పొందడంతోపాటు 'యూఎన్ సెక్రటరీ జనరల్స్' అవార్డుకీ ఎంపికయ్యారామె, ఇక్కడి మహిళలు స్వతహాగానే శక్తిమంతులు. తమని ఆయా ప్రాంతాలు పాలించగలిగే సమర్థత వారిలో ఉంది, కానీ పురుషాధిక్యత వాళ్లకి అడ్డుపడుతోంది. ఆ 'అణచివేతను తరమడమే నా లక్ష్యం 'అంటున్నారు మేజర్ స్వాతి.

# గరుత్మంతుడు

**దయ తోటి మనుషులకే పరిమితం కాదు** పశు పక్ష్యాదులపట్ల కూడా అదే భావన కలిగుండాలి. దయాగుణానికి మరో రూపం జీమూతవాహనుడు. ప్రమాదకరమైన పాముల కోసం తనను తాను ఆత్మార్పణ చేసుకోవడానికి సిద్ధపడ్డాడు. ఇతడోరోజు పర్వతప్రాంతంలో విహరిస్తుండగా ఎముకల గుట్ట కనిపించింది. అక్కడో వృద్ధురాలు ఏడు స్తోంది. అవి పాముల ఎముకలనీ, గరుత్మం తుడు నిత్యం పాములను వేటాడుతుంటే భయంతో బతకలేక రోజుకొకటి ఆహారంగా వెళ్లేలా గరుత్మంతునితో ఒప్పందం కుదుర్చు కున్నాయని, ఆ రోజు తన పుత్రుడు శంఖచూడుడి వంతనీ చెప్పిందామె. ఆ తల్లి దుఃఖాన్ని చూడలేక గరుత్మంతునికి ఆహారంగా వెళ్లాడుజీమూత వాహనుడు. సాటి ప్రాణుల పట్ల అంతటి కరుణ చూపిన అతణ్ణి చూసి పశ్చాత్తాపం చెందాడు గరుత్మంతుడు. పైగా స్వర్గం నుంచి అమృతాన్ని తెచ్చి ఎముకల గుట్టగా ఉన్న నాగుల్ని బతికించాడు. జీమూతవాహనుని దయ ఆత్మార్పణ రూపంలో వ్యక్తమై, గరుత్మంతునిలోని ప్రతీకారాన్ని దయగా మలిచింది. సృష్టిలోని సకల జీవులూ సామాన్యంగానే జీవిస్తాయి. మనిషి మాత్రం కోరికల పుట్ట. తన అవసరాల కోసం అన్ని ప్రాణుల్నీ ఉపయోగించుకుంటాడు. నిజానికి బుద్ధిజీవుల మైన మనం చుట్టూ ఉన్న ప్రాణుల అవసరాలను తీర్చేం దుకు ప్రయత్నించాలి. దీన్నే సంప్రదాయం భూతయజ్ఞంగా పేర్కొంది. ఇది పంచ మహాయజ్ఞాల్లో ఒకటి. మనం భోజనం చేసేటప్పుడు కొంత ఆహారాన్ని పక్కకు తీసి మంత్రపూర్వకంగా భోజనం చేయాలి. తిన్న వెంటనే పక్కనుంచిన ఆహారాన్ని తీసుకెళ్లి ఇంటి బయట శుభ్రమైన స్థలంలో అమంత్రకంగా ఇతర ప్రాణుల కోసం ఉంచాలి. ఈ భూతదయను పెంపొందించు కోవాలి. దయాగుణం ఎంత మహోన్నతమైనప్పటికీ దుర్మార్గుల పట్ల సముచితం కాదు.



# క్షణాల్లో పీచుమిఠాయి



బండిమీద పీచు మిఠాయి అంటూ అరుపు వినిపించిందంటే.. అది కావాలంటూ మారాం చేయని పిల్లలు. కానీ శుభ్రత ఉండదని... అది కొనివ్వడం మనకు నచ్చదు. చిన్నారుల కోసం కాటన్‌డీ మనమే చేద్దామా. పీచుమిఠాయి చేయడానికి రెండు విధానాలున్నాయి... కప్పు పంచదార, చిటికెడు ఫుడ్ కలర్ తీసుకోవాలి. రెండూ కలిపి మెత్తగా గ్రైండ్ చేయండి. ఆ పొడిని లేని పాలిథిన్ కవర్‌లో తడిపి.. రబ్బర్ బ్యాండ్‌తో అంచులు బిగించండి. కొంత సేపటికి అది పీచు మిఠాయి అయి పోతుంది. ఇదొక పద్ధతి. ఐఏఎస్ సి మరో పద్ధతి: పంచదారలో పుడ్కలర్ కలపండి. దీన్ని మైక్రోవేవ్ సేఫ్ బౌల్లో వేసి అవెన్‌లో ఆ నిమిషం వేడి చేయండి. కరిగిన పంచదారను బయటకు తీయండి. అందులో శుభ్రమైన వైద్య స్ట్రా ఉంచి.. పంచదార ద్రవం సిలికాన్ మ్యాట్ మీద పడేలా ఊదండి అంతే. కాటన్‌డీ తయారైపోతుంది. వెంటనే పాలిథిన్ కవర్లో వేయండి.

# మీపై అజమాయిషీ చెలాయిస్తున్నారా !



**భార్యాభర్తల్లో ఇద్దరూ సమానమే! కానీ కొంతమంది భర్తలు తమ భార్యలపై అజమాయిషీ చెలాయించాలని చూస్తారు. అలాంటి వారిని 'ఆల్ఫా హస్బెండ్' అంటారు.** అయితే ఇలాంటి వాళ్లతో గొడవకు దిగకుండా, అదే సమయంలో ఆత్మ గౌరవాన్ని కోల్పోకుండా సమస్యను పరిష్కరించు కోవాలంటున్నారు నిపుణులు.

**నచ్చజెప్పండి!**భార్యాభర్తల మధ్య ఏ గొడవ ఉన్నా కలిసి కూర్చొని మాట్లాడు కుంటే పరిష్కారమవు తుందంటారు. ఈ నియమం పెత్తనం చెలాయించే భర్త విషయంలోనూ వర్తిస్తుంది. అయితే ఎదుటివ్యక్తి కోపంలో ఉన్నప్పుడు ఏం చెప్పినా వారికి అర్థం కాదు. తను కాస్త ప్రశాంతంగా ఒకచోట కూర్చున్నప్పుడు.. తన ప్రవర్తన వల్ల మీరు ఎంత ఇబ్బంది పడుతున్నారో విడమరిచి చెప్పండి. ఇద్దరి మధ్య జరిగే ఈ వాదనల వల్ల ఇటు మీరు, అటు మీ పిల్లలు ఎంతలా సతమతమవుతున్నారో వాళ్లకు నచ్చ జెప్పే ప్రయత్నం చేయండి. అలాగే వారు ప్రవర్తించ డానికి గల కారణాలేంటో కూడా నేరుగా అడగచ్చు. ఇలా మధ్య జరిగే సానుకూల చర్చనైనా మీ ఇద్దరిలో మార్పు తీసుకొచ్చే అవకాశం ఉంటుంది.

**ఆత్మన్యూనత వద్దు....**

అకారణంగా ఎదుటి వ్యక్తి మనపై పెత్తనం చెలాయిస్తున్నారంటే ఆత్మన్యూనతకు గురవడం హజం. ఇలాంటప్పుడే ఇతరులతో పోల్చుకోవడం, ఆత్మవిశ్వాసం కోల్పోవడం.. జరుగుతుంటాయి. ఇలాంటి ప్రతికూల భావనలు శారీరకంగా, మానసికంగా కుంగదీయడంతో అనుబంధానికి అవరోధాలుగా మారుతుంటాయి. ఈ ఆఫర్ మీపై మీరు నమ్మకం, గౌరవం డోల్పోకుండా ఉండేందుకు స్వీయ ప్రేమను పెంచుకోవడం ముఖ్యం, నచ్చిన పనులు చేయడం ఇష్టమైన వ్యాపకాలపై దృష్టి పెట్టడం వల్ల కొంతవరకు ఫలితం ఉంటుంది.


**ఆధారపడద్దు!** .. ఆర్థిక స్వేచ్ఛ ఉన్న మహిళల కంటే, వ్యక్తిగతంగా, ఆర్థికంగా తమపై ఆధారపడే భార్యల విషయంలోనే చాలామంది భర్తలు పెత్తనం చెలాయించాలని చూస్తారు. ఈ కావలసిన వా పూచిక పుల్లలా తీసిపడేస్తుంటారు. వాళ్ల నిర్ణయాలను, అభిప్రాయాలను ఏమాత్రం గౌరవించరు. భర్తలతో వేగలేక, తాము పడుతోన్న బాధ ఎవరితో చెప్పుకోలేక లోలోపలే కుమిలిపోతుంటారు ఇలాంటి చాలామంది భార్యలు. నిజంగా మీలో ప్రతిభ ఉంటే, మిమ్మల్ని మీరు నిరూపించుకోగలరన్న నమ్మకం ఉంటే ఎవరికీ తలవంచాల్సిన అవసరం లేదంటున్నారు నిపుణులు ఈ మీ చదువు, ట్యాలెంట్‌కి తగ్గ ఉద్యోగం వెతు క్కునే ప్రయత్నం చేయండి. ఒకవేళ వాళ్లు అడ్డుపడకుండా.. ఇద్దరి సంపాదన ఉంటే అది కుటుంబానికే మంచిదని సాను కూలంగా మాట్లాడే ప్రయత్నం చేయండి. ఇలా మీ కాళ్ల మీద మీరు నిలబడగలిగితే ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం రెట్టింపవు తాయి. ఇది పరోక్షంగా అనుబంధానికీ మేలు చేస్తుందంటున్నారు నిపుణులు. **ఆఖరీ ప్రయత్నంగా..!** ఎదుటివారు తమని తక్కువ చేసి చూస్తున్నారంటేనే కోపం కట్టలు తెంచుకోవడం సహజం. అలాగని ఎంత ప్రయత్నించినా వాళ్లు మారట్లేదని.. మీరూ వాళ్లలాగే గట్టిగా అరవడం, గొడవలు చేస్తే సమస్య పరిష్కారమవకపోగా.. మరింత జటిలమవుతుంది. కాబట్టి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోతే.. ఆఖరి ప్రయత్నంగా ఇద్దరూ కలిసి మానసిక నిపుణుల దగ్గరికి కౌన్సెలింగ్‌కి వెళ్లడం మంచిది. మీవారి ప్రవర్తనకు గల కారణాలేంటో తెలుసుకొని వాళ్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వడం, ఇద్దరితో మరోసారి మాట్లాడడం.. దీనివల్ల కొంతవరకు ఫలితం ఉంటుంది.

# 'మన శంకర వర ప్రసాద్ గారు' ఆల్ టైం ఇండస్ట్రీ హిట్ సెలబ్రేషన్




మెగాస్టార్ చిరంజీవి, హిట్ మెషిన్ అనిల్ రావిపూడి ల ఆల్ టైం ఇండస్ట్రీ హిట్'మన శంకర వర ప్రసాద్ గారు. విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో అలరించారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించిన ఈ చిత్రంలో నయనతార కథానాయిక నటించారు. శ్రీమతి అర్చన ఈ చిత్రాన్ని ప్రజెంట్ చేశారు. సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా జనవరి 12న విడుదలైన ఈ చిత్రం మెగా బ్లాక్ బస్టర్ సక్సెస్ ని అందుకొని రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్స్ తో హౌస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఆల్ టైం ఇండస్ట్రీ హిట్ (రీజనల్ ఫిల్మ్స్) సెలబ్రేషన్ ని గ్రాండ్ గా నిర్వహించారు. ఈ వేడుకలో సినిమా యూనిట్, డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ కి షీల్డ్స్ అందించారు. దర్శకులు కె రాఘవేంద్రరావు, వివి వినాయక్, నిర్మాత దిల్ రాజు, సుప్రియ యార్లగడ్డ పలువురు ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొన్నారు. మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ... అందరికీ నమస్కారం. మీ ఆనందంలో సక్సెస్ ని ప్రత్యక్షంగా చూస్తున్నాను. ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చి గత వైభవాన్ని మళ్లీ పునరావృతం చేసిన తెలుగు ప్రేక్షకులందరికీ మనస్ఫూర్తిగా శిరస్సు వంచి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. సంక్రాంతికి వచ్చి చిరంజీవి గారు ధనాధన్ చేశారు. అద్భుతమైన విజయాన్ని ఇచ్చిన తెలుగు ప్రేక్షకులందరికీ థాంక్యూ. మీ అందరి ఆదరణతో ఈ సినిమా తెలుగు ఫిలిం ఇండస్ట్రీలో బిగ్గెస్ట్ హిట్ అయింది. అన్ని ఆల్‌టైమ్ రికార్డ్స్ కి చిరంజీవి గారు అర్హులు. అందరికీ థాంక్యూ.2డైరెక్టర్ కె రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. ఈ వేడుకకు విచ్చేసిన అందరికీ నమస్కారం. ఈ విజయం సుస్మిత సాహు పై బాధ్యతని మరింత పెంచింది. చిరంజీవి గారు, అల్లు రామలింగయ్య గారు మేము అందరం చిన్నప్పటి నుంచి ఒక కుటుంబం లాగా పెరిగాము.డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. మరో అదిరిపోయే సంక్రాంతి, ఇరగదీసే సంక్రాంతి ఇచ్చిన ఆడియన్స్ కి థాంక్యూ. లాస్ట్ ఇయర్ విక్టరీ వెంకటేష్ గారితో సంక్రాంతికి వస్తున్నాం లాంటి విజయాన్ని ఇచ్చారు.ఇప్పుడు చిరంజీవి గారితో మరో అద్భుతమైన విజయాన్ని ఇచ్చారు.

# పద్మశ్రీ లేట్‌గా వచ్చినా లేటెస్ట్‌గా వచ్చింది: మురళీ మోహన్



గణతంత్ర దినోత్సవ వేళ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ పురస్కారాల్లో తనకు పద్మశ్రీ పురస్కారం దక్కడంపై సీనియర్ నటుడు, మాజీ ఎంపీ మాగంటి మురళీ మోహన్ హర్షం వ్యక్తం చేశారు.'అందరికీ నమస్కారం. నాకు చాలా సంతోషంగా ఉంది. ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూసిన పద్మ అవార్డు నిన్న సాయంత్రం ప్రకటించినప్పటి నుంచి అనేక మంది మిత్రులు, శ్రేయోభిలాషులు ఫోన్ చేశారు. వాళ్లందరితో నా సంతోషాన్ని పంచుకునే అవకాశం లభించింది. 'మీకు ఎప్పుడో రావాల్సింది.. ఇప్పుడైనా వచ్చింది అని అంటుంటే.. లేట్‌గా వచ్చినా లేటెస్ట్‌గా వచ్చింది అని చెప్పాను. అన్నీ మనం అనుకున్నప్పుడే రావు. ఏదైనా ఎదురు చూపుల తర్వాత దొరికితే దాని విలువ ఎక్కువ. మిత్రులందరికీ నా శుభాకాంక్షలు. ఇంత మంచి అవార్డును ఇచ్చిన ప్రధాని నరేంద్రమోదీగారికి,ఏపీ సీఎం చంద్రబాబు గారికి, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గారికి, చలన చిత్ర పరిశ్రమ ప్రముఖులందరికీ కృతజ్ఞతలు. అవార్డు అందుకున్న తర్వాత వివరంగా ప్రెస్‌మీట్ పెట్టి చెబుతాను. థ్యాంక్యూ అంటూ ఆయన ఓ వీడియో విడుదల చేశారు.మాగంటి మురళీ మోహన్ ఐదు దశాబ్దాలకు పైగా సినీ రంగంలో తనదైన ముద్ర వేశారు. నటుడిగానే కాకుండా నిర్మాతగా కూడా ఎన్నో సందే శాత్మక చిత్రాలను అందించారు. ఖిజగమే మాయఖి చిత్రంతో నటుడిగా అరంగేట్రం చేసిన మురళీ మోహన్, క్రమశిక్షణ గల నటుడిగా పేరు తెచ్చుకుని 350కి పైగా సినిమాల్లో నటించారు. ఆయన ప్రస్థానం ఎందరికో ఆదర్శం. మురళీ మోహన్ కేవలం హీరోగానే కాకుండా సహాయ నటుడిగా, విలన్‌గా కూడా రాణించి తన బహుముఖ ప్రజ్ఞను చాటుకున్నారు. ఎనభైవ దశకంలో ఎంతో బిజీగా ఉంటూనే నాణ్యమైన చిత్రాలను ప్రేక్షకులకు అందించడంలో ముందుండేవారు.

## తెర

# 'పద్మశ్రీ' పురస్కారం రావడం నా పూర్వజన్మ సుకృతం : రాజేంద్ర ప్రసాద్



మీడియా మిత్రులకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రేక్షక దేవుళ్లకు నమస్కారం.ఈ రోజు కేంద్ర ప్రభుత్వం నాకు 'పద్మశ్రీ' పురస్కారాన్ని ప్రకటించడం నా జీవితంలో మర్చిపోలేని రోజు. ఈ గౌరవం కేవలం నాకు మాత్రమే దక్కింది అని నేను అనుకోవడం లేదు. ఇది తెలుగు హాస్యానికి, వినోదాన్ని కోరుకునే సామాన్య ప్రేక్షకుడికి దక్కిన గౌరవంగా భావిస్తున్నాను.ఈ సందర్భంగా నా మనసు లోని మాట:కళలను గౌరవించి, నన్ను ఈ పురస్కారానికి ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వానికి, జ్యూరీ సభ్యులకు నా హృదయ పూర్వక ధన్యవాదాలు.అసలు నేను ఈ స్థాయిలో నిలబడటానికి, ఈ అవార్డు అందు కోవడానికి ముఖ్య కారణం మీరే. 48 ఏళ్లుగా నేను ఏ వేషం వేసినా, ఏ ప్రయోగం చేసినా మీరందించిన ప్రేమే నాకు ఈరోజు ఇంతటి గుర్తింపు తెచ్చింది. నాలాంటి ఒక నటుడిని, మీ ఇంటి మనిషిలా ఆదరించి, 'నటకిరీటి'ని చేసి, ఈ స్థాయికి తీసుకువచ్చింది మీ చప్పట్లే. ఆ ఋణం నేను ఎప్పటికీ తీర్చుకోలేను.నన్ను ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండమని దీవించిన మీ అందరికీ మరోసారి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను.

# 'ఓ..! సుకుమారి' తిరువీర్ ఫస్ట్ లుక్



యంగ్ హీరో తిరువీర్, ట్యాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ తమ గత చిత్రాలతో బ్లాక్‌బస్టర్ విజయాలు అందుకున్నారు. ఇప్పుడు ఈ ఇద్దరూ కలిసి విలేజ్ ఎంటర్టైనర్ 'ఓ..! సుకుమారి' చేస్తున్నారు. నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. విమర్శకుల ప్రశంసలు పొందిన తొలి సినిమా ఖిశివం భజేఖి తర్వాత ఈ బ్యానర్ లో రూపొందుతన్న చిత్రమిది. ఇప్పటికే దామిని పాత్రలో ఐశ్వర్య రాజేష్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన మేకర్స్, ఇప్పుడు తిరు వీర్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు.ఫస్ట్ లుక్‌లో తిరు వీర్ రగ్గడ్, మాస్సీ విలేజ్ క్యారెక్టర్‌గా యాదగిరిగా పరిచయమయ్యారు. విలేజ్ లో నడుచుకుంటూ వస్తున్న ఆయన లుక్ వెంటనే అటెన్షన్ గ్రాబ్ చేస్తుంది. స్లీవ్‌లెస్ బనియన్, కట్టుకున్న లుంగీ, భుజాలపై వేసుకున్న తువ్వాలు మొత్తంగా ఒక ఎర్తీ, అన్‌ఫిల్టర్డ్ ఫీల్‌ను క్యాప్చర్ చేశాయి. కర్లీ హెయిర్, గడ్డం, నోట్లో టూత్‌బ్రష్ వంటి డీటెయిల్స్ క్యారెక్టర్‌కు రా, లైవ్డ్‌ఇన్ ఆథెంటిసిటీని తీసుకొచ్చాయి. ఇక ఆయన నడక, బాడీ లాంగ్వేజ్ మొత్తం యాదగిరి అటిట్యూడ్‌ను స్ట్రాంగ్‌గా ప్రొజెక్ట్ చేస్తూ, ఫస్ట్ లుక్‌తోనే క్యారెక్టర్‌పై క్యూరియాసిటీని పెంచాయి. క్యూరియాసిటీని పెంచాయి.

# 'ఇరుముడి' అద్భుతమైన లుక్



'RT77 పవర్‌ఫుల్ టైటిల్ 'ఇరుముడి' అద్భుతమైన ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ మాస్ మహారాజా రవితేజ తన 77వ చిత్రం 'RT77 కోసం దర్శకుడు శివ నిర్వాణతో జతకట్టారు. ఈ చిత్రాన్ని ప్రముఖ పాన్‌ఇండియా బ్యానర్ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. రవితేజ పుట్టినరోజును సందర్భంగా, మేకర్స్ ఈరోజు ఈ చిత్రం టైటిల్, అద్భుతమైన ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారుఈ చిత్రానికి పవర్‌ఫుల్ 'ఇరుముడి' అనే టైటిల్ పెట్టారు. ఈ టైటఆధ్యాత్మిక ప్రాముఖ్యతను కలిగి ఉంది, ఇది అయ్యప్ప స్వామి దీక్షని సూచిస్తోంది. అద్భుతమైన ఫస్ట్ లుక్‌లో రవితేజ సాంప్రదాయ అయ్యప్ప మాల దుస్తులు ధరించిన శక్తివంతమైన ఆధ్యాత్మిక అవతార్ లో కనిపించారు. భక్తులతో నిండిన వేడుక ఊరేగింపులో, గొప్ప ఆనందోత్సాహాలతో కనిపించడం ఒక ట్రాన్స్ లాంటి వాతావరణాన్ని క్రియేట్ చేసింది. రవితేజ పాపని ఎత్తుకుని చిరునవ్వుతో కనిపించడం అందరినీ ఆకట్టుకుంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణ సంస్థ, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ.. ఇరుముడి 'RT77 ఇరుముడి ప్రతి భావోద్వేగం ఒక వేడుకే. మాస్ మహారాజా రవితేజ పుట్టిన రోజు శుభాకాంక్షలు. అయ్యప్పస్వామి ఆశీస్సులతో ఆయన ప్రారంభమవుతుంది. స్వామియే శరణ అయ్యప్పా.

# పద్మశ్రీ సిరివెన్నెల కాంస్య విగ్రహావిష్కరణ



తానా సాహిత్య విభాగం తానా ప్రపంచ సాహిత్య వేదిక.. ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారం తో మరియు ..అనకాపల్లి సిరివెన్నెల కళాపీఠం.. ఆధ్వర్యంలో .అనకాపల్లి, గాంధీనగర్, శ్రీ వెంకటేశ్వర స్వామి.. గుడి దగ్గరలో మాజీ మంత్రివర్యులు అనకాపల్లి శాసనసభ్యులు ..శ్రీ కొణతాల రామకృష్ణ.. గారి అధ్యక్షతన ప్రముఖ సినీ గీత రచయిత ..పద్మశ్రీ సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి కాంస్య విగ్రహావిష్క రణ.. సుప్రసిద్ధ సినీదర్శకులు 'త్రివిక్రమ్ శ్రీనివాస్' గారు చేతుల మీదగా మరియు సిరివెన్నెల సీతారామ శాస్త్రి గారి కుటుంబ సభ్యుల మధ్య విగ్రహ ఆవిష్క రణ ఘనంగా జరిగింది. అనంతరం పెంటకోట కన్వెన్షన్‌లో శాసన సభ్యులు శ్రీ కొణతాల రామకృష్ణ గారి అధ్యక్షతన శ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి గారి మహోత్సవ సభ అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి శ్రీ రామకృష్ణ గారు మాట్లాడుతూ రథసప్తమి రోజున అనకాపల్లిలో పుట్టి అనకాపల్లిలో పెరిగి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఒక సాహిత్య వేత్తగా ఒక గేయ రచయితగా అనకాపల్లికి గౌరవాన్ని తీసుకొచ్చిన సిరివెన్నెల సీతారామ శాస్త్రి విగ్రహ ఆవిష్కరణ ఆయన పుట్టిన ప్రాంతంలో ఆయన తిరిగిన ప్రాంతంలో గాంధీ .నగర్‌లో ఏర్పాటు చేయడం ఆ విగ్రహ ఆవిష్కరణకు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారి అల్లుడు మంచి అభిమాని అయిన ప్రముఖ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ గారు రావడం వారు చేతుల మీద పద్మశ్రీ అవార్డు గ్రహీత సిరివెన్నెల సీతారామశాస్త్రిగారి విగ్రహ ఆవిష్క రణ జరగడం గొప్ప విషయం ,

# డేంజరస్ బ్యాటర్లు ..సన్‌రైజర్స్ హైదరాబాద్‌లో


హెన్రిచ్ క్లాసెన్


అభిషేక్ శర్మ


ఇషాన్ కిషన్


నితీశ్ కుమార్


ట్రావిస్ హెడ్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)-2026 మరికొన్ని రోజుల్లో ప్రారంభం కాబోతుంది. అయితే ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లోని అత్యంత డేంజర్ టీమ్‌లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఒకటి. ఎంతో అలవోకగా 300 పరుగులు చేయగలదు. ఆ స్థాయిలో విధ్వంసం సృష్టించే బ్యాటర్లు ఈ జట్టులో ఉన్నారు. అయితే ఈసారి సన్‌రైజర్స్ టీం మరింత డేంజరస్‌గా కనిపిస్తోంది. వచ్చే ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ టీమ్‌లో బ్యాట్‌తో పరుగుల వర్షం కురిపించే అవకాశాలున్న ఐదుగురు బ్యాటర్లు ఉన్నారు. ఈ లిస్ట్‌లో ఫస్ట్ ప్లేస్‌లో ప్రపంచ 4ఇనెంబర్ వన్ టి20 బ్యాటర్ అభిషేక్ శర్మ ఉన్నాడు. ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్న ఈ యువ బ్యాటర్ ఇంటర్నేషనల్ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్నాడు. సన్ రైజర్స్ హైదరాబాద్‌కు ఇతని కంటే పెద్ద మ్యాచ్ విన్నర్ మరొకరు ఉండకపోవచ్చు. ఐపిఎల్‌లో 77 మ్యాచ్‌లలో 1816 పరుగులు చేయగా, స్ట్రైక్ రేట్ 163.02గా ఉంది. ఇక సెకండ్ ప్లేస్‌లో మరో ఎడమచేతి వాటం విధ్వంసక బ్యాటర్ ఇషాన్ కిషన్ ఉన్నాడు. ఇషాన్ కూడా అంతర్జాతీయ క్రికెట్‌లో అదరగొడుతున్నాడు. వచ్చే ఐపిఎల్‌లో బౌలర్లకు చుక్కలు చూపించడం ఖాయంగా కనిపిస్తోంది. 2025లో సన్‌రైజర్స్ ఇతడిని భారీ డబ్బులతో కొనుగోలు చేసింది. ఆ సీజన్‌లో 13 ఇన్నింగ్స్‌లలో 354 పరుగులు చేశాడు. సన్ రైజర్స్ తరపున ఆడిన తొలి మ్యాచ్‌లోనే ఇషాన్ సెంచరీ బాదాడు. థర్డ్ ప్లేస్‌లో ఆస్ట్రేలియా విధ్వంసక బ్యాటర్ ట్రావిస్ హెడ్ ఉన్నాడు. ఐపిఎల్‌లో హెడ్ ఇప్పటికే తనదైన ముద్ర వేశాడు. 37 ఐపిఎల్ ఇన్నింగ్స్‌లలో 170.03 స్ట్రైక్ రేట్‌తో 1,146 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, 8 అర్ధ సెంచరీలు ఉన్నాయి. క్రీజులో ఉన్నంత సేపు బౌలర్లకు చుక్కలు చూపిస్తాడు. హైదరాబాద్ తరఫున మరోసారి విధ్వంసం సృష్టించే అవకాశాలు ఉన్నాయి. నాలుగవ స్థానంలో దక్షిణాఫ్రికా డేంజరస్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ ఉన్నాడు. క్లాసెన్ 2023 నుంచి హైదరాబాద్ తరఫున ఆడుతున్నాడు. ఇతడు కేవలం 5 ఓవర్లు క్రీజులో ఉన్నా మ్యాచ్‌ను మలుపు తిప్పగలడు. గత సీజన్‌లో 13 ఇన్నింగ్స్‌లలో 172.70 స్ట్రైక్ రేట్‌తో 487 పరుగులు చేశాడు. చివరి మ్యాచ్‌లో సెంచరీ కూడా బాదాడు. చివరిగా ఐదవ స్థానంలో టీమిండియా ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ ఉన్నాడు. ఇతను మరోసారి సన్‌రైజర్స్ తరఫున ఆడనున్నాడు. ఐపీఎల్‌లో 28 మ్యాచ్‌లలో 485 పరుగులు చేశాడు. అతని అత్యధిక స్కోరు 76. స్ట్రైక్ రేట్ 130కి పైగా ఉంది.



# టాటా స్టీల్ చెస్ .. గుకేశ్ విజయం

**న్యూఢిల్లీ:** టాటా స్టీల్ చెస్ విజ్క్ ఆన్ జి-2026, 8వ రౌండ్‌లో ప్రపంచ ఛాంపియన్, భారత్ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ విజయంతో రెండు ఓటముల నుండి తిరిగి పుంజుకున్నాడు. అతను స్లోవేనియాకు చెందిన వ్లాదిమిర్ ఫెడోసీవ్‌ను బ్లాక్ పావులతో ఓడించాడు. వ్లాదిమిర్ రాజీనామా చేసే ముందు 96.6 అద్భుతమైన ఖచ్చితత్వంతో 10వ స్థానంలో ఉన్న గుకేశ్, తన ప్రత్యర్థిని ఓడించిన తరువాత 4/8 పాయింట్లతో సంయుక్తంగా 6వ స్థానాకి ఎగబాకాడు. అంతకు ముందు గుకేశ్ ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నోడిర్‌బెక్ అబ్దుసత్తోరోవ్‌తో వరుసగా రెండు పరాజయాలను చవిచూశాడు. తర్వాత డ్రాష్ స్థానాల నుండి రెండు యాక్ బ్లండర్‌ల తర్వాత హోమ్ ఫేవరెట్ అనిష్ గిరితో ఓడిపోయాడు. ఇక గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞాన్ తన ఎనిమిదో రౌండ్ మ్యాచ్ అప్‌లో తుర్కియేకు చెందిన యాగిజ్ కాన్ ఎర్డోగ్మన్‌తో జరిగిన టోర్నమెంట్‌లో వరుసగా ఆరో డ్రా ఆడాడు. డిపెండింగ్ ఛాంపియన్ ఇప్పుఉ 3/8 పాయింట్లతో ప్రస్తుతం చివరి మూడు స్థానాల్లో ఉన్నాడు. ఇదే సమయంలో ఇక ఐదు రౌండ్లు మాత్రమే మిగిలి ఉండగా, టైటిల్ రేసుకు దాదాపుగా దూరంగా ఉన్నారు. మరోవైపు బ్లాక్ పావులతో గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఎరిగైసి తన ప్రత్యర్థి అరవింద్ చిదంబరంతో జరిగిన మ్యాచ్‌ను డ్రా గా ముగించాడు. గత నాలుగు ఆటల్లో కేవలం ఒక పాయింట్ మాత్రమే గెలిచిన అర్జున్ ఇప్పుడు కేవలం 3.5/8 పాయింట్లతో 11వ స్థానానికి పడిపోగా, అరవింద్ 2.5/8 పాయింట్లతో చివరి స్థానంలో నిలిచాడు.

# ఛాంపియన్‌గా సన్‌రైజర్స్ హైదరాబాద్

## మూడోసారి ట్రోఫీ కైవసం




**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికా20 (ఎస్ఎ20)-(2025-26) సీజన్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. దక్షిణాఫ్రికాలోని కేప్ టౌన్‌లో జరిగిన ఉత్కంఠ భరిత ఫైనల్‌లో ప్రిటోరియా క్యాపిటల్స్‌ను ఓడించి, సన్‌రైజర్స్ నాలుగేళ్లలో మూడవసారి ఛాంపియన్‌గా నిలిచింది. సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ ఎస్ఎ20 చరిత్రలో ఓటమి అంచున ఉన్న స్థితి నుంచి అద్భుత విజయాన్ని అందుకుని అత్యంత విజయవంతమైన జట్టుగా రికార్డును సుస్థిరం చేసుకుంది. ఈ ఫైనల్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ప్రిటోరియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. డెవాల్డ్ బ్రెవిస్ (56 బంతుల్లో 101 పరుగులు) ఒంటరి పోరాటం చేసి సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఇక ఆ తర్వాత బ్రెయిన్ పార్సన్స్ 30 బంతుల్లో 30 పరుగులు, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 11 బంతుల్లో 17 పరుగులు చేశారు. ప్రిటోరియా విధించిన 159 పరుగుల లక్ష్య ఛేదనలో సన్‌రైజర్స్ ప్రారంభంలోనే కష్టాల్లో పడింది. కేవలం 48 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి ఓటమి దిశగా సాగుతున్నట్లు కనిపించింది. కష్టాల్లో ఉన్న జట్టును కెప్టెన్ ట్రిస్టన్ స్టబ్స్ (41 బంతుల్లో 63 పరుగులు), మాథ్యూ బ్రీట్జ్‌కే (49 బంతుల్లో 68 పరుగులు) ఆదుకున్నారు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు విడదీయరాని 114 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి, 4 బంతులు మిగిలి ఉండగానే ఆరు వికెట్ల తేడాతో జట్టును గెలిపించారు. క్వింటన్ డికాక్ 15 బంతుల్లో 18 పరుగులు చేయగా, చివరి ఓవర్‌లో 9 పరుగులు అవసరం కాగా, స్టబ్స్ వరుసగా రెండు సిక్సర్లు బాది మ్యాచ్‌ను ముగించాడు.




# హర్యానా విక్టరీ

## ప్లేఆఫ్ నుండి ముంబయి ఔట్

**న్యూఢిల్లీ:** ప్రో రెజ్లింగ్ లీగ్ 2026 నుండి హర్యానా థండర్స్ తన ప్రత్యర్థి ముంబై క్యాపిటల్స్‌ను ప్లేఆఫ్ పోటీ నుంచి బయటకు పంపింది. హర్యానా థండర్స్ 6-3తో టైగర్స్ ఆఫ్ ముంబై దంగల్స్‌పై విజయం సాధించింది. నాలుగు పాయింట్లతో మూడో స్థానంలో నిలిచిన హర్యానా ఈ గెలుపుతో పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది, ఈ సీజన్‌లో ముంబై ఒక్క విజయం కూడా సాధించలేదు. 76 కిలోల మహిళల తొలి పోటీలో జ్యోతి బెర్వాల్‌పై కాజల్ ధోచక్ పట్టు సాధించి హర్యానా సత్తా చాటింది. మహిళల విభాగంలో (62) హర్యానాకు చెందిన ఇరినా కొలియాడెంకో ప్రత్యర్థి సరికా మాలిక్‌ను 28 సెకన్లలోపు 16-0 విజయాన్ని సాధించి కొత్త రికార్డు నెలకొల్పింది.
పుష్పపై (57) జరిగిన పోటీలో నేహా సంగ్వాన్ (హర్యానా) అద్భుత ప్రదర్శనను కొనసాగించి 18-3తో విజయాన్ని సాధించింది. ప్రపంచ ఛాంపియన్, హర్యానా థండర్స్ కెప్టెన్ యుయి సుసాకి (53) కిలోల క్లినికల్ సామర్థ్యంతో జట్టుకు వరుసగా నాలుగు విజయాలు సాధించేలా చేసింది. ఇక పురుషుల టైలో (65) తుమూర్ ఓచిర్ తుల్గా ఏకపక్షంగా పూర్తి చేశాడు. తుల్గా ప్రారంభం నుంచే ప్రత్యర్థిపై 13-0తో గెలుపొందాడు. పురుషుల టైలో (74) ముంబైకి చెందిన టైగర్స్ చివరకు దీపక్ ద్వారా 10-6 తేడాతో విజయం సాధించి జట్టును బోర్డులో నిలబెట్టాడు. హోరాహోరీగా జరిగిన వ్యూహాత్మక పోటీలో అనిరుధ్ గులియా 3-2తో ఒలెక్సాండర్ ఖోట్సియానివ్స్కిని ఓడించడంతో హెవీవెయిట్ విభాగంలో హర్యానా తన పట్టును తిరిగి పొందింది. ముకుల్ దహియా (86) ముంబై తరఫున బలమైన ప్రదర్శన ఇచ్చాడు. సచిన్‌పై దాడి చేసి 13-0తో విజయాన్ని సాధించి టైగర్స్‌కు రెండో విజయాన్ని అందించాడు. అంకుష్ 13-4 తేడాతో చంద్రంపై ఘన విజయం సాధించాడు.

# హాకీ ఇండియా లీగ్ ఫైనల్స్‌కు రాంచీ రాయల్స్

## హైదరాబాద్ టూఫాన్స్ 3-2తో ఓటమి




**న్యూఢిల్లీ:** పురుషుల హాకీ ఇండియా లీగ్ 2026లో రాంచీ రాయల్ హ్యాట్రిక్‌తో ఫైనల్‌కు అడుగుపెట్టింది. క్వాలిఫయర్ 2లో రాయల్స్ 3-2 తేడాతో హైదరాబాద్ టూఫాన్స్‌ను ఓడించింది. మ్యాచ్ ప్రారంభంలో హైదరాబాద్ దూకుడుగా ఆరంభించింది. ఐదవ నిమిషంలోనే జాకబ్ ఆండర్సన్ స్కోరింగ్ ప్రారంభించాడు. రాజిందర్ సింగ్ బహుళ డిఫెండర్లను దాటుకుని ఆండర్సన్‌కు అందించడం టూఫాన్స్‌కు ఊపునిచ్చింది. దీంతో వారు లక్ష్యాన్ని తృటిలో కోల్పోయిన తదుపరి లాంగ్‌రేంజ్ ప్రయత్నం ద్వారా తమ ప్రయోజనాన్ని రెట్టింపు చేసే అవకాశం కలిగింది.
హైదరాబాద్ జట్టు డిఫెన్స్‌లో క్రమశిక్షణా రాహిత్యాన్ని రాంచీ రాయల్స్ ఉపయోగించుకుంది. వరుసగా వచ్చిన రెండు పెనాల్టీ కార్నర్‌లు మ్యాచ్‌ను మలుపు తిప్పాయి. మన్‌ప్రీత్ సింగ్ వ్యూహాత్మక నిర్ణయంతో బెల్జియన్ స్ట్రైకర్ 13వ, 15వ నిమిషాల్లో గోల్‌గా మార్చాడంతో తొలి క్వార్టర్‌లో రాయల్స్‌కు 2-1 ఆధిక్యం లభించింది. రెండవ క్వార్టర్‌లో రెండు జట్లు అనేక అవకాశాలను సృష్టించినప్పటికీ స్కోరును జోడించలేకపోయాయి. విరామం తర్వాత, రాయల్స్ (34) మరో పెనాల్టీ కార్నర్‌ను హ్యాట్రిక్‌ను పూర్తి చేసి ఆధిక్యాన్ని 3-1కి పెంచింది. అమన్‌దీప్ లక్రా (38) పెనాల్టీ కార్నర్‌తో సజీవంగా ఉంచడంతో హైదరాబాద్ తిరిగి పోరాడింది. చివరి క్వార్టర్‌లో టూఫాన్స్ నుండి నిరంతర ఒత్తిడి ఎదురైనా రాయల్స్ దృఢంగా వ్యవహరించి మ్యాచ్‌ను విజయం వైపుకు మళ్లించింది.

# పిఎం ఇ-డ్రైవ్ మరో రెండేళ్లు పొడిగించండి

## కేంద్రానికి ఇ2వీలర్ల ఉత్పత్తిదారుల ప్రతిపాదన


వాణిజ్యం

**ముంబయి, జనవరి 26:** భారత్ విద్యుత్ టూవీలర్ల మార్కెట్ ఇతోధిక వృద్ధికి గాను ఈ రంగానికి సమకూర్చిన పిఎం ఇడ్రైవ్ స్కీంను మరింతగా పొడిగించాలని ఉత్పత్తిదారుల సమాఖ్య కోరుతోంది. ఎలక్ట్రిక్‌డ్రైవ్ రివొల్యూషన్ ఇన్ ఇన్నొవేటివ్ వెహికల్ ఎన్‌హాన్స్‌మెంట్ స్కీంను పిఎం ఇ డ్రైవ్‌గా పిలుస్తారు. ఈ పథకం మార్చి నెలవరకూ పొడిగిస్తే మరింతగా ప్రోత్సాహకరంగా ఉంటుందని ఈ పథకం విత్‌డ్రాచేస్తే డిమాండ్ తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేసింది. అప్‌ఫ్రంట్ వ్యయం తగ్గించడంతో ఈ స్కీం ఎక్కువ మేలుచేస్తుందని, కొనుగోలుదారులు కూడా ఈ పాలసీని చూసి మరీ కొంటున్నట్లు చెపుతున్నది. విద్యుత్ విభాగంలో టూ, త్రీ వీలర్ల ఉత్పత్తిసంస్థ జూపేరియా ఆటోసిఇఒ అయుష్ లోహియా మాట్లాడుతూ విద్యుత్ వాహనాల కొనుగోలుకు సబ్సిడీలు కీలకంగా పనిచేస్తాయన్నారు. మొదటిసారి కొనుగోలుదారులకు మరింత ప్రోత్సాహకంగా ఉంటుందన్నారు. వీటిని విత్‌డ్రా చేస్తే డిమాండ్ ఆటోమేటిక్‌గా పడిపోయి సంస్థలకు నష్టాలు వస్తా యన్నారు. ఈ సబ్సిడీని రద్దుచేస్తే ఈ2వీలర్లకు రూ.ఆరు నుంచి రూ.12 వేల వరకూ ఆన్‌రోడ్ ధరలు పెరుగుతాయన్నారు. ఎవియమ్ స్మార్ట్ మొబిలిటీ సిఇఒ సమీర్ మోయిదీన్ మాట్లాడుతూ ప్రోత్సాహకాలే ఈవీ రంగం వృద్ధికి కారకాలుగా నిలుస్తున్నాయని, ప్రభుత్వం ఈ ప్రోత్సాహకాలను కొత్త ఆర్థిక సంవత్సరంలో కూడా కొనసాగిస్తేనే ఈ రంగానికి మనుగడ మరింత పెరుగుతుందన్నారు. పీఎం ఈడ్రైవ్ స్కీను 2024 సెప్టెంబరులో ప్రకటించిన కేంద్రం 1772 కోట్లు కేటాయించింది. మొత్తం 2.48 లక్షల ఈ2వీలర్లకు ప్రయోజనం కలిగే విధంగా ప్రకటించింది. ఈస్కీం కింద ఉత్పత్తిదారు రూ.10వేలు వంతును ఒక్కోస్కూటర్‌కు క్లెయిమ్‌చేసుకోవచ్చు. లక్షలోపు ఉన్న స్కూటర్లకు పదివేలు అదనపు లాభం కలుగుతుంది. ఈ2వీలర్లు, ఈ3వీలర్లు, ట్రక్కులు, బస్సులు, ఛార్జింగ్ వనరులు అన్నింటికి కూడా వర్తింప చేసేవిధంగా మొత్తం రూ.10,900 కోట్లతో ప్రణాళికను అమలుకు తెచ్చారు. వీటిలో ఈ2వీలర్ల స్కీం మార్చి 2026వరకే ఉంది. అందువల్ల 2028 మార్చి వరకూ ట్రక్కులు, బస్సులకు పొడిగించినట్లే టూత్రీవీలర్లకు కూడా పొడిగించాలని కోరుతున్నారు.




# నింగిని తాకుతున్న పసిడి, వెండి ధరలు

**న్యూఢిల్లీ,జనవరి 26:** బంగారం వెండిధరలు చుక్కలుచూపిస్తున్నాయి. దేశంలో పసిడి ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. స్వల్పంగా తగ్గినా మరుసటిరోజు భారీ వృద్ధిని నమోదుచేస్తున్నాయి. ప్రత్యేకించి ట్రంప్ సుంకాల నిర్ణయాలేనని తెలుస్తోంది. సోమవారం బంగారం ధరలపరంగా 24 క్యారెట్ల బంగారం రూ.2450 పెరిగి రూ.162,710 వద్దట్రేడ్ అయింది. పదిగ్రాముల 22 క్యారెట్ల బంగారం రూ.2250 పెరిగి రూ.1,49.150 కి వచ్చింది. ఇక 18 కేరట్ల తులం బంగారం కూడా రూ.1840 పెరిగి రూ.1,22,030గా ఉంది. దేశవ్యాప్తంగాచూస్తే సగటుధర గ్రాముకు 245 పెరిగింది. ఒక్క గ్రాము రూ.16,271వద్దట్రేడ్ అయింది. ఈఈ కేరట్లు రూ.14,915, 18 కేరట్లు తులం రూ.12,203 వద్దట్రేడ్ అయ్యాయి. చెన్నై పరంగా చూస్తే రూ.1,63,910గా నడిచింది. 22 కేరెట్లు ధరలు రూ.1,50,250వద్ద ముగిసింది. ముంబయి ధరలపరంగా చూస్తే రూ.1,62,710గా ఉంది. ఇంచుమించుగా హైదరాబాద్ ధరలే కొనసాగాయి. ఢిల్లీలో అయితే రూ.1.63లక్షలుగా ఉంది. కోల్‌కత్తా బెంగళూరు నగరాల్లో కూడా హైదరాబాద్ ధరలే నడిచాయి. ఇక వెండిధరలు కూడా పసిడితో పాటే చుక్కలనంటుతున్నాయి. ఒక్క హైదరాబాద్‌లోనే గ్రాము రూ.375గా నడుస్తోంది. అంటే కిలోకు ఒక్కసారిగా పదివేల రూపాయలు పెరిగింది. రూ.3.75 లక్షలుగా కొనసాగుతోంది. ముందురోజు రూ.3.65 లక్షలున్న వెండి ధరలు ఒక్కసారిగా రూ.10వేలు పెరిగాయి.

# 7 నగరాల్లో గ్లోబల్‌కంపెనీలు.. భారీగా ఆఫీస్ స్పేస్ లీజ్



**న్యూఢిల్లీ,జనవరి 26:** అంతర్జాతీయ కంపెనీలు భారత్‌లో గత ఏడాది ఆఫీస్ స్పేస్ కొనుగోలులో ముందున్నాయి. మొత్తం ఆఫీస్‌స్పేస్‌లో 60 శాతం గ్లోబల్‌కంపెనీలే తీసుకున్నట్లు జోన్స్ లాంగ్‌లాసెల్లీ సంస్థ ప్రకటించింది. జెఎల్‌ఎల్ నివేదికప్రకారం స్థూలంగా 83.3 మిలియన్ చదరపు అడుగులు గత ఏడాది లీసులు పెరిగాయి, అంతకు ముందు సంవత్సరం 77.2 మిలియన్‌చదరపు అడుగులనుంచి 8శాతం పెరిగినట్లు వెల్లడించింది. ఏడునగరాల్లో ఈవృద్ధి మరింతపెరిగిందన్నారు. ముంబయి, బెంగళూరు, ఢిల్లీ, ఎన్సీఆర్, పూణె, హైదరాబాద్, చెన్నై, కోల్‌కత్తా నగరాల్లోనే ఆఫీసు లీజింగ్ భారీగా పెరిగింది. గత ఏడాది గ్లోబల్ సంస్థలు 48.6 మిలియన్ చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ తీసుకున్నారు. మొత్తం స్పేస్‌లో 58శాతం వాటాతో ఉన్నాయని ప్రత్యేకించి మద్రాసు, బెంగళూరు, హైదరాబాద్‌లో వృద్ధి భారీగా కనిపిస్తోంది. ఈ లీజు నివేదికతోనే భారత్ వ్యూహాత్మకంగా బిజినెస్ హబ్‌గా మారుతున్నదనడానికి నిదర్శనంగా మారిందని జెఎల్‌ఎల్ వెల్లడించింది. ఇంగ్లీషుభాషలో నైపుణ్యం ఉన్న సిబ్బంది ప్రతినిధులు అందుబాటులో లీజులకు లభించేవిధంగా జరిపే సంప్రదింపులు అంతర్జాతీయ సంస్థలు ఈ నగరాల్లోకి మొగ్గుచూపేందుకు కారణం అయ్యాయి. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకోసం ఈ సంస్థలు 31.4 మిలియన్ చదరపు అడుగుల స్థలాన్ని లీజుకు తీసుకున్నట్లు తెలిపాయి. దేశీయ సంస్థలు కూడా 34.7 మిలియన్ చదరపు అడుగులు లీజుకు తీసుకున్నాయి. వర్క్‌స్పేస్‌లకు ఉన్న డిమాండ్‌లో మొత్తం 42శాతం వాటాతో ఉన్నాయి. భారత్ ఆఫీసు స్పేస్ లీజింగ్‌లో జిసిసిలు కీలకంగా నిలిచాయని జెఎల్‌ఎల్ సీనియర్ ఎండి రాహుల్ అరోరా తెలిపారు. ఎక్కువశాతం బెంగళూరుకు ప్రాధాన్యం పెరుగుతోంది. అదేవిధంగా హాంటో వర్క్‌స్పేస్ సంస్థమాట్లాడుతూ భారత్‌లో ఆఫీసు లీజింగ్ లావాదేవీలు రోజురోజుకూ పెరుగుతు న్నాయని, సరళీకృత లీజులతో వర్క్‌స్పేస్‌లు లభిస్తున్నందున భారత్‌వైపు వస్తున్నారని అనానరు. అంతేకాకుండా ట్యాలెంట్‌పూల్ అత్యధికంగా భారత్‌లో లభిస్తోంది. హైక్వాలిటీ గ్రేడ్ ఎ స్పేస్‌లకు మరింత డిమాండ్ ఉందని, వ్యూహాత్మకంగా ధరలు కూడా అందుబాటులోనే వాటికి అందుతున్నాయన్నారు. జిసిసిలకు ఎక్కువ ప్రాధాన్యం వస్తోందని ఆయన అన్నారు.

# కేంబ్రిడ్జితో కలిసి భారత్‌లో తొలి రియల్‌ఎస్టేట్ స్కూల్

## గురుగ్రామ్‌లో ఏర్పాటుకు ప్రాప్ ఈక్విటీ సన్నాహాలు



**న్యూఢిల్లీ,జనవరి 26:** రియాల్టీ విశ్లేషణ సంస్థ ప్రాప్ ఈక్విటీ మాతృసంస్థ పిఇ ఎనలిటిక్స్ కేంబ్రిడ్జి యూనివర్సిటీ సహకారంతోకొత్తగా భారత్‌లో రియల్‌ఎస్టేట్ స్కూలును స్థాపించేందుకు ముందుకువచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం కేంబ్రిడ్జిలోని ల్యాండ్ ఎకానమి విభాగం సాంకేతిక సాయంతోపాటు బోధనాపద్ధతుల్లోకూడా మద్దతునిస్తుంది. రియల్‌ఎస్టేట్ విద్యా కార్యక్రమాల్లో కేంబ్రిడ్జి కీలకంగా పనిచేస్తుందని తేలింది. భారత్‌లోని రియల్‌ఎస్టేట్ సెక్టార్‌లో మరింతగా నైపుణ్యాలు పెంచేందుకు వీలు కలుగుతుందని పిఇ ఎనిలిటిక్స్ కంపెనీ ప్రకటించింది. వాణిజ్యపరంగా వృద్ధి, యాజమాన్యాలకు మెళకువలతోపాటు రంగం మరింత వేగంగా వృద్ధిచెందేవిధంగా ఈ స్కూలులో విద్యాబోధన ఉంటుంది. ఈస్కూలు ఏర్పాటయితే భారత్‌లో మొట్టమొదటి రియల్‌ఎస్టేట్ సూనకలును ప్రాప్ ఈక్విటీ సంస్థ ఏర్పాటు చేసినట్లవుతుంది. ఈ కొత్త స్కూలును గురుగ్రామ్‌లో 2027 విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించాలని సంస్థ నిర్ణయించింది.

# కోటక్ మహీంద్ర నికరలాభం రూ.3446.14కోట్లు




**ముంబయి, జనవరి 26:** ప్రైవేటు రంగంలోని కోటక్ మహీంద్ర బ్యాంకు మూడోత్రైమాసికంలో నికరలాభం నాలుగుశాతం పెరిగింది. బ్యాంకు నికరలాభమే 4.28శాతం ఉన్నట్లు ప్రకటించింది. మొత్తం 3446.14 కోట్లు ఆర్జించినట్లు ప్రకటించింది. అలాగే మొత్తం రాబడుల్లోకూడా 4.3శాతంవృద్ధిని నమోదుచేసింది. 16,741.05 కోట్లుగా ఉన్నట్లు వెల్లడించింది. నిర్వహణలాభం కూడా 3.84శాతంపెరిగి రూ.5379.77 కోట్లుగా ఉంది. ఇక బ్యాంకు తక్షణ కేటాయింపులు కూడా 1.95శాతంపెంచింది. 809.58 కోట్ల రూపాయలుగా ఉన్నట్లు తెలిపింది. నికకరవడ్డీ ఆదాయం రూ.7565 కోట్లుగా ఉంది. నికరవడ్డీ మార్జిన్ 4.93శాతంనుంచి 5.54శాతానికి తగ్గింది. బ్యాంకు నిర్వహణ ఖర్చులు 8శాతంపెరిగి రూ.5023కోట్లుగా ఉన్నాయి. కొత్త లేబర్‌కోడ్‌ల వినియోగంతో రూ.96 కోట్లు అదనపు భారం పడింది. ఈ మొత్తం మినహాయిస్తే బ్యాంకు నిర్వహణ ఖర్చులు రూ.4927 కోట్లుగా ఉన్నాయి. రుణ వ్యయాలు కూడా సాలీనా 0.63శాతంపెరిగాయి. మొత్తం డిపాజిట్లు ఈ మూడునెలల్లో 15శాతం పెరిగి రూ.5,42,638 కోట్లుగా ఉన్నాయి. కరెంట్ డిపాజిట్లుకూడా రూ.75,596 కోట్లకు చేరాయి. 14శాతం పెరిగాయని బ్యాంకు తెలిపింది. నికర అడ్వాన్సులు 16 శాతంపెరిగి 4,80,673 కోట్లకు చేరాయి. స్థూల నరర్థక ఆస్తులు 1.30శాతం క్షీణించాయి. నికర నిరర్థక ఆస్తులు కూడా 0.31శాతంమేరకకుతగ్గాయని బ్యాంకు ఆర్థిక పరిపుష్టిపెరిగిందని వెల్లడించింది. కేటాయింపుల నిష్పత్తి కూడా డిసెంబరు చివరినాటికి 76శాంగా ఉంది. అలాగే బ్యాంకు రూ.15వేలకోట్ల ఎన్సీడీల జారీకి బోర్డు ఆమోదం తెలిపింది. ఒకటి లేదా రెండు విడ తలుగా ఈ ఎన్సీడీలు జారీఅవుతాయి. కోటక్ గ్రూప్‌లో ఉన్న కోటక్ మహీంద్ర బ్యాంకు విభిన్న రంగాలకు విస్తరించింది. వైహికల్ ఫైనాన్స్, కన్సూమర్ రుణాలు, కార్పొరేట్ ఫైనాన్స్, స్థిరాస్థి పునర్వ్యవస్తీకరణ వంటివాటిలో నిమగ్నం అయింది.

# యాక్సిస్ బ్యాంకు నికరలాభం రూ.6490 కోట్లు




**ముంబయి,జనవరి 26:** ప్రైవేటురంగంలోని యాక్సిస్‌బ్యాంకు రూ.2.9 శాతం నికరలాభాల్లో వృద్ధినమోదుచేసింది. స్థిరాస్తిప్రమాణాలు పెంపొందడమే ఇందుకుకారణం. నికరలాభం రూ.6304 కోట్లనుంచి రూ.6490 కోట్లకు పెరిగింది. మార్కెట్‌నిపుణులు మాత్రం 6708 కోట్లుగా అంచనావేసినా సమీపానికి అంచనాలు వచ్చినట్లు తెలుస్తోంది. బ్యాంకు నిరర్థక ఆస్తులు తగ్గాయి. స్థూల నిరర్థక ఆస్తులు 1.4శాతం క్షీణిస్తే నికర నిరర్థక ఆస్తులు 0.42శాతంకు చేరుకున్నాయి. నికరలాభం 2.9శాతంపెరిగింది. నికర వడ్డీ ఆదాయం ఐదుశాతంపెరిగి రూ.14,287 కోట్లు రాగా కకేటాయింపులు కూడా 4.2శాతం పెరిగి 2246 కోట్లకు చేరాయి. నికర వడ్డీ మార్జిన్ 3.64శాతంగా ఉంది. కేటాయింపులు కూడా 4.2శాతంపెరిగాయి. బ్యాంకు మొత్తం డిపాజిట్లు 15శాతం పెరిగాయి. త్రైమాసికం వారీగాచూస్తే ఐదు శాతం పెరిగినట్లు తేలింది. కరెంటు ఖాతా డిపాజిట్లు 20శాతం పెరిగాయి. పొదుపుఖాతాల డిపాజిట్లుకూడా 11శాతంగా ఉన్నాయి. టర్మ్ డిపాజిట్లు 16 శాతం వృద్ధి ఉంది. కాసా డిపాజిట్లుకూడా మొత్తం డిపాజిట్లలో 39శాతం వాటాతో ఉన్నాయి. బ్యాంకు అడ్వాన్సులు 14శాతం పెరిగాయి. త్రైమాసికంవారీగా నాలుగుశాతం పెరిగి రూ.11.59 లక్షలకోట్లకు చేరాయి. రిటైల్‌రుణాలుకూడా ఆరుశాతం వార్షికపద్ధతిలో పెరిగినట్లు తేలింది. మొత్తం రుణ బుక్‌లో 73శాతం వాటాతో ఉన్నాయి. వీటిలో 26శాతం గృహరుణాలు న్నాయి. ఎస్ఎంఇ అడ్వాన్సులు కూడా 22శాతం పెరిగాయి. కార్పొరేట్‌రుణాలు 27శాతం వరకూ ఉన్నాయి. బ్యాంకు మొత్తం సంపద కూడా వార్షికవృద్ధిగా 15శాతం పెరిగి రూ.1.96 లక్షలకోట్లకు చేరింది. కేపిటల్ అడక్వసీ రేషియో కూడా 16,55శాతంగా ఉంది. ప్రనతివాటా బుక్ వాల్యూ కూడా రూ.553 నుంచి రూ.634కి పెరిగింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.